అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సోమవారం 21-10-2024

సంపుటి : 10 సంచిక : 242 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



బండి ఇదేం తొండి?

నిరుద్యోగులకు మోడీ టోకరా

రైల్వేలో ఉద్యోగాలు భర్తీ చేయకుండా రిటైర్డ్ ఉద్యోగులకే మళ్లీ కొలువులు

65 ఏండ్లలోపు వారిని మళ్లీ తీసుకోవాలని ఉత్తర్వులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గ్రూప్-1 మెయిన్స్ విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నదని అశోక్‌నగర్ కోచింగ్ సెంటర్ల వద్ద కేంద్ర మంత్రి బండి సంజయ్ శనివారం రాత్రి నానా హంగామా చేసిన విషయం గుర్తుంది కదా! చివరకు కేంద్రమంత్రిని రాష్ట్ర పోలీసులు అదుపులోకి తీసుకొని, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వదిలేశారు. సీన్ కట్ చేస్తే...కేంద్రంలోని మోడీ సర్కార్ రైల్వేశాఖలోని ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న విషయం తెలిసిందే. దీనికి పరాకాష్టగా ఇప్పటికే రైల్వేలో పనిచేసి 60 ఏండ్ల వయసులో రిటైర్ అయిన వారిని మళ్లీ ఉద్యోగాల్లోకి ...2లో

త్వరలో సీఎన్‌జీ ధరల సెగ..



కిలోపై రూ.6 వరకు పెరగొచ్చు

న్యూఢిల్లీ : పర్యావరణ అనుకూల ఇంధనం సీఎన్‌జీపై కేంద్రం భారీగా ధరలు పెంచే పనిలో ఉంది. రాబోయే రోజుల్లో సీఎన్‌జీ వాహన వినియోగదారులపై కిలోకు ధర రూ.4 నుంచి రూ.6 వరకు పెంచనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎక్సైజ్ సుంకం తగ్గించడంతో పెరుగుతున్న సీఎన్‌జీ ధరలను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా తెలిపాయి. సిఎన్‌జి సరఫరాలో ప్రభుత్వం 20శాతం కోత విధించింది. లెగసీ ఫీల్డ్ నుంచి ఉత్పత్తి చేసిన గ్యాస్ నగరాల్లోని రిటైల్ గ్యాస్ సరఫరాదారులకు పంపిస్తారు. ఈ గ్యాస్ సరఫరాలో ఏటా 5 శాతం కోత విధిస్తూ వస్తున్నారు. దీంతో సరఫరా తగ్గిపోవడంతో సీఎన్‌జీ ధర పెరగనుంది. ఈ నేపథ్యంలోనే రాబోయే రోజుల్లో ధరలు పెరిగే అవకాశం ...11లో

ఇదేం తీరు..!

న్యాయమూర్తులు రాజకీయ నాయకులను పొగిడే విధానం తప్పు



న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని ప్రభావితం చేస్తుంది

న్యాయ సంస్థ సమగ్రతను బలహీనపరుస్తుంది

ఇది న్యాయ, రాజకీయ పాత్రల మధ్య విభజన రేఖను అస్పష్టం చేస్తుంది

ఎన్నికల్లో పోటీకి రాజీనామా చేయడం కూడా తప్పే : సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

న్యాయమూర్తులు రాజకీయ నాయకులను లేదా అధికారులను బహిరంగంగా పొగిడే విధానాన్ని, ధర్మాసనానికి రాజీనామా చేసిన తరువాత ఎన్నికల్లో పోటీ చేసే న్యాయమూర్తుల ధోరణిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ ఆర్ గవాయ్ తీవ్రంగా ఖండించారు. ఇది న్యాయ, రాజకీయ పాత్రల మధ్య విభజన రేఖను అస్పష్టం చేస్తుందని అన్నారు. అహ్మదాబాద్ లో గుజరాత్ రాష్ట్ర న్యాయ అధికారుల సమావేశంలో "న్యాయవ్యవస్థలో విశ్వాస లోపం" అనే ప్రధాన అంశంపై జస్టిస్ గవాయ్ ప్రసంగించారు. "ధర్మాసనంలో, ధర్మాసనం వెలుపల ఉన్నప్పుడు న్యాయమూర్తి ప్రవర్తన న్యాయపరమైన నీతికి సంబంధించిన అత్యున్నత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. ఒక న్యాయమూర్తి ఒక రాజకీయ ...11లో

అనుమతులున్న నిర్మాణాలను హైడ్రా కూల్చేయదు

హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

అనుమతులున్న నిర్మాణాలను 'హైడ్రా' కూల్చివేయబోదని ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చట్టబద్ధమైన అనుమతులతో నిర్మాణాలు చేపట్టిన వారెవరూ భయపడాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. చెరువుల వద్ద అనుమతులున్న నిర్మాణాలను సైతం కూల్చివేస్తామంటూ ప్రచారం జరుగుతోందనీ, ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదని కొట్టి పారేశారు.



అనుమతులున్న నిర్మాణాలను కూల్చేయమని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారని గుర్తు చేశారు. సీఎం ఆదేశాలకు హైడ్రా కట్టుబడి ఉంటుందని స్పష్టతనిచ్చారు.

దేశానికే రోల్‌మోడల్‌గా హైదరాబాద్



ఐఎస్‌బీ విద్యార్థులు రాష్ట్రంలో పనిచేయాలి

అద్భుతమైన నాలెడ్జ్ ఇస్తాం : ఐఎస్‌బీ లీడర్‌షిప్ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశానికి హైదరాబాద్‌ను రోల్‌మోడల్‌గా నిలపడమే లక్ష్యమని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. ఇతర రాష్ట్రాలు పట్టణాలతో తాను హైదరాబాద్‌ను పోల్చబోననీ, తన పోటీ న్యూయార్క్, లండన్, పారిస్, టోక్యో, సియోల్‌తోనే అని చెప్పారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) క్యాంపస్‌లో ఆదివారం జరిగిన లీడర్‌షిప్ సమ్మిట్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐఎస్‌బీలో చదువు పూర్తైన విద్యార్థులు తప్పనిసరిగా తెలంగాణలో కనీసం రెండు, లేదా మూడేండ్లు పనిచేయాలని కోరారు. ప్రభుత్వం వారికి కార్పొరేట్ కంపెనీల తరహాలో మంచి జీతాలు ఇవ్వలేకపోయినా, జీవితానికి సరిపడా సవాళ్లు, లక్ష్యసాధన అనుభవాలను అందిస్తామ న్నారు. ఒలింపిక్స్‌లో స్వర్ణపతకాలు గెలవడమే లక్ష్యంగా తాము క్రీడాకారుల్ని తీర్చిదిద్దాలని భావిస్తున్నా మన్నారు. రాష్ట్రంలోని అనేక రంగాల్లో అద్భుతమైన వ్యాపార అవకాశాలు ఉన్నాయనీ, వాటిని అంది పుచ్చుకొనేందుకు ఐఎస్‌బీ విద్యార్థులు కృషి చేయాలని కోరారు. జీవితంలో సవాళ్లు, త్యాగాలు లేకుండా గొప్ప విజయాలు సాధించే నాయకులుగా ఎదగలేమని చెప్పారు. మంచి నాయకుడికి ధైర్యం, త్యాగం, సమయస్ఫూర్తి ఉండాలని అన్నారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, మన్మోహన్ సింగ్, పీవీ నరసింహారావు ...2లో

సీల్డ్ కవర్‌లో 317 జీవో నివేదిక

సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి దామోదర రాజనర్సింహ అందజేత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 317 జీవోపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం తుది నివేదికను రూపొందించింది. ఆదివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంత్రి దామోదర రాజనర్సింహ కలిసి సీల్డ్ కవర్‌లో ఆ నివేదికను అందజేశారు. దామోదర రాజనర్సింహ ...2లో

నేటినుంచే గ్రూప్-1 మెయిన్స్

హెచ్‌ఎండీఏ పరిధిలో 27 వరకు పరీక్షలు

- ఉత్కంఠకు తెరదించిన ప్రభుత్వం
- ఉద్రిక్త పరిస్థితుల్లోనూ వాయిదా వేయకుండా ముందుకే
- పరీక్షా కేంద్రాల వద్ద పోలీసుల పటిష్ట బందోబస్తు
- మధ్యాహ్నం ఒకటిన్నర వరకే అభ్యర్థులకు అనుమతి
- ఆ తర్వాత గేట్లు మూసివేత
- హాజరుకానున్న 31,383 మంది అభ్యర్థులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు షెడ్యూల్ ప్రకారమే సోమవారం నుంచి యథాతథంగా జరగనున్నాయి. హెచ్‌ఎండీఏ పరిధిలో ఈనెల 27వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. అయితే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలపై చివరి వరకు ఉత్కంఠ కొనసాగింది. ఈ పరీక్షలను వాయిదా వేయాలనీ, 29 జీవోను రద్దు చేయాలని అభ్యర్థులు శనివారం పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఈ సమయంలో గ్రూప్-1 పరీక్షలు షెడ్యూల్ ప్రకారం జరుగుతాయా? లేదా? అన్నది చర్చనీయాంశంగా మారింది. మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, అధికారులు, న్యాయ నిపుణులతో అర్ధరాత్రి వరకు చర్చలు జరిగాయి. ఆదివారం ప్రభుత్వం కీలకమైన ప్రకటన చేస్తుందంటూ ప్రచారం జరిగింది. కానీ ఆదివారం రాత్రి వరకు ఎలాంటి ప్రకటన వెలువడ లేదు. ఇంకోవైపు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేస్తున్నట్టుగానీ, 29 జీవోను రద్దు చేస్తున్నట్టు లేదంటే సవరిస్తామంటూ ఎలాంటి ప్రకటనను ...11లో

బోనస్ లేదు..రైతు భరోసా రాదు

ఇదేం పాలన..11 నెలల్లో ఒక్క మంచి పనైనా చేసిందా?

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పిన రేవంత్‌రెడ్డి : మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- త్వరలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో ఫార్మా గ్రామాలను పర్యటిస్తాం
- రంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దసరా సమ్మేళనం

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి/ తిమ్మాపూర్

గతంలో రెండు పంటలకు కాదు, మూడు పంటలకు రైతు భరోసా ఇవ్వాలని చెప్పిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక ఒక్క పంటకు కూడా రైతు భరోసా ఎందుకు ఇవ్వడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. దేవుళ్ల మీద ఒట్లు వేసి ప్రజలకు ఇచ్చిన మాట తప్పిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని, పథకాల కాలం పోయి ఫొటోలకు ఫోజులిచ్చే కాలం వచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల మాత్రం



చావుకబురు చల్లగా చెప్పినట్టు నాట్లు వేసి, కోతలు కోసిన రైతు ఖరీఫ్‌కు పైసలు లేవని చెప్పడం హాస్యస్పదమన్నారు. బోనస్ లేదు.. రైతు భరోసా రాదు.. ఇదేనా కాంగ్రెస్ పాలనని ఎద్దేవా చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం అలయ్ బలయ్ పేరుతో దసరా సమ్మేళనాలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ...2లో

గ్రూపు-1పై బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు

విద్యార్థుల్లో లేనిపోని అపోహల సృష్టి : టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి గ్రూపు-1 మెయిన్స్ పరీక్షల విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు అయ్యి విద్యార్థుల్లో లేనిపోని అపోహలను సృష్టిస్తున్నాయని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగ అభ్యర్థులను ఆ రెండు పార్టీలూ తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. బీసీ బిడ్డగా భరోసానిస్తున్నా గ్రూపు-1 పోస్టుల ఎంపిక ప్రక్రియలో ఎక్కడా రిజర్వుడు కేటగిరీకి అన్యాయం జరగదని నొక్కిచెప్పారు. జీవో 29తో నష్టం అనేది అపోహ మాత్రమేనని స్పష్టం చేశారు. ఉద్యోగాల భర్తీ విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఏ మొహం పెట్టుకుని ధర్నాలు చేస్తున్నారని ప్రశ్నించారు. నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పదేండ్ల కాలంలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఒక్క గ్రూపు-1 పోస్టునైనా భర్తీ చేశారా? అని ప్రశ్నించారు. పదేండ్ల కాలంలో ఇచ్చిన ఉద్యోగాల నోటిఫికేషన్లకు కూడా పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేదని విమర్శించారు. ఇంటర్మీడియట్ ఫలితాలు కూడా సరిగా ఇవ్వలేనివారు తమ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా మోడీ సర్కారు విధానాలతో నిరుద్యోగ సమస్య ఏటేటా పెరిగిపోతున్నదనీ, ఉద్యోగావకాశాలు తగ్గుతున్నాయని చెప్పారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల కల్పిస్తామని ప్రధాని మోడీ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. పదేండ్ల కాలంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలను భర్తీ చేసిందో చెప్పాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని ప్రశ్నించారు. వీటిపై సమాధానాలు చెప్పలేని వాళ్లు ఇక్కడ మాత్రం నిరుద్యోగుల తరపున పోరాడుతున్నామని హడావుడి చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తమ ప్రభుత్వం ఉద్యోగాల కల్పన విషయంలో స్పష్టమైన విధానంతో ముందుకెళ్తున్నదని చెప్పారు.

శరీర దానానికి అవరోధాలెన్నో?



ప్రధాన అడ్డంకిగా మత భావాలు

కేంద్రీకృత వ్యవస్థ, చట్టం లేకపోవడమూ ప్రతిబంధకమే

చనిపోయిన తర్వాత జీవం కోల్పోయిన దేహం కాలిబూడిదయ్యే కంటే వైద్య పరిశోధనలకు ఉపయోగపడాలని పలువురు ప్రగతి-శీలురు భావిస్తారు. అందుకే మరణానంతరం తమ దేహాన్ని ఆస్పత్రులకు అప్పగించాలని ముందుగానే చెబుతారు. అందుకు సంబంధించిన అంగీకార పత్రాలపై సంతకాలు చేస్తారు. ఇటీవలే కన్నుమూసిన సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా భౌతిక కాయాలను వైద్య పరిశోధనల కోసం ఆస్పత్రులకు అప్పగించిన విషయం తెలిసిందే. అయితే మతపరమైన మనోభావాలు, కేంద్రీకృత వ్యవస్థ, చట్టం లేకపోవడం వంటి కారణాలతో వైద్య పరిశోధనలకు తగినన్ని దేహాలు లభించడం లేదు.



న్యూఢిల్లీ : 'మరణంలోనూ మానవత్వం చూపవచ్చు. నా రాజకీయాలు, ఏచూరి రాజకీయాలు బోధించింది ఇదే' అని కోల్‌కతాకు చెందిన సుకాంత దాస్ వ్యాఖ్యానించారు. కోల్‌కతాలోని ఓ కళాశాలకు చెందిన ఎస్‌ఎఫ్‌ఐ సభ్యుడాయన. దాస్ కూడా తన మరణానంతరం దేహాన్ని వైద్య పరిశోధనలకు అప్పగించేందుకు అంగీకరించారు. దేశంలో మృతదేహాల అప్పగింత పెరుగుతున్న మాట నిజమే. అయితే ఈ విషయంలో చేయాల్సింది ఎంతో ఉందన్నది కూడా వాస్తవమే. శరీర నిర్మాణం, శస్త్ర చికిత్స వంటి అంశాలపై విద్యార్థులకు బోధించేటప్పుడు వైద్య కళాశాలలు మృతదేహాలపైనే ఆధారపడతాయి. మృతదేహాల అప్పగింతకు, అవయవ దానానికీ మధ్య తేడా ఉంది. శరీర భాగాలు దెబ్బతిన్నప్పుడు అవయవ మార్పిడి చేస్తారు.


ఇవన్నీ సమస్యలే

మృతదేహాన్ని వైద్య పరిశోధనలకు అందజేసే విషయంలో మతపరమైన మనోభావాలు ప్రధాన అవరోధంగా నిలుస్తున్నాయి. చనిపోయిన వ్యక్తికి అంత్యక్రియలు జరపడానికి బదులు మృతదేహాన్ని విరాళంగా అందజేయడానికి బంధువులు ఇష్టపడడం లేదు. కుటుంబ సభ్యులను ఒప్పించడంలో వైద్య సిబ్బంది కూడా విఫలమవుతున్నారు. మృతదేహాల అప్పగింతకు సంబంధించిన చట్టమేదీ అమలులో లేకపోవడం కూడా అడ్డంకిగా ఉంది. ప్రస్తుతం అవయవ దానానికి సంబంధించి కేంద్ర చట్టం ఉంది. కానీ మృతదేహాలను పరిశోధనలకు అందజేయడం అనేది రాష్ట్రాల చట్టాల పరిధిలోని అంశం. తన దేహాన్ని పరిశోధనలకు అప్పగించడానికి కొందరు ముందుకు వస్తున్నప్పటికీ కుటుంబ సభ్యులు అడ్డుకుంటున్నారు. ఈ విషయంలో బంధువులు, స్నేహితుల మద్దతు ఎంతో ముఖ్యం.

ఎన్జీఓల కృషి

మానవ దేహం జీవితకాలానికి మాత్రమే పరిమితం కాకూడదు. అది మరణానంతరం ...11లో

చికెన్ బిర్యానీలో బెక బెక..



గచ్చిబౌలిలోని ప్రభుత్వ ట్రిపుల్‌ఐటీ కాలేజీలో ఘటన

ఆలస్యంగా వెలుగులోకి..

వివరాలు 11లో

బీజేపీ ఎమ్మెల్యేకు బిగ్ షాక్

గుజరాత్ హైకోర్టు ఆదేశాలు..

గజేంద్రసిన్హ్ పర్మార్‌పై లైంగికదాడి, బెదిరింపు కేసు

దళిత మహిళ పిటిషన్‌పై న్యాయస్థానం ఉత్తర్వులతో కదిలిన పోలీసులు



వివరాలు 11లో

ఢిల్లీలో భారీ పేలుడు

సీఆర్‌పీఎఫ్ పాఠశాల వెలుపల ఘటన

రంగంలోకి ఎన్‌ఎస్‌జీ, ఎన్‌ఐఏ



వివరాలు 11లో

దేశానికే రోల్‌మోడల్‌గా హైదరాబాద్



(మొదటిపేజీ తరువాయి)

వంటి మహానేతల జీవితాలను అధ్యయనం చేస్తే వారు డబ్బు, సమయం, వ్యక్తిగత జీవితం సహా అనేక త్యాగాలు చేశారనీ, అదే సమయంలో వారిలోని ధైర్యం, తెగువ కూడా మనకు కనిపిస్తాయని ఉదహరించారు. సమస్యలపై ప్రజలతో మమేకమయ్యేందుకు నాయకుడు ఎప్పుడూ సిగ్గుపడకూడదనీ, నిత్యం వారితో సంబంధాలు పెట్టుకోవాలనీ, పేదలు, ధనికులు ,చిన్నా, పెద్దా అన్న భేదం లేకుండా సమాన గౌరవం ఇస్తూ స్నేహ భావంతో అందరిని కలుపుకుపోవాలని దిశానిర్దేశం చేశారు. ఐఎస్‌బీ విద్యార్థులు హైదరాబాద్, తెలంగాణతో పాటు న్యూ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలని కోరారు. తెలంగాణను లక్ష కోట్ల డాలర్ల జీడీపీ ఆర్థిక వ్యవస్థగా మార్చాలనీ, దానికోసం హైదరాబాద్‌ను 60 వేల కోట్ల డాలర్ల నగరంగా మార్చాలనేదే తమ లక్ష్యమని వివరించారు. ఐఎస్‌బీ విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు, సామాన్య ప్రజలతో తెలంగాణ, హైదరాబాద్ గురించి మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామనీ, గచ్చిబౌలిలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సౌత్ కొరియా వంటి చిన్న దేశం ఒలింపిక్స్‌లో అనేక పతకాలు సాధించిందనీ, ఇంత పెద్ద భారతదేశం ఒక్క బంగారు పతకం కూడా సాధించలేకపోయిందని అన్నారు. అందుకే తెలంగాణ నుంచే దేశానికి ఈసారి ఒలింపిక్స్ లో బంగారు పతకం సాధించాలనే కసి, పట్టుదలతో పనిచేస్తున్నామని చెప్పారు.

పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టులకు అభ్యర్థుల ఎంపిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని సాంకేతిక విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో లెక్చరర్ పోస్టులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) అభ్యర్థులను ఎంపిక చేసింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలను www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ కాలేజీల్లో 247 లెక్చరర్ పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ ఏడో తేదీన టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే.

మంత్రాల నెపంతో ఓ కుటుంబంపై దాడి

- 13 మందిపై కేసు నమోదు
- మెదక్ జిల్లా కిష్టాపూర్ గ్రామంలో ఘటన
- మూఢనమ్మకాలపై ఎస్ఐ శివానంద్ అవగాహన



నవతెలంగాణ-తూప్రాన్

మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో మంత్రాల నెపంతో భూమోల్ల స్వామి కుటుంబంపై కొంతమంది భౌతికంగా దాడి చేశారు. తూప్రాన్ ఎస్ఐ శివానంద్ ఈ ఘటనపై ఆదివారం విలేకరుల సమావేశంలో వివరించారు. మంత్రాలు చేస్తున్నారనే నెపంతో కిష్టాపూర్ గ్రామానికి చెందిన స్వామి కుటుంబంపై అదే కులానికి చెందిన కొంతమంది వ్యక్తులు బూతులు తిడుతూ శనివారం రాత్రి దాడికి పాల్పడ్డారు. ఇంటిపై దాడి చేసి, కుటుంబ సభ్యులపై భౌతిక దాడికి పాల్పడ్డారు. బాధితుడు భూమొళ్ళ స్వామి తండ్రి పోచయ్య గత మూడు నెలల క్రితం చనిపోగా ఆయనకు నెలవారీగా చేసే పెద్దకర్మ కార్యక్రమాన్ని వారి ఇంట్లో చేసుకున్నారు. అక్టోబర్ 19వ తేదిన ఉదయం 11 గంటలకు గ్రామంలోని మాదిగ సామాజిక తరగతి చెందిన కొక్కొండ సత్తమ్మ, లక్ష్మణ్, రాములు, బాబు, గుకొండి, యాదగిరి, సాయి, నాగమణి, పుష్ప, రాము, అనసూయ, కె.చరణ్, చిన్న బాగని శంకర్, వీరందరూ కలిసి.. తన తండ్రి పోచయ్య ఆత్మ తమ ఇండ్ల చుట్టూ తిరుగుతున్నదని, దానికి తానే కారణమని, మంత్రాలు చేస్తున్నావని ఆరోపిస్తూ స్వామిపై దాడికి పాల్పడ్డారు. బూతులు తిడుతూ చేతులు, కర్రలతో దాడి చేసి స్వామిని గాయపర్చారు. అడ్డొచ్చిన స్వామి భార్య నవనీత, తల్లి కమలమ్మపై కూడా దాడి చేసి గాయపర్చారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దాడిచేసిన 13 మందిపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టామని ఎస్ఐ శివానంద్ తెలిపారు. కాగా, గ్రామంలో మూఢ నమ్మకాలపై పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి కుటుంబంపై దాడి చేసిన వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలని సూచించారు.

భూతగాదాల నేపథ్యంలో అన్నను చంపిన తమ్ముడు



నవతెలంగాణ-మల్లాపూర్

అన్నదమ్ముల మధ్య నెలకొన్న భూ తగాదా ఒకరిని బలిగొంది. తమ్ముడు కత్తితో దాడి చేయగా అన్న అక్కడికక్కడే మృతి చెందాడు ఈ ఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ఓబులాపూర్‌లో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓబులాపూర్ గ్రామానికి చెందిన ఓల్లపు నరసయ్య గంగులకు 9 మంది సంతానం ఉన్నారు. అందులో ఏడుగురు కొడుకులు, ఇద్దరు ఆడపిల్లలు.. అందరికీ పెండ్లిండ్లు అయిపోయాయి. కాగా, వీరికి గ్రామ శివారులో ఏడుగురు అన్నదమ్ములకు నివాస స్థలం ఉంది. నరసయ్య మూడవ కుమారుడు పల్లపు సాయిలు (34) బతుకుదెరువు నిమిత్తం రెండు సంవత్సరాల క్రితం గల్ఫ్‌కు వెళ్లి వచ్చాడు. అదే క్రమంలో సాయిలు ఇంటి పక్కన తన తమ్ముడు పల్లపు చంద్రి ఇంటి నిర్మాణం చేపట్టాడు. తన స్థలంలోకి వచ్చి తమ్ముడు చంద్రి నిర్మాణం చేపట్టాడని, 3 నెలలుగా అన్నదమ్ములు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇదే విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోగా పోలీసులు కేసు నమోదు చేశారు. మళ్లీ రెండు మూడు రోజుల క్రితం గ్రామంలో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టుకోగా ఆ సమస్య పరిష్కారం కాలేదు. ఆదివారం మధ్యాహ్నం అన్న సాయిలు గ్రామ శివారులో ఉన్న గోదావరి వద్ద ఉండగా తమ్ముడు చంద్రి అక్కడికి వెళ్లి తన వద్ద ఉన్న తల్వార్‌తో అన్న తలపై నరికాడు. దాంతో మొండెం శరీరం వేరై.. సాయిలు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ కిరణ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం ఈ హత్య ఒక్కరు చేశారా? ఇంకా ఎవరైనా హస్తం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యుల నుంచి వివరాలను సేకరించారు.

నిర్మల్ జనరల్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

- భయంతో బయటకు పరుగులు తీసిన రోగులు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం ఆస్పత్రిలోని రెండో ఫ్లోర్ జనరల్ వార్డులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు వ్యాపించడంతో వైద్యులు, రోగులు భయాందోళనలో పరుగులు పెట్టారు. అప్రమత్తమైన ఆస్పత్రి సిబ్బంది, పేషెంట్ల అటెండెంట్లు రోగులను వార్డు నుంచి సురక్షితంగా బయటికి తరలించారు. ఈ ప్రమాదంలో రెండో వార్డులోని ఫర్నీచర్ పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న అగ్ని మాపక సిబ్బందికి ఆస్పత్రికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. సకాలంలో ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగినట్టు ఆస్పత్రి వర్గాలు, పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

నల్లబారుతున్న పత్తి రైతు

అసలే ప్రకృతి వైపరీత్యాలు

- దిగుబడిపై దిగులు
- వర్షాలతో తీవ్రంగా దెబ్బతిన్న పంట
- ప్రారంభానికి నోచని సీసీఐ కేంద్రాలు
- ధర పెంచినట్టు చెప్పినా సవాలక్ష కొర్రీలు
- తక్కువ ధరకే కొంటున్న దళారులు



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి/విలేకరులు

పత్తి రైతు బతుకు ఏటికేడు ఛిద్రం అవుతోంది. తెల్ల బంగారం పండించిన రైతు బతుకు నల్ల బారుతోంది. ఒకవైపు రైతును ప్రకృతి వైపరీత్యాలు వెంటాడుతుండగా, మరోవైపు పండించిన పంటకు ప్రభుత్వాలు మద్దతు ధర కల్పించడం లేదు. మద్దతు ధర పెంచినట్టు చూపుతున్నా.. సవాలక్ష కొర్రీలతో రైతులకు అందే పరిస్థితి కనిపించడం లేదు. సీసీఐ కేంద్రాలను ప్రారంభించ కపోవడంతో చేతికొచ్చిన కొద్దిపాటి పంటను కూడా దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దాంతో పెట్టుబడి రాకపోగా చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేని పరిస్థితి నెలకొంది.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 3 లక్షలా 50 వేల ఎకరాలలో పత్తి సాగు చేశారు. రంగారెడ్డి జిల్లాలో లక్షా 76 వేలా 174 ఎకరాలు, వికారాబాద్ జిల్లాలో లక్షా 80 వేల ఎకరాల్లో పత్తి సాగైంది. పత్తి ఏడాదికి ఒక పంట మాత్రమే వస్తుంది. ఈ ఏడాది పంట నష్టం వాటిల్లితే మళ్లీ ఏడాది వరకు ప్రత్యామ్నాయం లేని పరిస్థితి. ప్రతియేటా లాభ, నష్టాలను చవిచూస్తున్నప్పటికీ రైతులు మాత్రం తాము నమ్ముకున్న వ్యవసాయాన్ని విడిచిపెట్టే పరిస్థితి లేదు. చావో-రేవో ఈ భూమినే నమ్ముకుని బతుకుతున్న వారిని అటు ప్రకృతి.. ఇటు ప్రభుత్వాలు వెక్కిరిస్తున్నాయి. పత్తి గింజలు విత్తే సమయంలో సకాలంలో వర్షాలు కురువకపోవడంతో భూమిలో విత్తిన గింజలు మొలకెత్తకుండా మాడిపోయాయి. దాంతో రెండు, మూడు సార్లు విత్తనాలు విత్తాల్సిన పరిస్థితి వచ్చింది. పంట చేతికొచ్చే సయమానికి వర్షాలతో నేలరాలుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి నేలరాలడంతో పాటు చెట్టుకున్న పత్తి ఎర్రబారి రంగు మారిపోయింది.

కరీంనగర్ జిల్లాలో 42,730 ఎకరాల్లో పత్తి సాగైంది. ఎకరాకు 9 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా 3,84,570 క్వింటాళ్ళ (38.45వేల మెట్రిక్‌టన్నులు) రావచ్చని అధికారులు అంచనా గట్టారు. ఈ మేరకు జిల్లాలో 9 కేంద్రాల్లో కొనుగోళ్ల జరపాలని సీసీఐ నిర్ణయించింది. అయితే ఇంతవరకూ ఎక్కడా కేంద్రాలను ప్రారంభించలేదు. సీసీఐ ముందుకు రాకపోవడంతో రైతులు దళారులకు తెగనమ్ముకుం టున్నారు. జనగామలో ప్రయివేటు మిల్లుల యజమానులు పలు సాకులు చూపుతూ రూ. 500 నుంచి రూ.1000 తక్కువకు పత్తి కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ఆదిలాబాద్ జిల్లాలో పత్తి తీసి ఇండ్లలోనే ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పలుచోట్ల తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మద్దతు ధర కరువు

ప్రభుత్వం పత్తికి మద్దతు ధర కింద క్వింటాలుకు రూ.7,521 నిర్ణయించింది. కానీ ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో రైతుల నుంచి దళారులు కేవలం రూ.5500కే కొనుగోలు చేస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో దళారులు గరిష్టంగా రూ.6500, కనిష్టంగా రూ.6 వేలకే కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ కేంద్రాల ద్వారా ప్రభుత్వం రైతుల నుంచి పత్తి సేకరించాల్సి ఉన్నప్పటికీ కొనుగోలు కేంద్రాలు నేటికీ ప్రారంభించలేదు. ఏటా పత్తి దిగుబడి ప్రారంభమయ్యే నాటికి కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసి ఉంచాల్సిన బాధ్యత కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులపై ఉంటుంది. ఈ ఏడాది పత్తి సీజన్ ప్రారంభమైనా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పట్ల సీసీఐ నిర్లక్ష్యం వహిస్తోంది. అక్కడక్కడ ఒకట్రెండు సెంటర్లు ప్రారంభించినప్పటికీ స్పిన్నింగ్ మిల్లర్స్ యాజమాన్యం చెప్పిన ధర తప్ప, ప్రభుత్వ మద్దతు ధర ఇవ్వకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జనగామ జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. ఇది పత్తి మిల్లుల యజమానులకు వరంగా మారింది. మరోవైపు సీసీఐ నిబంధనలూ కఠినతరంగానే ఉన్నాయి. 8శాతం తేమ ఉండి పింజ 30.5 నుంచి 29ఎంఎం ఉంటేనే కనీస మద్దతు ధర కింటాకు రూ.7521 చెల్లిస్తుంది. తేమశాతం 12గా ఉండి పత్తికి 28.5 నుంచి 27.5 ఎంఎం ఉన్న పింజకు రూ.7124 చెల్లిస్తామని చెప్పింది.తేమ ఒక శాతం పెరిగితే ఎమ్మెస్పీలో ఒక శాతం అంటే రూ.75.21 తగ్గిస్తుంది. ఈ నేపథ్యంలో సీసీఐ కేంద్రాల్లో కనీస మద్దతు దొరికే పరిస్థితిలేదు. ప్రస్తుతం పత్తిలో 25 నుంచి 30శాతం తేమ వస్తుండగా.. సీసీఐ కూడా దీపావళి తరువాతనే కొనుగోళ్ల ప్రారంభించే అవకాశం కనిపిస్తోంది. దీంతో సీసీఐ లెక్కలజోలికి పోకుండా వచ్చిన కాడికి సై అన్నట్టుగా నష్టానికి అయినా దళారులిచ్చే తక్కువ ధరకే రైతులు అమ్ముకుంటున్నారు.

పెట్టుబడి వచ్చేట్టు లేదు..

పంట సాగుకు పెట్టిన పెట్టుబడి వచ్చేట్టు లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక ఎకరా పత్తి సాగుకు సుమారు రూ.30వేల నుంచి 35 వేల వరకు అవుతోంది. ఒక ఎకరాకు పత్తి దిగుబడి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. మంచి ధర పలికితే రూ.70 వేల నుంచి 80 వేల వరకు ఆదాయం వస్తోంది. పెట్టుబడి పోను ఎకరాకు రూ. 30 వేలు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. కానీ ఈ ఏడాది పెట్టుబడి అధికం.. దిగుబడి తక్కువ. దీనికి తోడు ధర పలుకకపోవడంతో పత్తి రైతులకు దిక్కుతోచడం లేదు. లాభాలు పక్కనబెడితే కనీసం పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే సీసీఐ కేంద్రాలు ప్రారంభించి మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఈ యేడూ అగమే..



ఎనిమిది ఎకరాలు పత్తి పంట చేసిన. మొదట్లో వానలు లేక పెట్టిన విత్తనాలు మొలకలు రాలే. రెండు, మూడు సార్లు విత్తనాలు పెట్టాల్సి వచ్చింది. ఇక గిప్పుడేమో దినాం వర్షం కురుస్తోంది. దాంతో చేతికి వచ్చిన పత్తి నేలపాలు అవుతోంది. ఆ పత్తి తీస్తే తీసిన కూలీ లకు కూడా డబ్బులు రావు. ఏమీ చేయాలో దిక్కు తోచడం లేదు. పంట సాగుకు తెచ్చిన పెట్టుబడి తీర్చేదెట్లా. ఈ యేడూ కూడా ఆగమే అయ్యేట్టు ఉంది. ప్రభుత్వమే నన్ను ఆదుకోవాలి.

\- రాజమోని శ్రీను, పత్తి రైతు

కబ్జాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

హైడ్రా పేదల జోలికొస్తే ఊరుకోం

- మూసీ సుందరీకరణపై అఖిలపక్షం పెట్టి సలహాలు, సూచనలు స్వీకరించాలి
- రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలో బీజేపీ, బీఆర్ఎస్
- కాంగ్రెస్‌కు మద్దతు మద్దతే.. పోరాటం పోరాటమే : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎల్పీనేత కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లో భూ కబ్జాలు, అన్యాక్రాంతం అయిన ఆస్తులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎల్పీనేత కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. హైడ్రా అత్యుత్సాహంతో అనాలోచితంగా పేదలు, మధ్యతరగతి ప్రజల ఇండ్లను కూల్చడాన్ని తప్పుబట్టారు. దీన్ని ఆసరాగా చేసుకున్న బడాబాబులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైడ్రా భూబకాసురులను వదిలి, పేదల జోలికొస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మూసీ పునరుజ్జీవనంపై అన్ని పార్టీల నేతలు, మేధావులు, పర్యావరణవేత్తలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి ముందుకెళ్లాలని సూచించారు. బీఆర్ఎస్, బీజేపీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర పన్నుతున్నాయనీ, ఇలాంటి చర్యలను తమ పార్టీ ఖండిస్తుందని చెప్పారు. మిత్రపక్షంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు ఉంటుందనీ, అదే సమయంలో ప్రజల, రైతుల సమస్యలపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస్, ఎన్.బాలమల్లేష్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మూసీ పునరుజ్జీవనం అంశంలో పేదలను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ నేతలు తమ అక్రమ ఆస్తులను కాపాడుకునే పనిలో ఉన్నారన్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని పేదలకు పునరావాసం కల్పించాలనీ, ఆ తర్వాతే వారిని అక్కడ నుంచి తరలించాలని సూచించారు. ముందు బడాబాబులు ఆక్రమించుకుని నిర్మించుకున్న భవంతులను నేల మట్టం చేయాలనీ, అప్పుడే హైడ్రాకు ప్రజామోదం లభిస్తుందని చెప్పారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలందరికీ 58, 59 జీఓల ప్రకారం ఇండ్ల స్థలాలను క్రమబద్ధీకరించాలని కోరారు. కబ్జాలకు పాల్పడి, నిర్మాణాలు చేపట్టి అమ్ముకున్న భూబకాసురుల నుంచి డబ్బులు వసూలు చేసి బాధితులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ పంటకు రైతు భరోసా ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం మాదిరిగా తప్పించుకునే ప్రయతాన్ని కాంగ్రెస్ సర్కారు చేయెద్దని హితవు పలికారు. రైతు రుణమాఫీపై స్పష్టతివ్వాలనీ, ఈ విషయంలో ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షపై నిరుద్యోగుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని రాష్ట్ర సర్కారును కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలనీ, దీనిపై ఒక పాలసీ తేవాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కట్టేందుకు కొత్త ప్రభుత్వం అప్పులు తెస్తున్నదని చెప్పారు. అజీజ్‌పాషా మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా పెద్ద పార్టీలను, నాయకులను చూసి ప్రజలు ఓట్లేసే పరిస్థితి పోయిందనీ, హర్యానా, జమ్మూకాశ్మీర్ ఎన్నికల ఫలితాలే దానికి నిదర్శనమని చెప్పారు. ఆ రాష్ట్రాల్లో స్వతంత్ర, చిన్న పార్టీల అభ్యర్థులు 20 శాతం చొప్పున ఓట్లు సాధించారని గుర్తుచేశారు. అనంతరం అపర్ణ నిర్మాణ సంస్థ బాధితులతో కూనంనేని సమావేశం అయ్యారు. 600 ఎకరాల భూములకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



నవతెలంగాణ-చిలుకూరు

ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలోని కవితా జూనియర్ కళాశాలలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని పాలకీడు మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన భీమన శంకర్, మంగ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు హరీశ్, చిన్న కొడుకు వినయ్. వినయ్ చిలుకూరు మండలకేంద్రంలోని కవితా కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ఫస్టియర్ చదువుతున్నాడు. దసరా పండుగ సందర్భంగా ఇంటికి వెళ్లి తిరిగి ఆదివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో తన మేనమామ లింగం నాగయ్యతో కలిసి బైకు మీద కాలేజీకి వచ్చాడు. కవితా కాలేజీ యజమాన్యాన్ని విద్యార్థి మేనమామ కలవగా.. వినయ్ చదువులో కొంచెం వీక్‌గా ఉన్నాడని వారు తెలిపారు. దాంతో విద్యార్థితో మేనమామ మంచిగా చదువుకో అని చెప్పి ఇంటికి వెళ్లిపోయాడు. ఈ క్రమంలోనే గదిలోకి వెళ్లిన వినయ్.. ఎవరూ లేని సమయంలో తలుపులు వేసుకొని గదిలో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిపై ఘటన

నవతెలంగాణ-దేవరుప్పుల

జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని గొల్లపల్లి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్, కర్నూలు జిల్లా మొగతి గ్రామానికి చెందిన బోయ నరసింహ (20), వనపర్తి జిల్లా మదనపురం గ్రామానికి చెందిన చీరోలు భరత్(22) ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిపై మొండ్రాయి నుంచి దేవరుప్పుల వైపు వస్తున్న క్రమంలో ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేశారు. ఈక్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాలీ వాహనాన్ని ఢీకొట్టి ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. మండలం లోని సింగరాజు పల్లి గ్రామానికి చెందిన ట్రాలీ వాహనంలో ప్రయాణిస్తున్న కొంగరి భాస్కర్, రాపాక ఉప్పలయ్య, రాపాక రేణుకకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం జనగామ ఏరియా ఆస్పత్రికి స్థానికులు, పోలీస్ సిబ్బంది సహాయంతో తరలించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

బోనస్ లేదు.. రైతు భరోసా రాదు

(మొదటిపేజీ తరువాయి)

ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా సమ్మేళనంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో కలిసి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ 11 నెలల్లో ఒక్క మంచి పనైనా చేసిందా అని ప్రశ్నించారు. ఫార్మాసిటీ స్థానంలో ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేస్తామని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఆయన నలుగురు సోదరుల రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే ఫ్యూచర్ సిటీ నాటకం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీన్ ఫార్మా ఏర్పాటుకు తాము 14వేల ఎకరాల భూమి సేకరించగా.. నేటి ముఖ్యమంత్రి ఫార్మాసిటీ రద్దు చేస్తామని చెప్పి రైతులను మోసం చేశాడని అ న్నారు. త్వరలోనే తమ ఎమ్మెల్యేలతో కలిసి 9 గ్రామాల్లో పర్యటించి, ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బతుకమ్మ పండుగకు చీరలు లేవని, దసరా పండుగ కళ తప్పిందని, గణేష్ పండుగ పండుగలా లేదని అన్నారు. చిట్టినాయుడికి ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టడానికే సరిపోయిందని తెలిపారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలి స్తామని హామీ ఇచ్చిన రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి.. వారికి మాత్రమే ఉద్యోగాలు తెచ్చుకు న్నారని, జీవో 29 తెచ్చి నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. గతంలో చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డితోనే కొట్లాడి తెలంగాణ సాధించు కున్నామని.. ఈ చిట్టినాయుడు ఎంత అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి, గ్రంథా లయ కమిటీ మాజీ చైర్మెన్ సత్తు వెంకట రమణారెడ్డి, నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కటేష్, చంద్రయ్య, అంజిరెడ్డి, కిషన్‌గౌడ్, రమేష్‌గౌడ్, మందా సురేష్, ఆకుల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పిన రేవంత్‌రెడ్డి : మాజీ మంత్రి హరీశ్‌రావు

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బీఆర్ఎస్ మానకొండూర్ నియోజకవర్గ కుటుంబ ఆత్మీయ సమ్మేళనం అలయ్ బలయ్ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావుతో కలిసి హరీశ్‌రావు హాజరై మాట్లాడారు. ఈ సమావేశం చూస్తే 2001 నాటి రోజులు గుర్తుకు వస్తున్నాయని అన్నారు. రసమయి బాలకిషన్ ఉద్యమ సయమంలో ధూంధాం పేరిట ఎంతో జాగతం చేసిందని గుర్తుచేశారు. అలాగే మరోసారి రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ మీద పోరాటానికి మరో ధూంధాం మొదలుపెట్టే రోజులు వచ్చాయని అన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను తీసుకువచ్చి రేవంత్‌రెడ్డి హామీలు ఇప్పించిండని, కాంగ్రెస్ హనీమూన్ పీరియడ్ అయిపోయిందని, ఇక పోరాటం చేయాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. గ్రూపు-1 యువతపై అరాచకంగా బందిపోట్లు, దొంగలను కొట్టినట్టు ఇష్టం ఉన్నట్టు కొడుతున్నారని.. ఓట్లప్పుడు రాహుల్ గాంధీ లైబ్రరీ పోయి విద్యార్థులను బతిమిలాడారని, ఇప్పుడు ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. ప్రభుత్వ పథకాల అమలుకు, పేదలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే పైసలు లేవంటాడని, మరి మూసీకి రూ.1.50లక్షల కోట్లు ఎక్కడినుంచి వచ్చాయని అన్నారు. ప్రజల తరుపున పోరాటం చేస్తామంటే వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నారని, తనమీద, కేటీఆర్ మీద బుల్డోజర్లు ఎక్కిస్తా అంటున్నాడని ఆరోపించారు. పేదలకు అన్యాయం జరిగితే చావడానికైనా సిద్ధమని చెప్పారు. ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపడమే ప్రతిపక్షం బాధ్యతని, ఆ పనే కేసీఆర్, బీఆర్ఎస్ చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు, నాయకులు పాల్గొన్నారు.

సీల్డ్ కవర్‌లో 317 జీవో నివేదిక

(మొదటిపేజీ తరువాయి)

నేతృత్వంలో మంత్రులు డి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి మంత్రివర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. ఈ ఉపసంఘం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతోపాటు నిష్ణాతులైన మేధావులతో ఈ జీవోపై సుదీర్ఘంగా చర్చించింది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల అభిప్రాయాలను వినతుల రూపంలో, వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. వారి సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘం వివిధ శాఖల ఉన్నతాధికారులతో పలు దఫాలుగా సమీక్షించింది. అనంతరం తుది నివేదికను రూపొందించి సీఎంకు అందజేసింది. అయితే 317 జీవో వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు స్థానికత ఉన్న జిల్లా, జోనల్, మల్టీజోనల్ కాకుండా వేరే జిల్లా, జోనల్, మల్టీ జోనల్‌కు కేటాయించబడ్డారు. సీనియార్టీ ఆధారంగానే గత ప్రభుత్వం ఆ జీవోను అమలు చేసింది. అయితే స్థానికత కోల్పోయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు నాటి నుంచి ఉద్యమిస్తూనే ఉన్నారు. 317 జీవో బాధితుల సమస్యను పరిష్కరిస్తామంటూ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది. అందుకను గుణంగా మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిం చింది. స్థానికత ప్రకారం ఉద్యోగుల కేటాయింపుపై సుదీర్ఘంగా చర్చించింది. న్యాయవివాదాలు తలెత్తకుండా 317 జీవో అమలుపై కసరత్తు చేసింది. న్యాయ నిపుణులతో సైతం సంప్రదిం పులు జరిపింది. 317 జీవోలో భాగంగా స్పౌజ్, మ్యూచువల్, మెడికల్ గ్రౌండ్‌లలో ఉద్యోగుల కేటాయింపుపై మంత్రివర్గ ఉపసంఘం సాను కూలత వ్యక్తం చేసినట్టు సమాచారం. త్వరలో ఉద్యోగుల కేటాయింపుపై ఉత్తర్వులను విడుదల చేసే అవకాశమున్నది.

'బండి' ఇదేం 'తొండి'?

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఈ నెల 15వ తేదీ ఉత్తర్వులు (No.E(NG)II/2024/RC-4/9) జారీ చేసింది. రైల్వే లో రిటైర్ అవుతున్న ఉద్యోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. వారి స్థానాలను భర్తీ చేసేందుకు కొత్త రిక్రూట్‌మెంట్లు లేవు. దేశవ్యాప్తంగా వివిధ రైల్వే జోన్లలో 25వేలకు పైగా ఖాళీలు ఉన్నాయి. ఫలితంగా ఉన్న ఉద్యోగులపై పనిభారాలు పెరుగుతున్నాయి. సేవల్లో జాప్యం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో రైల్వే బోర్డు 65 ఏండ్లలోపు ఉన్న రిటైర్డ్ ఉద్యోగులను మళ్లీ కొలువుల్లోకి తీసుకోవాలని నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరిని సూపర్‌వైజర్లు, ట్రాక్‌మె న్‌లుగా తాత్కాలికంగా విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించారు. రెండేండ్లపాటు వీరి సేవల్ని వినియోగించుకుంటారు. ఆ తర్వాత అవసరాలను బట్టి సర్వీసును పొడిగిస్తారు. రిటైర్డ్ ఉద్యోగులు తమ సర్వీసులో చివరిసారి తీసుకున్న జీతాన్ని ఇస్తారు. దీనితోపాటు ట్రావెల్ అలవెన్సులు, అధికారిక టూర్లు వంటి పలు ప్రయోజనాలు ఉంటాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జీతంలో పెరుగుదల, ఇతర ఆర్థిక ప్రయోజనాలు మాత్రం ఉండవు. కానీ రిటైర్ అయినందున వారికి వచ్చే పెన్షన్ యథావిధిగా వస్తుంది. దానికి ఇప్పుడు ఇచ్చే జీతం అదనం. నిరుద్యోగులపై ఎక్కడలేని ప్రేమ ఒలకబోస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇప్పుడు ప్రధాని మోడీకి, రైల్వే బోర్డుకు వ్యతిరేకంగా, నిరుద్యోగులకు మద్దతుగా గళం ఎత్తుతారా? లేక స్వామిభక్తితో సైలెంట్‌గా ఉంటారో చూడాలి.

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన దేశాన్ని కుదిపేస్తున్నది. ఇప్పటికీ అక్కడ వైద్యులు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. పని చేసే చోట తమకు భద్రత లేదని వారు పేర్కొంటున్నారు. బెంగాల్ వైద్యుల ఆందోళనకు దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తున్నది. ఈ నేపథ్యంలోనే వైద్యారోగ్య సిబ్బందికి వారు పని చేసే చోట భద్రత ఎలా ఉన్నది అనే విషయాలను తెలుసుకోవడానికి ఓ అధ్యయనం నిర్వహించారు. ఇందులో కీలక విషయాలు బయటపడ్డాయి. 50 శాతానికి మించి వైద్యారోగ్య సిబ్బంది తాము పని చేసే చోట సురక్షితంగా ఉన్నట్టు ఫీల్ కావడం లేదని ఈ సర్వేలో తెలిపారు.

వైద్యారోగ్య సిబ్బందికి భద్రత కరువు!

50 శాతం మందికి పైగా హెల్త్‌కేర్ వర్కర్ల అభిప్రాయమిదే | ప్రయివేట్ కంటే ప్రభుత్వ వైద్య సంస్థల్లోనే అభద్రత

సేఫ్టీ ఏర్పాట్లు సరిపడా లేవని అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: వర్ధమాన్ మహవీర్ మెడికల్ కాలేజీ, సఫ్దర్‌జంగ్ హాస్పిటల్, ఢిల్లీ ఎయిమ్స్‌లు సంయుక్తంగా నిర్వహించిన ఈ అధ్యయనంలో వైద్యా రోగ్య వ్యవస్థలో సిబ్బందికి కల్పించే భద్రతలోని లోపాలు బయటపడ్డాయి. దేశవ్యాప్తంగా విభిన్న మెడికల్ ఇన్‌స్టిట్యూషన్స్ నుంచి మొత్తం 1,566 మంది హెల్త్ కేర్ వర్కర్స్ (869 మంది మహిళా, 697 పురుష వర్కర్లు) నుంచి శాంపిల్స్ తీసుకుని ఈ సర్వే రూపొందించారు. ఇందులో ఫ్యాకల్టీ సిబ్బంది, నర్సింగ్ స్టాఫ్, మెడికల్ ఆఫీసర్స్, సపోర్టింగ్ స్టాఫ్, మెడికల్ స్టూడెంట్స్, ఇంటర్న్‌లు అందరి నుంచీ వివరాలను తీసుకున్నారు.

దాదాపు సగం మంది వర్కర్లకు ప్రత్యేకంగా డ్యూటీ రూమ్‌లు లేవు. సుదీర్ఘమైన గంటలు డ్యూటీలోనే ఉండాల్సి వస్తున్నది. కొన్నిసార్లు రాత్రిపూట కూడా ఉండాల్సి వస్తున్నది. ఇది వరకు అందుబాటులో ఉన్న డ్యూటీ రూమ్‌లలో సరిపడా స్పేస్, వెంటిలేషన్ లేక, చెదలు పట్టి, శుభ్రత లేకుండా ఉన్నాయి. 70 శాతం మంది వర్కర్లు తమకు అసమర్థ సెక్యూరిటీ సిబ్బంది ఉన్నదని భావిస్తున్నారు. 62 శాతం మంది ఎమర్జెన్సీ అలారమ్ సిస్టమ్ తగిన విధంగా లేదని చెప్పారు. సర్వెలెన్స్, హైరిస్క్ ప్రాంతాలైన ఐసీయూ, సైకియాట్రిక్ వార్డుల్లో పటిష్టమైన సెక్యూరిటీ లేదని, కంట్రోల్ యాక్సెస్ కూడా తమకు లేదని వివరించారు. ఆయుధాలు, ప్రమాదకర ఆయుధాలను లోనికి రాకుండా అడ్డుకునే పరిస్థితులూ 90 శాతం సంస్థల్లో లేవని చెప్పారు. ప్రభుత్వ వైద్య సంస్థల్లో కంటే ప్రయివేటు వాటిలో మంచి భద్రత ఉన్నదని భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల కంటే రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పరిస్థితులు ఇంకా దారుణంగా ఉన్నాయని పేర్కొన్నారు. 70 శాతం మంది ఎమర్జెన్సీ అలారమ్ సమర్థవంతంగా లేవని రిపోర్ట్ చేశారు.



81.3% శాతం మంది హింసను ఎదుర్కొన్నట్టు తెలిపిన హెల్త్ కేర్ వర్కర్లు.

80% శాతం మందికి ఎమర్జెన్సీ పరిస్థితుల్లో ఎవరిని కాంటాక్ట్ చేయాలో తెలియదని ఈ సర్వే తేల్చింది

44.1% శాతం మంది హింస ఎదుర్కొన్న వారిలో ఉన్నారు. ఆ ఘటనలను సరిగ్గా హ్యాండిల్ చేయలేక పోయారని భావిస్తున్నారు.

70% శాతం మందికి సెక్యూరిటీకి సంబంధించి ఆందోళనకర విషయాలను రిపోర్ట్ చేసే రహస్య పద్ధతి అందుబాటులో లేదు.

ఈ సమస్యలను పరిగణనలోకి తీసుకోవాలని ఈ అధ్యయన కమిటీ సూచించింది. హై రిస్క్ ఏరియాల్లో సెక్యూరిటీ పెంచాలని, సెక్యూరిటీ సిబ్బందిని పెంచాలని, డ్యూటీ రూమ్ పరిస్థితులు మెరుగుపరచాలని, హింసను ఎలా ఎదుర్కోవాలో సూచించే స్పష్టమైన ప్రొటోకాల్స్‌ను రూపొందించి అమలు చేయాలని సిఫారసులు చేసింది.

బీజేపీకి అగ్నిపరీక్షగా
రాజస్థాన్ ఉప ఎన్నికలు



జైపూర్ : రాజస్థాన్‌లోని ఏడు శాసనసభ స్థానాలకు జరగబోయే ఉప ఎన్నికలు భజన్‌లాల్ శర్మ నేతృత్వంలోని అధికార బీజేపీకి అగ్నిపరీక్షగా నిలవబోతున్నాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాలలో ఇండియా బ్లాక్ 11 సీట్లను గెలుచుకొని సమధికోత్సాహంతో ఉంది. రాష్ట్రంలోని జుంజునూ, దౌసా, దియోలీ-ఉనియారా, ఖీన్సార్, సాలుంబర్, చౌరాసీ, రాంఘర్ స్థానాలకు నవంబర్ 13న పోలింగ్ జరుగుతుంది. రాంఘర్, సాలుంబర్ మినహా మిగిలిన స్థానాలకు ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేలు లోక్‌సభ సభ్యులుగా ఎన్నిక కావడంతో ఉప ఎన్నికలు అవసరమయ్యాయి. రాంఘర్, సాలుంబర్ ఎమ్మెల్యేలు మరణించడంతో ఆ స్థానాలు ఖాళీ అయ్యాయి. భజన్‌లాల్ శర్మ ప్రతి విషయానికీ కేంద్ర పెద్దల ఆదేశాల కోసం ఎదురు చూడడం పరిపాటి అయిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. రాజస్థాన్‌లో బీజేపీ ప్రభుత్వ పాలనకు ఈ డిసెంబర్‌తో ఏడాది పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పనితీరుపై ప్రజలు ఇవ్వబోయే తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఖాళీ అయిన ఏడు స్థానాలలో ఆరు కాంగ్రెస్ లేదా బీజేపీ వ్యతిరేక కూటమిలోని పార్టీలు ప్రాతినిధ్యం వహించినవే. మిగిలిన ఒక్క స్థానం బీజేపీకి చెందినది. జాట్ల ఆధిపత్యం అధికంగా ఉన్న షెకావతీ ప్రాంతంలో శాసనసభ స్థానాలను గెలుచుకోవడం బీజేపీకి సవాలు వంటిదే. ఎందుకంటే లోక్‌సభ ఎన్నికలలో ఆ ప్రాంతంలో బీజేపీ దారుణంగా దెబ్బతిన్నది. అగ్నివీర్ పథకంపై అక్కడి యువత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. అనేక నిరసన ప్రదర్శనలు కూడా జరిగాయి. గత సంవత్సరంలో జరిగిన శాసనసభ ఎన్నికలలో అధికారాన్ని కోల్పోయినప్పటికీ షెకావత్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించింది. తూర్పు ప్రాంతంలో కూడా ఆ పార్టీ విజయాలు నమోదు చేసుకుంది. అక్కడి గిరిజన ఓటర్ల మద్దతు కాంగ్రెస్‌కే లభిస్తోంది. లోక్‌సభ ఎన్నికలలో రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ (ఆర్‌ఎల్‌పీ), భారత్ ఆదివాసీ పార్టీ (బీఏపీ)లతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్నప్పటికీ శాసనసభ ఎన్నికలలో ఒంటరిగానే పోటీ చేసే అవకాశం ఉంది.

బీజేపీ నేత కుమారుడికి పాకిస్తాన్ అమ్మాయితో పెళ్లి

లక్నో: ఉత్తరప్రదేశ్ జిల్లాలో ఓ వివాహ వేడుక జరిగింది. ఒక బీజేపీ నాయకుడి కుమారుడు ఆన్‌లైన్ "నికా" ద్వారా పాకిస్తాన్ అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కార్పొరేటర్ అయిన తహసీన్ షాహిద్ తన పెద్ద కుమారుడు మహ్మద్ అబ్బాస్ హైదర్‌ను లాహోర్ నివాసి ఆండ్లీప్ జహ్రాని వివాహం చేసుకున్నారు. రెండు పొరుగు దేశాల మధ్య కొనసాగుతున్న రాజకీయ ఉద్రిక్తతల కారణంగా వరుడు వీసా కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ దానిని పొందలేకపోయాడు. వధువు తల్లి రానా యాస్మిన్ జైదీ అనారోగ్యంతో పాకిస్తాన్‌లోని ఐసియులో చేరడంతో పరిస్థితి మరింత సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో పెళ్లి వేడుకను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని షాహిద్ నిర్ణయించుకున్నాడు. శుక్రవారం రాత్రి, షాహిద్ ఒక ఇమాంబారా వద్ద "బారాతి"తో సమావేశమై ఆన్‌లైన్ "నికాహ్"లో పాల్గొన్నారు. వధువు కుటుంబం లాహోర్ నుంచి వేడుకలో పాల్గొన్నారు. షియా మత నాయకుడు మౌలానా మహఫూజుల్ హసన్ ఖాన్ ఇస్లాంలో, "నికాహ్" కోసం స్త్రీ యొక్క సమ్మతి చాలా అవసరమని, ఆమె దానిని మౌలానాకు తెలియజేస్తుందని వివరించారు.

శ్రీకాంత్ పంగార్కర్‌కు షిండే శివసేన షాక్

జల్నా విధానసభ ప్రచార బాధ్యతల నుంచి ఔట్
ఇటీవలే పార్టీలో చేరిన గౌరీ లంకేశ్ హత్య కేసు నిందితుడు



ముంబయి : ప్రముఖ జర్నలిస్టు గౌరీ లంకేశ్ హత్య కేసు నిందితుల్లో ఒకరైన శ్రీకాంత్ పంగార్కర్‌కు.. మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన షాకిచ్చింది. ఆయనను జల్నా విధాన సభ ప్రచార బాధ్యతల నుంచి తప్పించింది. మూడ్రోజుల క్రితమే ఆయన శివసేన పార్టీ కండువాను కప్పుకున్నారు. మాజీ మంత్రి అర్జున్ ఖోట్కర్ సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జల్నా విధాన సభ ప్రచార బాధ్యతలు పంగార్కర్‌కు అప్పగించబడతాయని కూడా అర్జున్ ఖోట్కర్ చెప్పారు. అయితే, బాధ్యతలు అప్పగించి మూడ్రోజులు కూడా సరిగ్గా గడవకముందే.. శివసేన ఆయనను ఆ బాధ్యత నుంచి తప్పించింది. ఒకవేళ పార్టీ తరవున ఆయనకు ఏవైనా బాధ్యతలు అప్పగించి ఉంటే.. అవి నిలుపుదలలో ఉంటాయని శివసేన స్పష్టం చేసింది.

2017లో గౌరీ లంకేశ్ హిందూత్వ శక్తుల చేతిలో హత్యకు గురయ్యారు. ఆ సమయంలో గౌరీ లంకేశ్ హత్య దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ కేసుకు సంబంధించి 2018లో శ్రీకాంత్ పంగార్కర్ అరెస్టయ్యారు. గతనెలలోనే కర్నాటక హైకోర్టు ఆయనకు బెయిల్‌ను మంజూరు చేసింది. అయితే, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు ఆయన శివసేనలో చేరటం గమనార్హం. పూర్వ శివసేన నుంచి 2001-2006 మధ్య జల్నా మునిసిపల్ కౌన్సిలర్‌గా పంగార్కర్ పని చేశారు. ఆ తర్వాత శివసేనను వీడి హిందూ జనజాగృతి సమితిలో 2011లో చేరారు. 2017 డిసెంబర్‌లో సన్‌బర్న్ మ్యూజిక్ ఫెస్టివల్ హిందూ సంస్కృతికి వ్యతిరేకమని భావించిన పంగార్కర్.. ఆ కార్యక్రమానికి అంతరాయం కలిగించి, అల్లర్లు సృష్టించటానికి కుట్రపన్నారన్న ఆరోపణలతో నలసోపర ఆయుధ రవాణా కేసులోనూ పంగార్కర్ నిందితుడిగా ఉన్నాడు. ఇందుకోసం ఆయన పిస్టోల్స్, ఎయిర్‌గన్స్, పెట్రోల్ బాంబులను కూడా సమకూర్చుకోవటం గమనార్హం. గౌరీలంకేశ్ కేసులో పంగార్కర్ ఆయుధాలు సమకూర్చాడనీ, ట్రైనింగ్ క్యాంప్‌నకు హాజరయ్యాడని ఆరోపణలతో నిందితుడిగా ఉన్నాడు. గౌరీ లంకేశ్ హత్య కేసులో నిందితులుగా ఉన్న మరో ఇద్దరు నిందితులు బెయిల్‌పై విడుదలవ్వగా హిందూత్వ గ్రూపులు వారికి ఘన స్వాగతం పలకటం గమనార్హం. 2017, సెప్టెంబర్ 5న గౌరీ లంకేశ్‌ను బెంగళూరులోని ఆమె ఇంటి వద్ద నిందితులు కాల్చి చంపిన విషయం విదితమే. హత్య ఒక వ్యవస్థీకృత నేరమనీ, నిందితులకు హిందూత్వ సంస్థ సనాతన్ సంస్థాతో సంబంధాలున్నాయని చార్జిషీటులో పోలీసులు పేర్కొన్న విషయం తెలిసిందే.

సమస్యల పరిష్కారానికి విస్తృత పోరాటాలు

నిధుల కేటాయింపులో రాష్ట్రాలపై కేంద్రం వివక్ష
రాష్ట్ర ప్రభుత్వ ఆరు గ్యారంటీల అమలుపై ఒత్తిడి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు
దేశ, రాష్ట్ర, జిల్లా రాజకీయ భవిష్యత్తుపై ప్రతినిధి బృందం సుదీర్ఘ చర్చలు
జిల్లా కార్యదర్శిగా జయరాజ్ ఎన్నిక
ముగిసిన సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా తృతీయ మహాసభలు



నవతెలంగాణ-జహీరాబాద్

కార్మిక, కర్షక, అట్టడుగు వర్గాల సమస్యల పరిష్కారానికి విస్తృత పోరాటాలు నిర్వహించాలని సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా తృతీయ మహాసభలో ఏకగ్రీవంగా ఆమోదించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎక్కడికక్కడ ఎండగట్టాలని నిర్ణయం తీసుకున్నారు. జహీరాబాద్‌లో రెండ్రోజుల పాటు కొనసాగిన సంగారెడ్డి జిల్లా తృతీయ మహాసభలు.. చివరి రోజైన ఆదివారం.. ప్రస్తుత దేశ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై ప్రతినిధి బృందం సుదీర్ఘంగా చర్చించి అనేక తీర్మానాలు చేసింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు మాట్లాడుతూ.. ప్రధానంగా కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రజలను మభ్యపెడుతున్న విధానాన్ని, బూటకపు హామీలు, వర్గ విభేదాలు, కుల మతాల మధ్య రాజకీయ చిచ్చులు పెట్టేందుకు చేస్తున్న కుట్రలను ప్రజలకు తెలియపరిచి.. ఎక్కడికక్కడ ఉద్యమాలు నిర్వహించాలని చెప్పారు. ఒక్కో రాష్ట్రంలో ఒక విధమైన నీతిని అవలంబిస్తూ కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపులో రాష్ట్రాలపై వివక్ష చూపుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలు అమలు చేసే వరకు అన్ని వర్గాల వారిని ఐక్యపరిచి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. నల్లగొండ, ఖమ్మం జిల్లాలతో పాటు సంగారెడ్డి జిల్లాలో కూడా ఉద్యమాలను ఉధృతం చేసేలా ప్రతి కార్యకర్తా గ్రామీణ స్థాయి నుంచి పార్టీని బలపరిచేందుకు కావాల్సిన చర్యలు చేపట్టేందుకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రధాన హామీలు మహిళలకు నెలకు రూ.2500 నగదు, రూ.500కే గ్యాస్ సిలిండర్ లాంటివి అమలు జరగలేదని, వాటి అమలుకు ప్రభుత్వంపై ఆందోళనలు నిర్వహించాలని తెలిపారు.

ప్రతి కార్యకర్త.. ప్రజా సమస్యలపై సైనికుల్లా పోరాడుతూ పార్టీని బలపరిచేందుకు కృషి చేయాలన్నారు.

ముందుగా సంగారెడ్డి జిల్లా పార్టీ కార్యదర్శి జి.జయరాజ్.. గత మూడేండ్లలో జిల్లాలో చేపట్టిన వివిధ ఉద్యమాలు, విజయాల గురించి వివరిస్తూ నివేదికను ప్రవేశపెట్టారు. జిల్లాలో ముందు తీసుకోవాల్సిన కర్తవ్యాల గురించి ఒక్కొక్క అంశంపై జిల్లా కమిటీ సభ్యులు రాజయ్య, మాణిక్యం, రామచందర్, సాయిలు, రేవంత్‌కుమార్ తీర్మానాలు ప్రవేశపెట్టారు. వాటన్నింటికీ జిల్లా ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోద ముద్ర వేశారు. కాగా, మహాసభలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా పార్టీ డివిజన్ కార్యదర్శి బి.రామచందర్ ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు చేశారు. దాంతో రెండ్రోజుల పాటు సాగిన మహాసభలు.. ఆదివారంనాటితో ఘనంగా ముగిశాయి.

సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా నూతన కమిటీ



మహాసభ చివరిరోజు 15మందితో సంగారెడ్డి జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. జిల్లా కార్యదర్శిగా గొల్లపల్లి జయరాజు, కార్యదర్శివర్గ సభ్యులుగా బీరం మల్లేశం, కె.రాజయ్య, బి. రాంచందర్, ఎ.మాణిక్, జి.సాయిలు, ఎం.నర్సింలు, వి.ప్రవీణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మా పోరాటానికి అండగా నిలవండి : ఫార్మాసిటీ భూబాధితులు

జిల్లా మహాసభల నేపథ్యంలో అక్కడికి వచ్చిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, ఎస్.వీరయ్యను న్యాల్కల్ మండలానికి చెందిన ఫార్మాసిటీ భూ బాధితులు కలిశారు. ఫార్మాసిటీకి వ్యతిరేకంగా తాము చేస్తున్న పోరాటానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.



ముగిసిన సీపీఐ(ఎం) వికారాబాద్ జిల్లా మహాసభలు

18 తీర్మానాలు ఆమోదం
జిల్లా నూతన కార్యదర్శిగా ఆర్.మహిపాల్ ఎన్నిక



నవతెలంగాణ-తాండూరు

వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ కేంద్రంలో రెండ్రోజులుగా జరుగుతున్న సీపీఐ(ఎం) జిల్లా మహాసభలు ఆదివారం ముగిశాయి. కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ మహాసభలో 18 తీర్మానాలు ప్రవేశపెట్టారు. పార్టీ జిల్లా కార్యదర్శిగా ఆర్.మహిపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహిపాల్ మాట్లాడుతూ.. కార్మిక, కర్షకుల సమస్యల పరిష్కారానికి పార్టీ ఆధ్వర్యంలో నిరంతరం పోరాడుతామన్నారు. పోడు భూముల సాగులో ఉన్న గిరిజనులు, గిరిజనేతరులకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించా లని డిమాండ్ చేశారు. దళిత, గిరిజనులపై కుల వివక్ష దాడులు, దౌర్జన్యాలు అరికట్టాలని తెలిపారు. ధరణి పోర్టల్‌ను సవరించి జిల్లాలో భూ సమస్యలు పరిష్కరించాలని, భూ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వ ప్రస్తుత మార్కెట్ ధరకు సవరించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. పాలమూరు- రంగారెడ్డి, కొడంగల్- నారాయణ పేట ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం చేయాలని కోరారు. తాండూ రులో కంది బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. సీపీఐ(ఎం) నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ పోరాటాలకు సిద్ధమవుతుం దన్నారు. మహాసభలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా నూతన కమిటీ

సీపీఐ(ఎం) వికారాబాద్ జిల్లా నూతన కమిటీ కార్యదర్శిగా ఆర్.మహిపాల్, కమిటీ సభ్యులుగా ఏం.వెంకటయ్య, పి. రామకృష్ణ, కె.శ్రీనివాస్, బుగ్గప్ప, చంద్రయ్య, సుదర్శన్, సత్యనారాయణ, మంగమ్మ, నరసమ్మ, నవీన్ కుమార్‌ను ఎన్నుకున్నారు.

అక్టోబర్ 17వ తేదీన ఎనిమిది బోగీల అగర్తలా-లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. అదే నెల 11వ తేదీన గూడ్స్ ట్రైన్‌ను ఓ ప్యాసింజర్ ట్రైన్ చెన్నైలో ఢీకొట్టింది. ఈ రెండింటిలో ప్రాణనష్టం జరగలేదు. కానీ, గతేడాది జూన్ 2వ తేదీన బాలాసోర్ ప్రమాదంలో 275 మందికి మించి మరణించారు. అధునాతన వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నా రైలు ప్రమాదాలు జరుగు తూనే ఉన్నాయి. సేఫ్టీ విషయమై రైల్వేపై ఒత్తిడి పెరుగుతూనే ఉన్నది. అదే సందర్భంలో తన మనుగడను సాగించే ఒత్తిడి కూడా రైల్వేపై ఉన్నది.

భారత రైల్వేపై భారమేంటీ?



తరుచూ ప్రమాదాలెందుకు? కవచ్ వ్యవస్థ పని తీరు ఎలా ఉంది? భద్రతను ఏ అంశాలు ప్రభావితం చేస్తున్నాయి?

ప్రమాదాలు పెరిగాయా? తగ్గాయా?

రైల్వే ఆదాయం పెరిగిందా? ఇండియన్ రైల్వేస్‌పై నవతెలంగాణ ప్రత్యేక కథనం

న్యూఢిల్లీ: 1960ల్లో యేటా 1,390 రైలు ప్రమాదాలు జరిగేవి. గత దశాబ్దంలో ఈ సంఖ్య 80కి తగ్గింది. 2021-22లో 34, 2022-23లో 48, 2023-24లో 40 రైలు ప్రమాదాలు జరిగాయి. రైలు ప్రమాదాల సంఖ్య, తీవ్రతను బట్టి ప్రాణనష్టం, రైల్వే శాఖ ఆస్తి నష్టం ఉంటుంది. ఈ చర్చ నడుమ కేంద్ర ప్రభుత్వం కవచ్‌ను ప్రవేశపెట్టింది. ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్‌నే కవచ్ అని పిలుస్తున్నాం. తమకు సమీపంగా మరో ట్రైన్ వచ్చినప్పుడు లోకో పైలట్‌ను అలర్ట్ చేయడం, ఆటోమేటిక్ బ్రేకులు పడటం ఈ వ్యవస్థలో భాగంగా ఉంటాయి. అయితే కవచ్ వచ్చాక కూడా ప్రమాదాలు జరగడం కొత్త చర్చను ముందుకు తెచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరి కల్లా 1,465 కిలోమీటర్ల(మొత్తం నెట్‌వర్క్‌లో ఇది 2శాతం కిలోమీటర్లు మాత్రమే) రూట్‌లో కవచ్ ఏర్పాటు చేశారు. బాలాసోర్ యాక్సిడెంట్ తర్వాత కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ ఒక కిలోమీటర్‌కు రూ. 50 లక్షలు, లోకో మోటివ్‌కు రూ. 70 లక్షలు ఖర్చవుతాయని వివరించారు. ఈ వ్యవస్థ అమలులో తీవ్ర జాప్యం ఉన్నదని ప్రశ్నిస్తే.. అధికారులు గత ప్రమాదాలతో పోలికలు తీస్తున్నారు. కానీ, ప్రస్తుతం అందుబాటులో ఉన్న టెక్నాలజీ గతంలో లేదు. అప్పటి పరిస్థితులను నేటితో పోల్చడం సహేతుకం కాదని నిపుణులు చెబుతున్నారు. ఇప్పుడు ప్రమాదాలను పూర్తిగా నివారించే అవకాశాలు ప్రభుత్వం ముందు ఉన్నాయి. 1990-91లో సుమారు 70 శాతం పెద్ద ప్రమాదాలు రైలు పట్టాలు తప్పడమేనని రైల్వే పేర్కొంది. కేవలం 2 శాతం మాత్రమే రైళ్లు ఢీకొన్న ఘటనలు ఉన్నాయి. ఇప్పుడు కవచ్ కూడా కవరైపెట్టయ్ యాక్సిడెంట్‌ను నివారించలేకపోవడం చర్చనీయాంశమైంది. కవచ్ మినిమమ్ మార్జిన్‌కు అవతల తప్పిదం జరగడంతో ఈ యాక్సిడెంట్ జరిగిందని అధికారులు పేర్కొన్నారు.

ఆదాయం ఎలా ఉంది?

2024-25లో రూ. 100 ఆర్జించడానికి పెట్టే ఖర్చు రూ. 98.2(ఆపరేటింగ్ రేషియో)గా ఉన్నది. క్రితం ఏడాది ఇది రూ. 98.7గా ఉన్నది. కొంత మెరుగైనా.. 2016లోని రూ.97.8తో పోల్చితే మందగించింది. ఓఆర్ ఎక్కువ ఉంటే బడ్జెట్‌పై, అదనపు కేటాయింపులపై రైల్వే ఆధారపడాల్సిన అవసరం ఉండదు. రైల్వేకు రెండు మార్గాల్లో ఆదాయం వస్తుంది. ఒకటి ప్యాసింజర్ సర్వీస్, రెండు ఫ్రెయిట్ సర్వీస్. ఇందులో ఫ్రెయిట్ ద్వారానే 65 శాతం రాబడి వస్తుంది. సుమారు 30 శాతం రైల్వే నెట్‌వర్క్‌ను 100 శాతం ఉపయోగించుకుంటున్నట్టు నేషనల్ రైల్ ప్లాన్ ముసాయిదా పేర్కొంది. ఫ్రెయిట్ మూవ్‌మెంట్ మెల్లిగా ఉండటం వల్ల రైలు పట్టాలు ఆక్రమించే ఉంటు న్నాయి. ఇందుకోసం మౌలిక సదుపాయాలు మరింత వద్ధి చేసుకోవాల్సి ఉంటుంది. కానీ, బడ్జెటరీ కేటాయింపులు ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. ఎప్పటికప్పుడు కొత్త పరికరాలు, ట్రాక్‌లను రీప్లేస్ చేయడం, బోగీల మెయింటెయినింగ్ కూడా పర్యవేక్షించాల్సి ఉంటుంది. 2023-24 బడ్జెట్‌లో ట్రాక్ రెనివల్ కోసం పెట్టుబడి 7.2 శాతానికి తగ్గించారు. రాష్ట్రీ రైల్ సంరక్ష కోశ్ సేఫ్టీ ఫండ్ రిపేర్, రీప్లేస్‌కు చెల్లించే స్థితిలో లేదని రైల్వేస్ స్టాండింగ్ కమిటీ పేర్కొంది.

ప్యాసింజర్ రెవెన్యూ నష్టాలను ఫ్రెయిట్ లాభాలు ఓ మేరకు పూడ్చుతున్నాయి. 2019-20లో ప్రయాణికులకు సేవలు అందించడం ద్వారా సుమారు రూ. 50 వేల కోట్లు రాబడి వస్తే.. రూ.63 వేల కోట్ల నష్టం వాటిల్లింది. 2021-22లో కరోనా విపత్తు కాలంలో చాలా ట్రైన్లు రద్దు చేయడం మూలంగా రూ. 68 వేల కోట్ల నష్టం వచ్చింది. 2024 జులై పీఆర్‌ఎల్ విశ్లేషణ ప్రకారం 2024-25లో ప్యాసింజర్ సర్వీస్ రెవెన్యూ రూ. 80 వేల కోట్లు ఉండొచ్చు. ట్రాఫిక్ ఎక్కువ ఉన్న రూట్లలో వందే భారత్‌లు ప్రవేశపెట్టడం, చాలా వరకు స్లీపర్, సెకండ్ క్లాస్ కోచ్‌ల స్థానాల్లో ఖరీదైన ఏసీ కోచ్‌లను చేర్చడం ద్వారా కూడా ఈ ఏడాది రాబడి పెరిగే అవకాశం ఉన్నది.భారతీయులకు చౌక ప్రయాణ సేవలు అందించడం, లాభసాటి వ్యాపార లక్ష్యాల మధ్య రైల్వే చిక్కుకుంది. పెరుగుతున్న వేతనాలు, పింఛన్లు, ఇంధన ఖర్చులు రైల్వే నష్టాలకు తోడవుతున్నాయి. కాగా, లోకో పైలట్ల పరిస్థితి అధ్వానంగా ఉంటున్నదని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఎక్కువ ఫ్రెయిట్ మూవ్‌మెంట్ ఉండే జోన్‌లలో 12 గంటల షిఫ్ట్‌లతో ఒత్తిడి పెరుగుతున్నదని చెబుతున్నారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే అవసరమైన నిధులను సంపాదించు కోవడం, ఆదాయం పెంచాలని, రద్దీని తగ్గించాలనే డిమాండ్లతో రైల్వే నిత్యం లక్ష్యాల ఛేదనలో సతమతం అవుతున్నది.

'నీడల దృశ్యం' : అనుభూతుల ఊట

ఏనుగు నరసింహారెడ్డి తెలుగు సాహిత్య లోకంలో పరిచయం అక్కరలేని పేరు. గత ముప్పై ఐదు ఏళ్లుగా రచనా వ్యాసంగం చేస్తున్న అక్షర ప్రేమికుడు. ఇప్పటి వరకు విభిన్న ప్రక్రియల్లో 15 కు పైగా పుస్తకాలు రాసి, విశిష్టమైన పురస్కారాలు ఎన్నో అందుకోవడం వీరి ప్రతిభకు నిదర్శనం. కవితా పిపాసి అయిన ఏనుగు నరసింహారెడ్డి కలం నుండి జాలువారిన మరో ఆణిముత్యమే 'నీడల దృశ్యం' కవితా సంపుటి.

అనుభవాలను, అనుభూతులను అర్థవంతంగా వాక్య నిర్మాణం చేయడంలో దిట్ట. వస్తువును కవిత్వీకరించడంలో తనకు తానే సాటి. సరళమైన భాషను ప్రయోగిస్తూనే కవిత నిర్మాణంలో గాఢతను ప్రోది చేయడంలో ఈ కవిది ప్రత్యేక శైలి. ఆయన రచనలు వివిధ భాషల్లోకి అనువదించబడి ప్రఖ్యాతిగాంచాయి.


ఏనుగు నరసింహారెడ్డి వెలువరించిన 'నీడల దృశ్యం' అనే కవితా సంపుటి ఎన్నో భావోద్వేగాల ఊట. చదువుతున్న కొద్దీ తెలియని అనుభూతి యేదో మనసునిండా పరచుకొని తన్మయత్వానికి గురిచేస్తుంది.

'దేవతలు గూడా' కవితను ఈ పుస్తకానికి ప్రారంభ కవితగా పెట్టడం సముచితంగా ఉంది. ప్రతి ఒక్కరికి తల్లి జీవితాన్ని ఇస్తే.... భార్య జీవితాన్ని నడిపిస్తుంది. పిల్లలు తనువు ముగించే వరకు తోడుంటారు. ఈ మూడు దశలను కవి అధ్యయనం చేశాడు. చేస్తున్నాడు. వారి పాత్రల్లో వారు ఒదిగి... ఎదుగుతున్న తీరును నైపుణ్యంగా చెప్పారు. "ఊరికి దూరం కాటికి దగ్గర/ నా వైద్యానికి అంత ఖర్చోద్దురా" అని కన్నతల్లి అన్నప్పుడు.... "వంట అసలే రానివాడివి/ హోటల్నైనా సరిగ్గా తిను" ఆసుపత్రి పడక మీద భార్య పలికిన మాటలు.... చదువుతుంటే పఠితల కళ్ళు జలధారలు కావాల్సిందే. ఇలా కవిత కిందికి నడుస్తున్నా కన్నీటి ఊట పెరుగుతుంది అనడంలో అతిశయోక్తి లేదు.

నుమాయిష్‌లో అందమైన/ అందమైన ఆటబొమ్మలను చూసి/ గంతులేసిన చిన్నపిల్లకు మన జేబు గుర్తొచ్చి/ 'ఇప్పుడొద్దులే నాన్నా' అని సర్దుకున్నప్పుడు/ పిల్లలే మనకన్నా ఎదిగిపోయారా అని/ కళ్లల్లో పొంగే జలపాతాన్నేమంటారు" అంటాడు కవి. ఇక చివరి పాదాలతో కవిత తారాస్థాయికి చేరుతుంది. "అన్నిసార్లూ కష్టాలే/ మనల్ని కరగదీస్తాయని చెప్పలేం/ దేవతలుగూడా సమయానుసారంగా/ మనల్ని ఏడిపించగలగుతారు" అంటూ ముగుస్తుంది. కవిత చదవడం పూర్తయిన తర్వాత పాఠకుడు కొన్ని నిమిషాలు మౌనస్థితిలోకి వెళ్ళిపోతాడు. దేవతలుగా మారిన ఆడవారి ప్రేమానురాగాలను తలచుకుంటూ కృతజ్ఞతలు ప్రకటిస్తాడు.

కుటుంబ ఉన్నతికోసం ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, జీవితాన్ని త్యాగం చేసిన మాతృమూర్తి వ్యథను ఆర్తిగా మలచిన కవిత 'గుడ్డికొంగ'. "నీళ్ళనూ బియ్యాన్నీ/ ఏ నిష్పత్తిలో గాలిస్తే/ రాళ్ళ బాధలను అడుగుపట్టించవచ్చో తెలిసిన/ మహా నేర్పరి ఆమె", "మూడు ఇటుకల అంచులోపల/ భగ్గుమనకుండా మండుతుండే/ కనిపించని జ్వాల ఆమె" అంటూ అమ్మలోని అనుభవం, నేర్పరితనంతో మొదలయ్యే ఈ కవిత ముగింపులోకొచ్చేసరికి మనసును కలుక్కుమనిపిస్తుంది. "తలంత బలగం/ తలా ఓ దిక్కుకు తరలిపోతే/ నెలల మీద చెట్లు మార్చే/ రెక్క విరిగిన పక్షి ఆమె/ అన్ని కాలాలూ శిశిరపక్షాలే/ ఇపుడామె/ ఏ చెట్టు మీద ఎంతకాలం/ ఉండొచ్చో అర్థంకాని/ గుడ్డికొంగ".

> మనిషి పుట్టినది మొదలు తనువు చాలించే వరకు పోరాడకుంటే జీవించలేడు. ఎన్నో సమస్యలు, మరెన్నో అవరోధాలు అడుగడుగునా ఎదురొస్తాయి. గమనాన్ని వెనక్కి నెట్టాలని తహతహలాడ్తాయి. ఏదేమైనా ముసురుకున్న కారుచీకట్లలోంచి వెలుగురేఖను ఒడిసిపట్టాలనే తపన ఈ కవితనిండా జిగేల్‌మంటోంది. తొవ్వలన్నీ మూసుకుపోతే/ కొత్త తొవ్వ ఒకటి వేయాల్సిందే అంటున్న ఈ కవితా సంపుటిలో వేల నాదాలున్నాయి... వేవేల నినాదాలున్నాయి. ప్రత్యేక కలల అద్దం భళ్ళుమంటున్న ఆవేదనలున్నాయి. మరో విషయమేమిటంటే మాండలికం, నుడికారం ఈ కవి కలముకున్న అదనపు ఆకర్షణ.



"నాయిన పిట్టయి/ నా వెంట తిరుగుతున్నది" అంటూ నాన్నను తడుముకుంటాడు. గొడుగుతోనూ, కవచకుండలాలతోను పోలుస్తూ... మదినిండా ఉబుకుతున్న నాన్న అనుబంధాన్ని అక్షరాల బొక్కెనతో తోడుకుంటాడీ కవి.

ఈ సంపుటిలో మరో ఆణిముత్యంలాంటి కవిత 'సంసిద్ధం'. రేపటి జీవితానికి పొంచియున్న ప్రమాదాన్ని పసిగట్టి ముందుగానే కవి చేస్తున్న హెచ్చరిక. దిగులును దులుపుకొని, నిరాశగాయాలకు మందు రాసుకొని సమాజం తల ఎత్తుకొని ముందుకు సాగాలనే ఆకాంక్ష కొట్టొచ్చినట్లు కన్పడుతోంది.

చైతన్యాన్ని ప్రోది చేసే వెలుగురేఖ లాంటి కవిత 'పగటిరాత్రి'. "సెలయేటినైనా ఈదాలి/ మహా ప్రవాహమైనా ఈదాలి/ కడలినైనా ఈదాలి/ ఈది తీరాల్సిన వాడివి/ ఈదకుండా మునిగిపోవడం ముమ్మాటికీ తప్పే". మనిషి పుట్టినది మొదలు తనువు చాలించే వరకు పోరాడకుంటే జీవించలేడు. ఎన్నో సమస్యలు, మరెన్నో అవరోధాలు అడుగడుగునా ఎదురొస్తాయి. గమనాన్ని వెనక్కి నెట్టాలని తహతహలాడ్తాయి. ఏదేమైనా ముసురుకున్న కారుచీకట్లలోంచి వెలుగురేఖను ఒడిసిపట్టాలనే తపన ఈ కవితనిండా జిగేల్‌మంటోంది.

ఇలాంటి భావనే 'లాంగ్‌జంప్' అనే కవితలోనూ గోచరిస్తుంది. "కాలాలు మారినా నిలబడాలి/ పక్షాలు వాదాలు/ మార్చుకున్నా ఎదురీదాలి/ కొండ ఎదురైన చోట/ ఈదడం తప్పు/ ఊపిరి బిగపట్టుకొని కదా/ లాంగ్‌జంప్ చేయాల్సింది". బలమైన ఆశావాదాన్ని పురికొల్పుతుంది.

నల్లచట్టాల మీద రైతులు చేసిన పోరాటాన్ని, వీరోచిత గాథల్ని ఉన్నతంగా ఆవిష్కరించిన కవిత 'కన్నీటి మంట'.

తొవ్వలన్నీ మూసుకుపోతే/ కొత్త తొవ్వ ఒకటి వేయాల్సిందే అంటున్న ఈ కవితా సంపుటిలో వేల నాదాలున్నాయి... వేవేల నినాదాలున్నాయి. ప్రత్యేక కలల అద్దం భళ్ళుమంటున్న ఆవేదనలున్నాయి. మరో విషయమేమిటంటే మాండలికం, నుడికారం ఈ కవి కలముకున్న అదనపు ఆకర్షణ.

"నేలను శోధిస్తాను, చరిత్రను తవ్వుతాను, అంతరంగాన్ని తరచి చూస్తాను, జీవితపు తట్టల్ని మోస్తాను. అప్పుడప్పుడు దిగులు మేఘాలు ఆవరించినా... మళ్ళీ తవ్వకంలో మునిగిపోతాను" అంటున్న ఈ కవి పాఠకులకు పదికాలాలు గుర్తుండిపోతాడు. పూలగుత్తుల పరిమళంలా కవిత్వ సువాసనలు వెదజల్లుతూనే వుంటాడు.

(ఈ నెల 27న 'నీడల దృశ్యం' కవితా సంపుటికి రొట్టమాకురేవు అవార్డు అందుకుంటున్న సందర్భంగా)



- రాచమళ్ళ ఉపేందర్, 9849277968

దేశం చేసిన ద్రోహం.. మీ మరణం



సోదాల పేరుతో, తలుపులు మూసి,
నిరాధారాలను ఆధారంగా చూపి,
నిర్దోషిని దోషిగా చిత్రీకరిస్తే,
సాక్షిగా నిలిచిన నాలుగు గోడలు,
నోరున్న సమాజంతో గోడు వెల్లబోసుకున్నాయి
మాది జీవం లేని ప్రాణమైతే!
సజీవంగా నిలిచిన సమాజ సమాధి మీరు అని!!
బెయిల్, పేరోలు అవినీతికి మేలు అవుతుంటే,
చట్టాలు సెక్షన్లు బలహీనులను బందీ చేస్తుంటే,
మానవ హక్కులన్నీ, ఉక్కు సంకెళ్లలలో మగ్గిపోతుంటే,
రాజ్యాంగ పీఠిక ఆత్మ అరణ్య రోదన ఎవరికి వినిపించింది!
గంతలు కట్టిన న్యాయదేవత
కార్చిన కన్నీరు ఎవరికి కనిపించింది!!
కదలలేని నిన్ను తన చేతుల్లో పెంచిన అమ్మ ఆఖరి చూపుకై
నీ కనుచూపులు వెతికిన దారులు
తల్లికై తల్లడిల్లుతున్న నిన్ను చూసి, కరిగిపోయిన ఆ జైలు గోడల గుండెలు
ఇరుకైన అండా సెల్, బిగిసుకు పోయి ఓదార్చిన ఇనుప కడ్డీలు.
కాలే చితిలో రగిలే తల్లి కడుపు కోత
జ్వాలలు కార్చిన కన్నీటి దారలు, పరితపించిన పంచభూతాలు,
అర్పించిన అశ్రు నివాళులు!
బూడిదై మిగిలిన నీ జ్ఞాపకాలు, చలనం లేని ఈ ప్రపంచ ఆనవాలు!!
నిజాలను మాట్లాడించిన మీ మౌన పోరాటం,
నిజాయితీని గెలిపించిన నీ దఢ సంకల్పం,
నిర్బంధాలను బంధించి, నియంతల నిగ్గు తేల్చి,
న్యాయాన్ని నిలబెట్టి, నిష్క్రమించావా
కుర్చీ భుజాలపై ముద్రించిన చేతుల చైతన్యం నిలిపి,
నిన్ను మోసి, తరించిన జాడల జాగతిని చూపి,
ప్రగతి పథాలను నడిపిన, నీ చక్రాల సైకిల్ నాదిలి!
హక్కులకై పోరాడే నీ అక్షరానోదిలి!!

- పగడాల శ్రీనివాస్

ఒక ప్రార్థన

శవం ఎంత రక్తాన్ని కారుస్తుంది
గొర్రెల కాపరి అశ్రద్ధ వల్ల కొండ అంచు నుంచి దూకే
మేక అరిచే శబ్దం ఎలా వుంటుంది?
ఓ దైవమా! ఈ ఏడాది గాయాలపై అద్దటానికి ఒక లేపనం ఇవ్వు.
అత్యాశతో యుద్ధ వేదికలపై ఎందరో శిలువ వేయ బడ్డారు.
వారి స్వస్థలాలైన నదీ ప్రాంతం నుండి ఎంతోమంది
తరిమివేయబడ్డారు ఉప్పునీటి సంద్రం వైపు
ఓ దేవా! దాహార్తులైన వారికి
నా దోసిలితో మంచినీళ్ల ఇచ్చే భాగ్యం కలుగ చేయి.
తాను చూసిన దృశ్యాలకు సిగ్గుపడుతూ ఆ సంద్రం ఎర్రగా మారింది.
ఓ ప్రభూ! దాని అలలను ముద్దిడి వాటిని నీలిరంగులోకి మార్చు.
ఒకరినొకరు పరస్పరం ప్రేమించుకునే మానవత్వం నేర్పు
ఓ ప్రభూ! పురుగు మందులు వాడని
మామూలు టీ రొట్టెతో కలిపి నాకు ఇవ్వు.
దానిలో కొంత వినయం, కొంత సాంస్కృతిక అహం కలుపు
రక్తంతో తడిసిపోయిన ఎముకలు, అస్తిపంజరాలతో వున్న
ఈ భూమిపై గల అమాయకులు, బలహీనులకు కూడా ఇవ్వు.
ఓ దేవా! ఈ ఏడాదైనా అహింసా బీజాలు మొలకెత్తించు
పిల్లలను మతవాదులుగా చేయవద్దు
వారిని కారుణ్యం, వాత్సల్యం వున్న వారిగా తీర్చి దిద్దు.
భూమి పై ఈ స్వర్గం కోసం ప్రజలు వెదికేటట్లు చేయి. ఆమెన్!

ఇంగ్లీషు: సాగరి ఛాబ్రా, తెలుగు: కొత్తపల్లి రవిబాబు

ఆ చక్రాల కుర్చేది ?

ఏది
ఆ చక్రాల కుర్చేది
ఐదేండ్ల సంది - అమరుడయ్యే దాక
గొప్ప మానవతా పరిమళాన్ని
తన ఒడిలో మోసిన ఆ అమ్మేది?
అడవికి మనసిచ్చి ఆకులకు మాటలు నేర్పి
హక్కులనడిగే సాయుధులను చేసిన
ఆ పచ్చని గుండెను నులివెచ్చగా కాసుకున్న ఆ తల్లేది ?
స్వార్థపు పాకర మీద
కాలేసి జారిపోతున్న లోకానికి చేయిచ్చి
నిస్వార్థంగా నిలబెట్టాలనుకున్న నెట్టాడికి
నిత్యం తోడునీడగున్న ఆ భూమేది ?
కండ్లు మూసుకొని
కదిలిపోతున్న చీకటి సమాజంలో
అక్షరాల అగ్గి రవ్వలను రాజేసి
తూరుపు తెరమీద
అభ్యుదయాన్ని ఆవిష్కరించిన వెలుగు పిట్టను
ఎగరేసిన ఆ ఆకాశమేది ?
మోదుగు పూలకు
వసంతాన్ని పరిచయం చేస్తున్న
ఆ ఎర్రని ఏరును మాయం చేస్తే
కుమిలిపోతు ఏడుస్తున్న ఆ పూల ఛత్రేది ?
విశ్వవిద్యాలయాన
అవమానాలు, ఆకలి పాఠాలను చెప్తుంటే....
ఎరుపెక్కిన సాయిబాబుని జన చక్రాలేవి ?
నిజం మాట్లాడినందుకే నిందలేసి
పదేళ్లపాటు అష్ట కష్టాలు పెట్టిన
బాపిష్టి ఫాసిస్టు పాలనకు సాక్ష్యమేది ?
ఏది
మెరుపయ్యిందా, మేఘమయ్యిందా,
సాదుకున్న బిడ్డడి ఆశయాలను వాగ్దానం చేస్తుందా ?
ఏది
ఆ చక్రాల కుర్చేది?
కండ్లార చూసుకుంటా, మనసారా సలాం చేస్తా
విముక్తి మార్గమేందో తెలుకుంటా
(ప్రొఫెసర్ సాయిబాబా స్మృతిలో...)

- చిక్కొండ్ర రవి, 9502378992


సాంస్కృతిక సమతుల్యతను బోధించే పాఠం

వేంపల్లె షరీఫ్ రాసిన 'ఆకుపచ్చ ముగ్గు' కథను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ పాఠ్యాంశంలో చేర్చడం అభినందించాల్సిన విషయం. దేశవ్యాప్తంగా పాఠ్యపుస్తకాల్లో మతాంశాలు పెరుగుతున్నాయని చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఇది కొంత ఊరటనిచ్చే అంశం. షరీఫ్ కథతో పాటు ఇందులో రావిశాస్త్రి వంటి ఉద్ధండుడి కథ 'పిపీలికం' కూడా ఉంది. అలాగే రత్నాకర్ పెనుమాక (ఈ పొలం అమ్మబడును), పోలాప్రగడ రాజ్యలక్ష్మి (నల్లపూసలు) కథలు డిగ్రీలోని మూడవ సెమిస్టర్ కోసం ఎంపికయ్యాయి. బిఎస్సీ, బిఏ, బీకాం, బిబిఏ చదువుతున్న విద్యార్థులు ఈ యేడాది నుంచి ఈ పాఠాలను నేర్చుకోవాలి.

అయితే మిగతా మూడింటితో పోలిస్తే షరీఫ్ కథ కొంత భిన్నమైంది, పైగా ఇప్పటి పరిస్థితులకు తక్షణావసరం కలదిగా నాకు అనిపిస్తుంది. షరీఫ్ ఈ కథను 2011లో రాశారు. ఆ యేడాదే ఆయన 'జుమ్మా' పేరుతో కథల పుస్తకం తీసుకొచ్చారు. అందులో కూడా ఈ కథ ఉంది. మరుసటి యేడాది ఆ పుస్తకానికి 'కేంద్ర సాహిత్య అకాడెమి యువ పురస్కారం' దక్కింది. ఒకరిని పొగడ్డం కోసం ఇంకొక్కరిని తెగడ్డం వంటివి చేయకుండా ఇరువర్గాలను దృష్టిలో పెట్టుకుని మీ మధ్య రాజకీయం అనే పెద్ద భూతం ఒకటి నిలిచి ఉంది, అది అడ్డుగా ఉన్నంతవరకు మీరు ఒకర్నొకరు సరిగా చూసుకోలేరని సున్నితంగా కథల్లో చెప్పడం ఇతని ప్రత్యేకత. ఇప్పుడున్న వాతావరణానికి ఈ శైలి అవసరమని చాలామంది విమర్శలు చెప్పే మాట. షరీఫ్ రాసిన కథలన్నీ కాస్త సంయమనంతో ఇరువర్గాలను ఆలోచింపజేస్తూ రాసినవే.

'జుమ్మా' కథలో మనమెంత మూఢ భక్తిలో ఉన్నా కొన్ని సార్లు దేవుణ్ని పక్కన పెట్టి చూస్తే కానీ జీవితం అర్థం కాదని తల్లి పాత్రతో చెప్పిస్తాడు. చూడ్డానికి కథలో ఏమీలేదు అనిపిస్తుంది కానీ ఎక్కడో మన అంతరంతరాల్లో ఈ విషయం గట్టిగా తగులుతుంది. 'పర్దా', 'తెలుగోళ్ల దేవుడు', ' సైకిల్ చక్రాలు' వంటి కథలన్నీ అలాంటివే. అయితే ప్రస్తుతం పాఠ్యాంశంగా ఉన్న 'ఆకుపచ్చ ముగ్గు' విషయానికొస్తే ఇది పూర్తిగా సమాజంలో సాంస్కృతిక సమతుల్యతను సూచించే కథ. ఈ విషయం చెప్పడానికి ఎంచుకున్న అక్క పాత్ర చాలా బలమైంది. ఒకసారి కథ చదివాక ఆమెను మర్చిపోవడం అంత సులువు కాదని రచయిత గొర్తి సాయి బ్రహ్మానందం అంటారు. ప్రఖ్యాత కథా రచయిత కేతు విశ్వనాథరెడ్డి ఈ అక్క పాత్రను తెనాలి రామకృష్ణ రాసిన పాండు రంగ మహత్యంలోని నిగమశర్మ అక్క పాత్రతో పోల్చారు. ఒక సమాజంలో అనేక సమూహాలు కలిసి బతుకుతున్నప్పుడు ఒక సమూహం యొక్క సంస్కృతి ప్రభావం మరో సమూహంపై తప్పక ఉంటుంది. అంత మాత్రం చేత ఏదో కొంపలంటుకున్నట్టు బాధపడాల్సిన పని లేదని అక్క పాత్ర చెబుతుంది.

> చూడ్డానికి కథలో ఏమీలేదు అనిపిస్తుంది కానీ ఎక్కడో మన అంతరంతరాల్లో ఈ విషయం గట్టిగా తగులుతుంది. 'పర్దా', 'తెలుగోళ్ల దేవుడు', ' సైకిల్ చక్రాలు' వంటి కథలన్నీ అలాంటివే. అయితే ప్రస్తుతం పాఠ్యాంశంగా ఉన్న 'ఆకుపచ్చ ముగ్గు' విషయానికొస్తే ఇది పూర్తిగా సమాజంలో సాంస్కృతిక సమతుల్యతను సూచించే కథ. ఈ విషయం చెప్పడానికి ఎంచుకున్న అక్క పాత్ర చాలా బలమైంది. ఒకసారి కథ చదివాక ఆమెను మర్చిపోవడం అంత సులువు కాదని రచయిత గొర్తి సాయి బ్రహ్మానందం అంటారు.



నిత్యం హిందూ స్నేహితుల మధ్య తిరుగుతూ, హిందువుల ఇళ్ల మధ్య నివసించే ముస్లిం అక్కకి సంక్రాతి పండుగ అంటే ఇష్టం. ఎందుకిష్టమంటే ఆ పండక్కి ఇళ్లముందు ముగ్గులేస్తారు కదా.. అందుకు ఇష్టం. ఆ ముగ్గుల్ని ఆమె ఒక కళ కింద ప్రేమిస్తుంది. నోటు పుస్తకాలను ముగ్గులతో నింపేస్తుంది. ఇసుకలో ఆడుకుంటుంటే ఒకచోట నిలబడి రౌండుగా తిరిగి కాలితో నేలమీద ముగ్గు వేసి దోస ముగ్గు అంటుంది. నీళ్ల బిందెను ఇంటికి తెచ్చి అరుగు మీద పెట్టి ఆ బిందెలో వేలిని ముంచి తడితో బండలమీద ముగ్గు వేస్తుంది. ఆమెకు ముగ్గులంటే అంత పిచ్చి.

తమది ముస్లిం కుటుంబమని, ఇంటి ముందు ముగ్గులు వేస్తుంటే అందరూ తలా ఒక మాట అంటున్నారని తల్లి బలవంతంగా కూతురితో ముగ్గులు వేయడాన్ని ఆపిస్తుంది. తర్వాత ఆమె మెల్లగా ఆ పిచ్చిని అరచేతుల్లో గోరింటాకుతో ముగ్గులు వేయడం వైపుకు మరల్చుకుంటుంది. 'ఇంటి ముందు వేస్తే ముగ్గు తప్పవుతుంది కానీ అరచేతుల్లో వేస్తే కాదు కదా. ఒక మతానికి మరో మతానికి తేడా ఇంతేనా? ఇందుకోసమేనా ఇన్ని గొడవలు జరుగుతాయి' అని అక్క పాత్ర మదన పడుతుంది. ఈ చిన్న స్పృహ కూడా లేకుండా మనం నిత్యం రకరకాల ఆచారాలు, వ్యవహారాల పేరుతో పిల్లల మధ్య చిన్నప్పటి నుంచే అనేక గీతలు గీయడానికి ప్రయత్నిస్తుంటాం. దాని వల్ల పసిహృదయాలు ఎంత ఇబ్బంది పడతాయో హృద్యంగా రచయిత ఈ కథలో వివరిస్తాడు.

ఇటు సంక్రాంతి వచ్చినా అటు రంజాన్ వచ్చినా ఈ కథ సహృదయులకు తప్పక గుర్తుకొస్తుంది. దీన్ని చదివిన వారు ఏ మతం వారైనా ఇతర మతాలను, వారి సంస్కృతులను గౌరవించకుండా ఉండలేరు. పైగా ఈ కథలో సమాజంలో ఆడపిల్లకు ఒక నీతి, మగపిల్లాడికి ఒక నీతి ఎందుకుందో కూడా చర్చకు వస్తుంది. లైంగిక సమానత్వం గురించిన ఆలోచన కలిగిస్తుంది.

ఇన్నాళ్లూ సాహిత్య పాఠకులకు మాత్రమే ప్రేరణ కలిగించిన ఈ కథలోని అక్క, ఇప్పుడు కాలేజి పిల్లల మెదళ్లకు పట్టిన దుమ్మును సైతం దులిపేందుకు సిద్ధమై వెళ్తుండటం ఆనందం కలిగించే విషయం. రచయితకు, పాఠ్యాంశ రూపకర్తలకు అలాగే విద్యార్థులకు శుభాభినందనలు.

- మొగుతాల రాజు, 73869 86182

రాతి శిల

ఇదనీ కాదు అదనీ కాదు
ఇటనీ లేదు ఆటనీ లేదు
అన్నీ తానే అయి నిలబడ్డ 'అంగట్లో'
మనిషి ఇవ్వాళ ఓ తరాజు
మంచో చెడో తూచేందుకు రాళ్ళు లేవు
అటో ఇటో తేల్చేందుకు బారోమీటర్ లేదు
మనిషి పడుతున్న యాతన
మనసు పడుతున్న రోదన
కొలిచేందుకు యంత్రాలు లేవు
చూపులు కరువై కళ్ళు ఎడారులై
మాటలు అరుదై
సంభాషణలు
ప్రవాహంలేని తీరాలైనాయి
ఇవ్వాళ మనిషి
పచ్చదనం ఇంకిపోయిన మొక్క
ఆకాశహర్మ్యాల నీడల్లో
జీవంలేని ఇసిరె
రూపం లేని రాతిశిల
శిలకు తడి అంటదు
చెమట పట్టదు

- వారాల ఆనంద్, 9440501281

సాహితీ వార్తలు

యోధ ఆవిష్కరణ

తెలంగాణ సాంస్కృతిక శాఖ, హస్మిత ప్రచురణలు విమెన్ రైటర్స్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో విజయ బండారు సంపాదకత్వంలో 'యోధ' ఆవిష్కరణ సభ ఈ నెల 22న మధ్యాహ్నం 2 గంటలకు రవీంద్రభారతిలో జరుగుతుంది. ఈ సభలో ఓల్గా, కె.శ్రీనివాస్, ప్రొ॥కొలకలూరి ఆశాజ్యోతి, సంధ్య, మామిడి హరికృష్ణ, గోపరాజు సుధ, అపర్ణ తోట, ఘంటశాల నిర్మల, రచన, గిరిజ పైడిమర్రి పాల్గొంటారు.

'నానీ కిరణాలు' ఆవిష్కరణ

కంచనపల్లి రవికాంత్ కవితా సంపుటి 'నానీ కిరణాలు' ఆవిష్కరణ 27న ఉదయం 10 గంటలకు రవీంద్ర భారతి మినీహాల్‌లో జరుగుతుంది. ఈ సభకు డా.ఎన్.గోపి, డా.ఎస్.రఘు, ఆచార్య సూర్య ధనంజయ్, జి.శ్యామ్‌ప్రసాద్ లాల్, తగుళ్ళ గోపాల్, తండ హరీష్ గౌడ్ హాజరవుతారు.

రొట్టమాకురేవు కవిత్వ అవార్డు సభ ఆహ్వానం

తెలంగాణ భాషాసాంస్కృతికశాఖ సౌజన్యంతో 2024 - రొట్టమాకురేవు కవిత్వ అవార్డు సభ ఈ నెల 27న సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగుతుంది. షేక్ మహమ్మద్ మియా స్మారక అవార్డును ఏనుగు నరసింహారెడ్డి, పురిటిపాటి రామిరెడ్డి స్మారక అవార్డును అరుణ నారదభట్ల, కె.ఎల్ నర్సింహారావు స్మారక అవార్డును తండా హరీష్ గౌడ్, సాంబమూర్తి లండ అందుకుంటారు. ఈ కార్యక్రమంలో కె.శివారెడ్డి, లక్ష్మీనరసయ్య, ప్రసేన్, పేర్ల రాము, శ్రీనిధి విప్లవశ్రీ పాల్గొంటారు. ఇదే సభలో సాంబమూర్తిలండ కవితాసంపుటి 'ఆమెకు మిగలని ఆమె' ఆవిష్కరణ ఉంటుంది.

కవితలకు ఆహ్వానం

సురవరం ప్రతాపరెడ్డి గారి మూర్తిమత్వం పై కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను అక్టోబర్ 30వ తేదీలోపు 9492765358 నెంబర్ వాట్సాప్‌కు గానీ, vanapatlasubbaiah1972@gmail.com కు గానీ పంపగలరు.

- వనపట్ల సుబ్బయ్య, 9492765358

కళింగాంధ్ర దళిత, మత్స్యకార కవితల కోసం

కళింగాంధ్ర ప్రాంతానికి చెందిన కవులు రాసి ఇప్పటికే అచ్చైన దళిత, మత్స్యకార కవితలతో విడివిడి సంకలనాలను 'చంపావతి ప్రచురణలు'గా సంపాదకత్వంలో తీసుకొస్తున్నాను. మీ వద్ద వున్న పై విభాగాలకు చెందిన కవితలను, వాటి వివరాలను champaavathi@gmail.com మెయిల్‌కు పంపించాల్సిందిగా కోరుతున్నాను.

- బాలసుధాకర్, 9676493680, 9505646046

పునరుత్థానం

సూర్యచంద్రులతోపాటు
నింగీ, నేలా, గాలి, నీరు, నిప్పు
అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకొన్నాయి
దుఃఖపడినంతసేపు దుఃఖపడి
ఒక్కసారిగా తలలు పైకెత్తి నినదించాయి
ఆగిపోయిన రెండుచక్రాల కుర్చీకి తామే కాళ్ళుగా మారి
అనేకానేక పాదాలుగా విస్తరించి
వయసుతోపాటు ఎదగని
అజ్ఞానపు మేధ మెదళ్ళలో
జ్ఞాన వృక్షాలను నాటాలని
ఏకగ్రీవ తీర్మానం చేసుకున్నాయి
బాధాతప్త దేహాలకు భరోసావాక్యాన్నిచ్చాయి
ఒంటరితనాన్ని జయించిన ఆ రెండు కళ్ళు,
చచ్చుబడిన రెండు కాళ్ళు
సగం దేహం-
నిబంధిత నిశ్శబ్దాన్ని ఛేదించుకొని
అగాధపు ఆకసాల్లోంచి
పునరుత్థానం పొందిన
జీవనదిలా ప్రవహిస్తున్నాయిప్పుడు.
(ప్రొఫెసర్ కె.యన్. సాయిబాబా స్మృతిలో)

- విల్సన్‌రావు కొమ్మవరపు, 8985435515

రైతు భరోసాకు ఎగనామం..!

- ప్రస్తుత సీజన్‌కు ఇవ్వలేమని తేల్చిచెప్పిన మంత్రి
- సబ్ కమిటీ నివేదిక పేరుతో మభ్యపెట్టే యత్నం
- ఇటు రుణమాఫీకాక..అటు రైతు భరోసా ఇవ్వక రైతులు సతమతం

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భగ్గుమన్న రైతులు....రహదారులపై ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం

నవతెలంగాణ-నేలకొండపల్లి

రైతు భరోసా ఎగవేయడాన్ని నిరసిస్తూ ఆదివారం స్థానిక పిఎస్ఆర్ సెంటర్లో బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం కోదాడ ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం కింద అందించే రైతు భరోసాను వానాకాలం సీజన్ చివరి దశకు చేరుకున్న ఇవ్వకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్ధతకు అద్దం పడుతుందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు రైతులకు రైతు భరోసా అందించలేమని మంత్రి తుమ్మల చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికే సుమారు 60 శాతం మంది రైతులకు రెండు లక్షల రైతు రుణమాఫీ అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతు రుణమాఫీ అందక, రైతు భరోసా చెల్లించకపోవడంతో వ్యవసాయ పెట్టుబడులకు చేతిలో డబ్బులు లేక రైతులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి అర్హులైన ప్రతి రైతుకు రెండు లక్షల రైతు రుణమాఫీ, రైతు భరోసా డబ్బులు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల రైతులందరిని సమీకరించి పెద్ద ఎత్తున



ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కార్యదర్శి ఎన్నబోయిన శ్రీను, మాజీ జెడ్పి వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, సొసైటీ చైర్మన్ నాగుబండి శ్రీనివాసరావు, కోటి సైదారెడ్డి పాల్గొన్నారు.

ముదిగొండ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా రైతుకు ఎకరానికి రూ.15 వేలు రైతు భరోసా పథకం కింద తక్షణమే ఇవ్వాలని కోరుతూ ఆదివారం ముదిగొండ ప్రధాన రహదారిపై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా రైతు భరోసా పథకంతోపాటు, రైతు రుణమాఫీని కూడా తక్షణమే అమలు చేయాలని నినాదాలు చేశారు. రైతు సమన్వయ సమితి మండలం మాజీ కన్వీనర్ పోట్ల వెంకటప్రసాద్ మాట్లాడుతూ రైతు భరోసాను సబ్ కమిటీ నివేదిక పేరుతో వాయిదా వేయడం సరైనది కాదన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వాచేపల్లి లక్ష్మారెడ్డి, మండల కార్యదర్శి గడ్డం వెంకట్ గౌడ్, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ పాల్గొన్నారు.





బోనకల్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వానాకాలం రైతుబంధు ఇవ్వకుండా రైతులను మోసం చేస్తుందని మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు విమర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వానాకాలం రైతు బంధు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు తన్నీరు పుల్లారావు, గండమాల చుక్కారావు, కంచర్ల బాబు, కోటపర్తి రామారావు, నల్లిబోయిన కృష్ణ, పారా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం : కాంగ్రెస్ ప్రభుత్వం వర్షాకాలం సీజన్‌లో రైతు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసాను రైతుల ఖాతాలో జమ చేయకుండా ఎగగొట్టే పన్నాగం పన్నుతుందని, రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేస్తుందని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల వ్యతిరేక చర్యలకు నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మీనవోలు గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యురాలు శీలం కవిత, వైస్ ఎంపీపీ సూరానేని రాము, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం కావాలంటే

పోరాటాలే మార్గం

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-కొణిజర్ల

ప్రజా సమస్యలు పరిషారం కావాలంటే పోరాటాలే మార్గమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులు మోత్కూరు వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నున్నా హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు అనేక వాగ్దానాలు ఇచ్చారని, వాటిని కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతులను, నిరుద్యోగులను ఆదుకోవడంలో విఫలమైందన్నారు. మతోన్మాదాన్ని పెంచిపోషించడంలో బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు పోటీపడుతున్నాయన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి వరదలకు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరగా రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయాలన్నారు. పార్టీ అన్ని గ్రామాల్లో స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కొరకు ఉద్యమాలు చేయాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటాలే మార్గమని, ఇది కమ్యూనిస్టుల వల్లే



సాధ్యమవుతుందన్నారు. భవిష్యత్తులో ప్రజల పక్షాన ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, పార్టీ జిల్లా నాయకులు తాళ్లపల్లి కృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు కొప్పుల కృష్ణయ్య పార్టీ మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, పార్టీ మండల కమిటీ సభ్యులు బోయినపల్లి శ్రీనివాసరావు, దొడ్డపునేని కృష్ణార్జునరావు, చింతపల్లి ప్రసాదు, పుల్లూరు వెంకటేశ్వర్లు, అన్నారపు వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి విజయ, జోనెబోయిన అంజయ్య, తేజావత్ సీతారాములు, హరిచందు పాల్గొన్నారు.

కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు

- నూతన రెవెన్యూ చట్టం రాష్ట్ర ప్రజలకు వరం
- ధరణితో 50లక్షల మంది రైతులు భూ బాధితులే
- తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్రరావు

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా తీసుకొస్తున్న 'నూతన రెవెన్యూ చట్టం భూమాత..తోనే రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా 70లక్షల మంది రైతులకు న్యాయం జరుగుతుందనీ, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలతోనే పూర్వ వీఆర్వోలకు సముచిత స్థానం దక్కుతుందని తెలంగాణ' గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్రరావు స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ పాలనలో రైతులు, వీఆర్వోలు అరిగోస పడ్డారని గరికె ఉపేంద్రరావు గుర్తు చేశారు. ప్రధానంగా 'గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా అశాస్త్రీయంగా తీసుకొచ్చిన మాయదారి ధరణి పోర్టల్‌తో రాష్ట్రంలోని 50లక్షల మంది రైతులు బాదితులుగా మారిపోయారనీ అన్నారు. నాటి సీఎం కేసీఆర్ అహంకార దోరణితో వీఆర్వోల వ్యవస్థను రద్దుచేయడమే కాకుండా రాష్ట్రంలోని 5,139 మంది ఏఆర్వోలకు ఉద్యోగ భద్రతలేక తీవ్ర మానసిక వేదనతో 178 మంది వీఆర్వోలు బలవన్మరణాలు, మానసిక రుగ్మతలతో చనిపోయారనీ అన్నారు. ఇవన్నీ గత



ప్రభుత్వం తీసుకున్న వీఆర్వోల వ్యవస్థ రద్దు ఫలితమేనని అన్నారు.

ఆదివారం ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో 'గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థ, వీఆర్వోల పాత్ర..' అంశంపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గరికె ఉపేంద్రరావు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పాలనలో తీసుకొచ్చిన ధరణి పోర్టల్ వల్ల పార్ట్ బీ తో 18లక్షల మంది రైతులు బాధితులుగా మారిపోయారనీ, కాస్తు కాలం తొలగించడంతో మరో 9లక్షల మంది రైతులు బాధితులుగా మారిపోయారనీ, మొత్తం మీద రాష్ట్రంలోని సుమారు 70లక్షల మంది రైతుల్లో ఏకంగా 50లక్షల మంది రైతులు బాధితులుగా మారిపోయారని అన్నారు. కార్యక్రమంలో, సున్నం రామరావు, ప్రసాద్, వి.రామారావు. జిల్లా నాయకులు స్వామి దాస్, నాగేంద్రబాబు, ఎస్‌కె సుభాని, లక్ష్మీ నర్సు, కృష్ణ, యల్లమంద, వరలక్ష్మి, విజయలక్ష్మి, వెంకటరమణ, మేడికొండ బాలయ్య పాల్గొన్నారు

వైరా బోడేపూడి కళానిలయం వైద్య శిబిరం విజయవంతం

10 సంవత్సరాలుగా వైద్య శిబిరం నిర్వహణ

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా బోడేపూడి కళానిలయం ఆధ్వర్యంలో ప్రతి నెల మూడవ ఆదివారం స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయం బోడేపుడి వెంకటేశ్వరరావు భవనం నందు నిర్వహించే వైద్య శిబిరాన్ని 112వ నెల విజయవంతంగా నిర్వహించారు. బోడేపుడి కళానిలయం వైద్య శిబిరం ద్వారా గత 10 సంవత్సరాల నుండి షుగర్, బిపి, కొలెస్ట్రాల్, గ్యాస్, అల్సర్ తదితర వ్యాధులకు నెల రోజులకు సరిపడా మందులను 100 రూపాయలకు అందిస్తున్నారు. కొన్ని వేల మంది పేద ప్రజలు వైద్య సేవలను పొందుతున్నారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ జట్ల రంగారావు, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు బృందం ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. 10 సంవత్సరాల క్రితం ప్రారంభమైన బోడేపూడి వైద్య శిబిరానికి డాక్టర్ల బృందం క్రమం తప్పకుండా హాజరు కావడం, వాలంటీర్లు ప్రతి నెల నిబద్ధతతో పనిచేయడం వలన విజయవంతంగా ముందుకు సాగుతోందని సంస్థ కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి మాట్లాడుతూ ప్రతి రోజూ వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించ వచ్చునని



అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి సూచించారు. షుగర్, బిపి మందులు దీర్ఘకాలంగా వాడే వారు గుండె, కిడ్నీ, న్యూరో సంబంధించిన పరీక్షలు తరచూ చేయించుకోవాలని, వర్షాకాలంలో గుండె, శ్వాసకోశ అనారోగ్య లక్షణాలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి సూచించారు. కార్యక్రమంలో వైద్య శిబిరం వాలంటీర్లు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, బొంతు సమత, గుడిమెట్ల రజిత, గుడిమెట్ల మోహనరావు, అనుమోలు రామారావు, మాదినేని రజిని, మల్లెంపాటి ప్రసాదరావు, కంభంపాటి సత్యనారాయణ, పాసంగులపాటి చలపతిరావు, సామినేని నరసింహారావు, ఐలూరి శ్రీనివాసరెడ్డి, పూనాటి సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ఎస్‌జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య

నవతెలంగాణ- ఖమ్మం

చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు సత్వరం పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనుదారుల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రోటరీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన



మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పట్ల ప్రభుత్వ మొండి వైఖరి విడనాడి సమస్యలు సత్వరం పరిష్కరించాలని కోరారు. పెండింగ్ ఉన్న ఐదు విడతల కరువుభత్యం నగదుపూర్వకంగా చెల్లించాలని, పిఆర్‌సి సత్వరం అమలు పరచాలని, కార్పోరేటు ఆసుపత్రులలో నగదు రహిత వైద్యం అమలు చేయాలని, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలు సత్వరం చెల్లించాలని సమావేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, ఆర్థిక కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు శరత్ బాబు, కృష్ణకుమారి, పెదమళ్ళ సత్యం, అబ్దుల్ జబ్బార్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మడుపల్లి నాగేశ్వరరావు తన వ్యవసాయ భూమిలో కూలీలతో పత్తి తీయిస్తుండగా సమీప ప్రాంతంలో ఆదివారం పిడుగు పడింది. పిడుగు పాటుకు సమీపంలో మడుపల్లి నాగేశ్వరరావు ఉండటంతో ఆ పిడుగుపాటు ప్రభావానికి నాగేశ్వరరావు అక్కడకక్కడే కుప్పకూలి స్పృహ కోల్పోయాడు. వెంటనే వ్యవసాయ కూలీలు గ్రామస్తులకి సమాచారం అందించారు. గ్రామంలో ప్రథమ చికిత్స అందించి ఆటోలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



3న సకల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

జెఏసి ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు

నవతెలంగాణ- ఖమ్మం

నవంబర్ నెల 3వ తేదీన ఖమ్మంలో జరపతలపెట్టిన సకల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం ఖమ్మంలోని టిఎన్‌జిఓస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ సకల ఉద్యోగుల సమ్మేళనం ప్రాధాన్యత వివరించారు. ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక సకల ఉద్యోగుల సమ్మేళనంలో ప్రస్తుతం జరుగుతున్న కుల, మత వనభోజనాలకు అతీతంగా కుల, మత, ఉన్నత, కింద స్థాయి ఉద్యోగులనే తారతమ్యం లేకుండా ఐక్యంగా కలిసి మెలిసి జరుపుకుంటారని తెలిపారు. వనభోజనాల కార్యక్రమంతో పాటుగా రాష్ట్ర స్థాయిలో పేరున్న కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ విభాగాల్లో పలురకాల క్రీడా పోటీలు మహిళలు, పురుషులకు విడివిడిగా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి జిల్లాల నుండి జెఏసి నాయకులు పాల్గొంటారని చెప్పారు. వివిధ జిల్లాలో పనిచేస్తున్నప్పటికీ పరిసర జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ నివాసాలని ఖమ్మంలో ఏర్పాటు చేసుకున్నందున కార్యక్రమానికి సుమారు 10 నుండి 15 వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నట్టు వివరించారు. అలాగే జెఏసిలో భాగస్వామ్యం కలిగిన రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో ఉన్న ఉద్యోగ సంఘాల నాయకులు, భాద్యులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారని, ఆఫీస్ సబార్డినేట్ నుండి గెజిటెడ్ ఉద్యోగాల్లో ఉన్న వారు వారి, వారి కుటుంబాలతో అధిక సంఖ్యలో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని విభాగాలకు ఇంచార్జీలు నియమించినట్టు చెప్పారు. కార్యక్రమంలో జెఏసి నాయకులు కొణిదెన శ్రీనివాస్, జమ్మి ఎస్ జయపాల్, గుంటుపల్లి శ్రీనివాస్, కాస్తాల సత్యనారాయణ, ఎం.వేలాద్రి, మల్లెల రవీంద్ర, రాజేష్, కొమరగిరి దుర్గాప్రసాద్, చందాకాని రమణ యాదవ్, శ్రీధర్ సింగ్, బుసా చంద్రశేఖర్, గంగవరపు బాలకృష్ణ, వల్లపు వెంకన్న, ఎర్రా రమేష్, పి.నాగేశ్వరరావు, డాక్టర్ రత్నాకర్, దేవరకొండ సైదులు పాల్గొన్నారు.


కట్టుకున్న వాడే కడతేర్చాడు

ఐదు రోజుల్లోనే కేసును ఛేదించిన పోలీసులు

నవతెలంగాణ-కల్లూరు

కట్టుకున్న వాడే కాలయముడయ్యాడు. ప్రియురాలితో కలిసి పథకం ప్రకారం అడ్డుగా నిలిచిన భార్యను హతమార్చి గుట్టు చప్పుడు కాకుండా చెరువులో పడేశాడో ఓ ఘనుడు. ఇటీవల కల్లూరు మండలంలో గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న మహిళ శవం చెరువులో లభ్యమైంది. ఈ కేసును పోలీసులు కేవలం ఐదు రోజుల్లోనే ఛేదించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసిపి అనిశెట్టి రఘు, వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన భూక్య ప్రసాద్‌కి 20 సంవత్సరాల క్రితం తల్లాడ మండలం పాయపూరు గ్రామానికి చెందిన కళ్యాణితో వివాహం అయింది. 10 సంవత్సరాల క్రితం నుండి భార్యను వదిలేసి ఒంటరిగానే జీవిస్తున్నాడు. వృత్తి రీత్యా కరెంట్ పని చేస్తుంటాడు. కరెంటు పని కోసం నాలుగు సంవత్సరాల క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వెళ్లాడు. అక్కడ చంద్రుగొండ మండలం మద్దుకూరు గ్రామానికి చెందిన నారాయణపేట నరసమ్మతో ప్రసాద్‌కు పరిచయమైంది. ఆమెను ఇంటికి తీసుకొచ్చి పెళ్లి చేసుకున్నాడు. సంవత్సర క్రితం కరెంటు పని కోసం నెల్లూరు వెళ్లి చల్లాయపాలెం గ్రామానికి చెందిన మల్లేశ్వరిని వివాహం చేసుకొని అక్కడే ఉంటున్నాడు. నరసమ్మను లక్ష్మీపురంలో ఉంచి అప్పుడప్పుడు వచ్చి వెళ్ళేవాడు. ఇటీవల కాలంలో రాకుండా ఉండటంతో పనిచేసే చోట మరో అమ్మాయితో ఉంటున్నాడు అని తెలిసి నరసమ్మ భర్తతో గొడవ పడింది. ఈ విషయాన్ని ఆ గ్రామంలోని పెద్దలతో చెప్పింది. స్థానిక పోలీస్ స్టేషన్లో కూడా ప్రసాద్ పైన ఫిర్యాదు చేసింది.

ఈ విషయాలు తెలుసుకున్న ప్రసాద్, మల్లేశ్వరులు, తమకు అడ్డం వస్తుందనే ఉద్దేశంతో నరసమ్మ అడ్డు తొలగించుకోవాలని భావించి పథకం ప్రకారం హత్య చేయటానికి అనువైన స్థలాన్ని ఎంచుకున్నారు. కల్లూరు నుండి లక్ష్మీపురం వెళ్లే దారిలో బిటీ రోడ్డు పక్కన మామిడి తోట పుల్లప్పకుంట చెరువు ఉన్నది. ఈ స్థలం అయితే ఎవరికి తెలీదని భావించి పథకం ప్రకారం మల్లేశ్వరి



ముందే మామిడి తోటలో ఉండి గత నెల 29వ తేదీన సాయంత్రం 6:30 గంటల సమయంలో ప్రసాద్ నరసమ్మను మాట్లాడుకుందాం రా ఇక నుండి మంచిగా ఉందామని చెప్పి మామిడి తోట దగ్గరకు తీసుకొచ్చాడు. మామిడి తోటలోకి వెళ్ళిన తర్వాత నరసమ్మను కణితలపై కొట్టడంతో నరసమ్మ స్పృహ లేకుండా పడిపోయింది. మల్లేశ్వరి చీర తీసుకొచ్చి గొంతుకి ఉరి పోసి ఇద్దరు కలిసి చెట్టు పైకి లాగి హత్య చేశారని వివరించారు. ఆ తర్వాత శవాన్ని పక్కనే ఉన్న పుల్లప్ప కుంట చెరువులో పడేశారు. నాలుగు రోజుల తర్వాత వెళ్లి సగం పైకి తేలుతుందేమోనని బస్తా కప్పి వెళ్లిపోయారు. ఈనెల 15వ తేదీన చేపలకు మేత వేస్తుండగా శవం కనిపించడంతో మత్స్యకారుడు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు శవాన్ని బయటికి తీసి పంచనామా చేసి శవ పరీక్ష అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్సై ఎస్కే షాకీర్ దర్యాప్తు చేపట్టారు. ఈమధ్యలో మిస్సింగ్ మహిళా కేసు కోణంలో దర్యాప్తు చేస్తుండగా లక్ష్మీపురం గ్రామానికి చెందిన భూక్య ప్రసాద్ భార్య నరసమ్మ 15 రోజుల నుండి కనబడటం లేదని గ్రామస్తుల ద్వారా తెలిసింది. దీంతో పోలీసులు ప్రసాద్ ఇంటికి వెళ్లి విచారించగా ప్రసాద్ ఇంట్లో లేకపోవడంతో పోలీస్ స్టేషన్కు రావాల్సిందిగా సమాచారం ఇచ్చినా రాకపోవడంతో పలుమార్లు పోలీసులు ప్రసాద్ ఇంటికి రావడంతో భయపడి పోయి భూక్య ప్రసాదు, మల్లేశ్వరి పోలీస్ స్టేషన్కు వచ్చి లొంగిపోయి తామే నేరం చేశామని ఒప్పుకున్నారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో సిఐ ముత్తి లింగయ్య, ఎస్ఐ ఎస్‌కే షాకీర్, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడితే విజయం తథ్యం

- పనిపట్ల అంకితభావం ఉండాలి
- అందుకు నిదర్శనమే యాకూబ్
- అభినందన, వీడ్కోలు సభలో నవతెలంగాణ మాజీ మేనేజర్ ఎం.సుబ్బారావు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఎన్ని అవాంతరాలు ఎదురైనా నీతి, నిజాయితీతో కష్టపడితే విజయం తథ్యమని, పని పట్ల అంకితభావం ఉండాలని, అప్పుడే జీవితంలో సక్సెస్ సాధిస్తామని, అందుకు షేక్ యాకూబ్‌నే నిదర్శనమని, యాకూబ్‌ను ఆదర్శంగా తీసుకొని మిగతా వారు కూడా మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని నవతెలంగాణ ఖమ్మం ఎడిషన్ మాజీ మేనేజర్, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు ఎం.సుబ్బారావు ఆకాంక్షించారు. బోనకల్ మండలం రావినూతల గ్రామానికి చెందిన షేక్ యాకూబ్ 18 సంవత్సరాలుగా నవతెలంగాణ దినపత్రిక ఖమ్మం ఎడిషన్ కార్యాలయంలో మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో యాకూబ్ స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించారు. ఈ నేపథ్యంలో ఆదివారం మండల పరిధిలోని నల్లపునేని కాశయ్యనగర్‌లో గల నవతెలంగాణ ఎడిషన్ కార్యాలయంలో అభినందన, వీడ్కోలు సభను మిషన్ సెక్షన్ ఇన్‌చార్జి భూక్యా కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ఎం.సుబ్బారావు హాజరై ప్రసంగించారు. ఆర్థిక పరిస్థితులు సరిగా లేక యాకూబ్ పదో తరగతి అనంతరం చదువు మానేసి ఒకపక్క నవతెలంగాణ దినపత్రికలో మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తూనే మరోవైపు దూరవిద్య ద్వారా డిగ్రీ పూర్తి చేసి అనంతరం బీఈడీ పూర్తి చేసి చదువు పట్ల తన మక్కువను చూపించాడన్నారు. ఎన్ని అవంతరాలు ఎదురైనా ఎక్కడా నిరాశ, నిస్పృహాలకు లోను కాకుండా మొక్కవోని దీక్షతో డీఎస్సీ పరీక్షలో ప్రతిభ చూపి స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించడం నిజంగా అభినందనీయమన్నారు. సంస్థలో తన పని పట్ల కూడా అంకితభావంతో ఉండేవాడని, అందుకే జీవితంలోనూ విజయం సాధించాడన్నారు. నవతెలంగాణ రీజినల్ మేనేజర్ సయ్యద్ జావిద్ మాట్లాడుతూ సంస్థలో యాకూబ్ క్రమశిక్షణతో ఉండేవాడని, మిగతా సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పనిచేసేవాడన్నారు. ఒకవైపు



ఆర్థికసమస్యలు..మరోవైపు పనిభారం ఉన్నా ఎక్కడా తన లక్ష్యాన్ని విస్మరించలేదని అన్నారు. విజయం సాధించేవారకూ కష్టపడుతూనే ఉన్నాడని, ఎట్టకేలకు ఉద్యోగం సాధించి తన కలను నెరవేర్చుకున్నాడని, ఇది స్ఫూరిదాయకమైన విజయమన్నారు. ఖమ్మంరూరల్ డివిజన్ ఎడివిటి ఇన్‌ఛార్జి గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ సంస్థలో ఏవిధంగా అయితే క్రమశిక్షణతో పనిచేశాడో అలాగే ఉపాధ్యాయ వృత్తిలోనూ పనిచేసి సమాజంలో తనకంటూ మరింత గుర్తింపు తెచ్చుకోవాలని, మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. అనంతరం యాకూబ్ మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యాడు. తాను పడ్డ కష్టానికి గుర్తింపు లభించిందని, తన విజయానికి అండదండగా ఉన్న నవతెలంగాణ సిబ్బందికి, తనను అనునిత్యం ప్రోత్సహించిన తన కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపాడు. అనంతరం యాకూబ్, షబీనా దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో నవతెలంగాణ మిషన్ సెక్షన్ సిబ్బంది కె.రమేష్, ఎం.వీరభద్రం, ఎ.వరకుమార్, పి.గురవయ్య, పి.ఉపేందర్, ఎస్.ప్రవీణ్, బి.కృష్ణ, పి.రమణ, ఎస్.బీరయ్య, డెస్కు సభ్యులు బి.వీరేష్, వి.అంజయ్య బి.వెంకటేష్, బి.ఉపేందర్, ఎస్.కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.



నేటి నుండి బి.ఫార్మసి, ఫార్మా డి ప్రవేశాల కౌన్సిలింగ్

నవతెలంగాణ-ఖమ్మం

టీజి ఎప్‌సెట్ 2024 ద్వారా బి.ఫార్మసి, ఫార్మా డి కోర్సులలో ప్రవేశాలు పొందగోరే విద్యార్థులకు సోమవారం నుండి 23 వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ కళాశాల ప్రాంగణంలో గల ఆడిటోరియంలో జరగనున్నదని ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్లతో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

విద్యుద్ఘాతంతో వ్యక్తి మృతి

నవతెలంగాణ - కూసుమంచి

విద్యుద్ఘాతంతో కౌలు రైతు మృతి చెందిన సంఘటన నాయకన్‌గూడెంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని భగద్వీడు గ్రామానికి చెందిన కిన్నెర శ్రీను(40) నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన ఓ రైతు పొలం కౌలు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం పొలం దగ్గరకెళ్ళి పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై బావిలో పడి మృతిచెందాడు.

నేషనల్ గోర్ మలావ్ పోస్టరావిష్కరణ

నవతెలంగాణ-రఘునాథపాలెం

నవంబర్‌లో 24, 25 తేదీన జరిగే నేషనల్ గోర్ మలావ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం సాయి మారుతి హాస్పిటల్ డాక్టర్ అజ్మీర మోహన్ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా గుడి తండాలో జరిగే నేషనల్ గోర్ మలవ్ కార్యక్రమానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉండే ప్రతిఒక్క గోర్ బంజారా బిడ్డ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గోర్ బంజారా నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
సోమవారం | అక్టోబర్ 21, 2024 | www.navatelangana.com



చెంగల ముత్తయ్యకు నివాళి

నవతెలంగాణ-వైరాటౌన్

మండలంలోని లింగన్నపాలెం గ్రామం సిపిఐ(ఎం) కార్యకర్త చెంగల ముత్తయ్య అనారోగ్యంతో మరణించారు. ఆదివారం ఆయన దశ దిన కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, కళ్యాణం వెంకటేశ్వరావు పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భార్య నాగమణి, కుమారులు రాజశేఖర్, వెంకటేష్‌లను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పార్టీ రూరల్ మండల కార్యదర్శి తోట నాగేశ్వరావు, కార్యదర్శివర్గ సభ్యులు బాణాల శ్రీనివాసరావు, బాజోజు రమణ, మాగంటి తిరుమలరావు, గ్రామ కార్యదర్శి బాణాల కృష్ణమాచారి, వైరా బోడెపుడి శాఖ కార్యదర్శి యనమద్ది రామకృష్ణ, బాణాల నాగబ్రాహ్మాచారి, షేక్ జానిమియ, చెంగల లక్ష్మయ్య, తిరుపతమ్మ, ఉద్దాండు సాహెబ్, తోటకూర బాబురావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంఘం నేతల నివాళి

ఇటీవల మరణించిన లింగన్నపాలెం గ్రామం సిపిఐ(ఎం) కార్యకర్త చెంగల ముత్తయ్య దశ దిన కార్యక్రమానికి తెలంగాణ గిరిజన సంఘం నేతలు హజరై నివాళులు అర్పించారు. నివాళులర్పించిన వారిలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాం నాయక్, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా నాయకులు గన్యా నాయక్, లకావత్ శ్రీనివాస్ నాయక్, బానోత్ హరిచంద్‌నాయక్, గుగులోత్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



రాయల కమలమ్మకు నివాళి

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో వెంకటాపురం గ్రామానికి చెందిన సిపిఐ(ఎం) సీనియర్ నేత రాయల వెంకటేశ్వర్లు సతీమణి రాయల కమలమ్మ 4వ వర్ధంతి ఆర్కే ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గిడ్డింగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు మాతృమూర్తి కమలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాయల కమలమ్మకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరు కుమారులలో పెద్ద కుమారుడు రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ పాలేరు నియోజకవర్గ ఇన్చార్జి, టీపీసీసీ సభ్యులుగా కొనసాగుతూ ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కార్పొరేషన్ పదవుల్లో రాయల నాగేశ్వరరావుకు గిడ్డింగుల సంస్థ రాష్ట్ర చైర్మెన్ పదవి వరించిన విషయము విధితమే. చిన్న కుమారుడు రాయల శ్రీనివాసరావు (సొసైటీ డైరెక్టర్) సిపిఐ(ఎం)లో రాణిస్తూ ఇటీవల పార్టీ గ్రామశాఖ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తండ్రి రాయల వెంకటేశ్వర్లు సిపిఐ(ఎం) పార్టీలో కీలకంగా పని చేసి గుర్తింపు పొందారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల నాయకులు కందుల భాస్కరరావు, కోలేటి ఉపేందర్, కోలేటి అరుణ, గ్రామ నాయకులు కటారి హుస్సేన్, నెమిలి సైదులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు, నాయకులు ఇలవల పుల్లారెడ్డి, వల్లూరి భద్రారెడ్డి, కమలమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సిలివేరు పున్నమ్మకు నివాళి

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని గంగాదేవిపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘు నాయనమ్మ సిలివేరు పున్నమ్మ దశదిన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాపా సుధాకర్, కిసాన్ సెల్ అధ్యక్షులు ఎర్రి కృష్టారావు, దుగ్గిదేవర కృష్ణయ్య సీతారామయ్య, సత్యం, లక్ష్మీ కోటయ్య, షేక్ జమాల్, తదితరులు పాల్గొని నివాళులర్పించారు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకు ఎంజేపీ విద్యార్థులు

నవతెలంగాణ-కొణిజర్ల

ఈనెల 27 న రంగారెడ్డి జిల్లాలో జరిగే 45 వ రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలలో పాల్గొనేందుకు మండల పరిధిలోని తనికెళ్ళలో గల మహత్మ గాంధీ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొంటున్నారు. పాఠశాలలో చదువుతున్న నిహాన్ మణికంఠ అనే విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఖోఖో ఆడేందుకు అర్హత సాధించారు. ఈ ఇద్దరు విద్యార్థులను ఆర్సీవో భ్యాలారాణి కన్వీనర్ జ్యోతిర్మయి, ప్రిన్సిపల్ జాహిదా, పిఈటి రవి, ఎటిపి పద్మజ, డిప్యూటీ వార్డెన్ నరసింహారాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

యూటీఎఫ్ మండల

అధ్యక్ష, కార్యదర్శులకు అభినందనలు

నవతెలంగాణ-తల్లాడ

టీఎస్ యూటీఎఫ్ తల్లాడ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన షేక్ లాల్ సయ్యద్, టి.శ్రీనివాసరావుకు డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సత్తెనపల్లి నరేష్ ఆదివారం ఓ ప్రకటనలో అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, యుటిఎఫ్ బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు

నవతెలంగాణ-మధిర

రైతు భరోసాపై ప్రభుత్వం చేస్తున్న విధానాలకు నిరసనగా పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్చార్జ్ లింగాల కమల్ రాజు ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు చిత్తారు నాగేశ్వరావు, ఉపాధ్యక్షులు కటికల సత్యనారాయణరెడ్డి, మధిర మున్సిపల్ ఫ్లోర్ లీడర్ యన్నంశెట్టి అప్పారావు, పార్టీ మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, మధిర టౌన్ కార్యదర్శి అరిగే శ్రీనివాసరావు, మాజీ శివాలయం కమిటీ చైర్మెన్ వంకాయలపాటి నాగేశ్వరరావు, మర్లపాడు మాజీ సర్పంచ్ వేమిరెడ్డి నాగిరెడ్డి, బొగ్గుల వీరారెడ్డి, కపిల వారి జగన్మోహన్‌రావు, బోనగిరి నారాయణరావు, జేవి.రెడ్డి, ఆళ్ల నాగబాబు, పరిశా శ్రీనివాసరావు, శివ, పల్లిపాట కోటేశ్వరరావు, చీదిరాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్పాయిగూడెం-రావోజీతండాకి బీటీ రోడ్ మంజూరు

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం అప్పాయిగూడెం నుండి వయా సూర్యతండా మీదిగా రావోజీతండా వరకుగల లింక్ రోడ్‌ను బీటీ మార్చుటకు నిధులు మంజూరైనాయి. ఈ రహదారిని ఎక్కువ మంది వినియోగిస్తూ వర్షాకాలంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తమ ఇబ్బందులను గ్రామస్తులు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ దృష్టికి తీసుకవెళ్లటంతో స్పందించిన ఎమ్మెల్యే సీఆర్ఆర్ నిధులు రూ. 2 కోట్లు మంజూరు చేశారు. ఈపనులను పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి(రోడ్స్) శాఖ చేపట్టనుంది. రోడ్డు మంజూరు చేయించిన ఎమ్మెల్యేను గ్రామస్తులు చందావత్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో శాలవతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగోక్ రవి, జర్పుల ప్రసాద్, బాదావత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు దిశ సమావేశం నిర్వహణ

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో దిశ కమిటీ చైర్మెన్, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించు దిశ సమావేశానికి గౌరవ సభ్యులు, ఆహ్వానితులు, జిల్లా అధికారులు అందరూ హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ సమావేశానికి జెడ్పీ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, జెడ్పీ సిఈఓ, డిఆర్‌డిఓ, ఎల్‌డిఎం, పోస్టల్ అధికారులు, జిల్లాలో నిర్దేశిత కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్న అధికారులు, జిల్లా నోడల్ అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని పేర్కొన్నారు.

నూతన కాలనీలు, విలీన గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత

- ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలు, విలీనమైన గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తూ చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం 16వ డివిజన్ శ్రీరామ్ నగర్ రోడ్డు నంబర్ 13లో టియుఎఫ్ఐడిసి నిధులు ఒక కోటి 95 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలు, విలీన ప్రాంత గ్రామాలలో మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యత కల్పించి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నామని అన్నారు. ఖాళీ స్థలాల్లో నీరు నిలవడం కారణంగా కాలనీవాసులు దోమలు, చెత్తతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ



ఉండకుండా యజమానులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని, సంబంధిత భూ యజమానులు స్పందించని పక్షంలో నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. మనల్ని నమ్ముకున్న ప్రజలకు న్యాయం చేసే దిశగా అధికారులు, ప్రజా ప్రతినిధులు పని చేయాల్సి ఉంటుందని, వరదల కారణంగా ముంపు గురైన ఇండ్లకు ఇప్పటి వరకు కొంత మందికి పరిహారం అందలేదని దరఖాస్తులు వచ్చాయని, నిజంగా పేదలు ఉండి ముంపుకు గురై ఉంటే సర్వే నిర్వహించి పరిహార సహాయం అందజేస్తామని అన్నారు.

గత ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో ఎగ్గొట్టిన రైతు బంధు సొమ్మును తాము మొన్న చెల్లించామని, అధికారంలో ఉన్నప్పుడు రైతుల సంక్షేమాన్ని విస్మరించి నేడు మొసలి కన్నీరు కారుస్తూ వాళ్ళు ధర్నా చేయడం హాస్యాస్పదమని అన్నారు. ప్రభుత్వ వ్యవస్థలను భ్రష్టు పట్టించారని, రుణ మాఫీ ఎక్కడా గతంలో చేయలేదని, ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ రైతులకు రుణమాఫీ చేస్తున్నామని అన్నారు.

దీపావళి నుంచి నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది రైతులకు దాదాపు 50 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని అన్నారు. గతంలో ప్రభుత్వాలు రైతులను పట్టించుకోలేదని, రైతు సంక్షేమం కోసం ఒక రూపాయి ఎక్కడా ఖర్చు చేయలేదని అన్నారు.

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, పేదలు సంతోషంగా ఇందిరమ్మ ఇండ్లలో ఉండేలా చూస్తామని, కాలనీలలో నూతనంగా చేపట్టే సిసి రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు పక్కాగా నిర్మించాలని, మనం కోట్ల రూపాయల ఖర్చు పెట్టి చేసే పనులు ప్రజలకు శాశ్వతంగా, సౌకర్యవంతంగా ఉండాలని మంత్రి అన్నారు. మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ ఆదివారం శంకుస్థాపన చేసిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను రెండు కోట్ల నిధులతో చేపడుతున్నామని, దీనికి వర్క్ ఆర్డర్ అందించామని, రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని అన్నారు. 16వ డివిజన్‌లో దాదాపు 1500 కుటుంబాలకు వరద పరిహారం అందించామని, పెండింగ్‌లో ఉన్న మిగిలిన కుటుంబాలకు వారం రోజులలో అందిస్తామని, జాబితాలో పేర్లు లేని కుటుంబాల కోసం సర్వే నిర్వహిస్తున్నామని, వరదల కారణంగా నష్టపోయిన ప్రతి కుటుంబానికి సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, ఆర్డీఓ జి.గణేష్, 16వ డివిజన్ కార్పొరేటర్ మేడారపు వేంకటేశ్వర్లు, నగర పాలక సంస్థ కార్పొరేటర్‌లు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి... అధ్వానం...

- కొణిజర్ల పల్లిపాడు రహదారిపై గుంతలు
- పలు ప్రమాదాలు..పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-కొణిజర్ల



ఫైల్ ఫోటో



అదోక రాష్ట్రీయ రహదారి.. నిత్యం వందల సంఖ్యలో బస్సులు, లారీలు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు తిరుగుతూ ఉంటాయి. అలాంటి ప్రధాన రహదారికి మోకాళ్లోతూ గుంతలు పడి యాక్సిండెట్లు లకు నిలయంగా మారి ప్రాణాలు కోల్పోతూ వికలాంగులుగా మారుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించు కోవడంలేదని ఆరో పణలు విని పిస్తున్నాయి. కొణిజర్ల నుండి పల్లిపాడుకి మధ్య దూరం కేవలం రెండు కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఈ రెండు కిలోమీటర్లలలో నే సుమారు పెద్ద పెద్ద గుంతలు పది నుంచి పదిహేను ఉన్నాయి. ఒకొక్క గుంత మోకాళ్లోతూ ఉంటుంది. ఈ గుంతలు రాత్రి సమయంలో ప్రయాణించే వాహనదారులకు గుంతలు



ఫైల్ ఫోటో

కనిపించకపోవడంతో నెలకు సుమారు పది నుంచి పదిహేను యాక్సిండెట్లు జరిగినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదాలలో కొంతమంది వాహన దారులు చనిపోగా మరికొంత మంది వికలాంగులుగా మారిన పరిస్థితి నెలకొంది. ఇలా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగు తున్న అధి కారులు ప్రజా ప్రతినిధులు నిమ్మ కునిరెత్తినట్లు వ్యవ హరిస్తున్నరని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి గుండా నిత్యం రాష్ట్ర జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు తరచూ తమ సొంత గ్రామాలకు వెళుతూ ప్రభుత్వ, ప్రవేట్ కార్యక్రమాలకు హజరౌతుంటారు. రహదారి పరిస్థితి తెలిసి కూడా మంత్రులు కనీసం తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు మంత్రులు ఎందుకు చొరచూపడం లేదని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. కనీసం గుంతల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమైయ్యారని, ఇప్పటికైనా రహదారికి మరమ్మతులు జరిగేవరకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి వాహనదారుల ప్రాణాలు కాపాడాలని జిల్లా ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు.

గుంతలకి మరమ్మతులు చేయాలి

తాతా సుధాకర్ (టీడీపీ మండలాధ్యాక్షుడు)

కొణిజర్ల నుంచి పల్లిపాడు వెళ్లే దారిలో ఏర్పడిన గుంతలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. నెలకు పదుల సంఖ్యలో యాక్సిండెట్లు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోతూ వికలాంగులుగా మారుతున్నారు వాహనదారులు.

వేతనాలు తక్కువ..బాధ్యతలు ఎక్కువ

- ఆశ వర్కర్లతో వెట్టి చాకిరి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లూరు చంద్రశేఖర్

నవతెలంగాణ-వేంసూరు

ఆశా వర్కర్లకు చాలీచాలని వేతనాలు బాధ్యతలు మాత్రం ఎక్కువగా ఉన్నాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు మల్లూరు చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎర్ర రామయ్య భవనంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల ఐదవ మండల మహాసభ జరిగింది. అరుణ అధ్యక్షతన జరిగిన మహాసభల్లో మల్లూరి మాట్లాడుతూ ఆశాల చేత ప్రభుత్వం సమయపాలన లేకుండా తక్కువ వేతనాలతో వెట్టి చాకిరి చేస్తుందని ఉద్యోగ భద్రత లేదని రానున్న రోజులలో ఆశా వర్కర్ల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని అన్నారు.



మహాసభలు ముందుగా సిఐటియు పతాకాన్ని మండల కార్యదర్శి కుట్టి అరుణ ఆవిష్కరించారు అనంతరం పలు సమస్యలపై తీర్మానాలు చేశారు. ఈ మహాసభల్లో 9 సబ్ సెంటర్లో పరిధిలో ఆశాలు స్వాతి, రాజేశ్వరి, హిమాంజలి, మేరీ వెంకటమ్మ సువార్త, పద్మ యశోద, మంగమ్మ, రాణి, లక్ష్మిలు పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



- జిల్లా నాయకురాలు గుడిమెట్ల రజిత

నవతెలంగాణ-వైరాటౌన్

కొత్తగూడెంలో జరిగే అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా నాయకురాలు గుడిమెట్ల రజిత కోరారు. ఆదివారం ఐద్వా వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వైరా మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య నగర్, హనుమాన్ బజార్, బ్రాహ్మణపల్లి, సోమవారం గ్రామంలో వాల్ పోస్టర్స్ వేస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నాయకురాలు గుడిమెట్ల రజిత మాట్లాడుతూ సనాతన ధర్మం పేరుతో మహిళలను వంటింటికి పరిమితం చేయాలనే బిజేపి కుట్రలకు వ్యతిరేకంగా ఐద్వా నిరంతరం పోరాడుతుందని అన్నారు. మహిళల హక్కుల పరిరక్షణ కోసం, మహిళలపై జరుగుతున్న దాడులు, హింసకు వ్యతిరేకంగా ఐద్వా చేస్తున్న పోరాటాలకు మహిళాలోకం మద్దతు పలకాలని, అక్టోబర్ 21, 22, 23 తేదీల్లో కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని, నేడు జరిగే బహిరంగ సభకు మహిళలు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ కమిటీ సభ్యులు బత్తుల ప్రమీల, చావా కళావతి, బందేల అమృతమ్మ తాటి క్రిష్ణకుమారి, నాయకులు గుడిమెట్ల వెంకటరమణ, బండారి కరుణ, కుదురుపాక నాగమణి, యలదండి సుక్కుబాయి, గుండ్ల కళ్యాణి, గౌలికర్ సుస్మిత, జోత్న, పోన్నం యశోద, రాణి, సారా, శైలజ, యలదండి జగన్మోహిని తదితరులు పాల్గొన్నారు.



ఆర్కే ఫౌండేషన్ అనాథాశ్రమంలో బిక్కి రాజా వర్ధంతి

నవతెలంగాణ-మధిర

మధిర ఆర్కే ఫౌండేషన్ అనాథాశ్రమంలో బిక్కి రాజా వర్ధంతి సందర్భంగా మానసిక వికలాంగులకు వృద్ధులకు ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని వారి సతీమణి ఆర్థిక సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్కే ఫౌండేషన్ అనాధ ఆశ్రమం నిర్వాహకులు డాక్టర్ దోర్నాల రామకృష్ణ జ్యోతి మాట్లాడుతూ వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేకరి అప్పారావు, ఆర్కే ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నోట్:వార్తను ఫొటోతో సహా పెట్టగలరు

రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్-2024 పోటీలకు తెల్దారుపల్లి విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్-2024 పోటీలకు మండల పరిధిలోని తెల్దారుపల్లి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఎం.శ్రీజ ఎంపికయినట్లు పాఠశాల ఆర్ట్ ఉపాధ్యాయుడు పాము నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్-2024 పోటీల్లో 'త్రిడి ఆర్ట్ ఫాం' విభాగంలో ఎం.శ్రీజ ప్రథమ స్థానం సాధించిందని వివరించారు. నవంబర్ 1, 2 తేదీల్లో హైదరాబాద్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎం.శ్రీజ పాల్గొననుంది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయిన శ్రీజ, చిత్రకళ ఉపాధ్యాయుడు పాము నాగేశ్వరరావును పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతిసుధ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తమ్మినేని కోటేశ్వరరావు, సిద్ధినేని కోటయ్య, జక్కంపూడి కృష్ణ, మడిపల్లి వెంకన్న, రాజశేఖర్, రంజాన్, శ్రీను, రమేష్ తదితరులు అభినందించారు.



సీపీఐ(ఎం) మండల కమిటీకి నూతనంగా ఐదుగురు సభ్యులు ఎన్నిక

నవతెలంగాణ-ముదిగొండ

సిపిఐ(ఎం) మండల 9వ మహాసభ మండల పరిధిలో అమ్మపేట గ్రామంలో ఈనెల 18న జరిగిన విషయము విధితమే. ఈ మహాసభలో సిపిఐ(ఎం) మండల కార్యదర్శిగా తిరిగి రెండోసారి బట్టు పురుషోత్తంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభల్లో పార్టీ నియమావళి ప్రకారం 65 సంవత్సరాలు దాటిన నలుగురు పార్టీ సభ్యులు మందరపు వెంకన్న, కందుల భాస్కరరావు, వాసిరెడ్డి వరప్రసాద్, పోలూరి నరసింహారావు రిలీవ్ కాగా, వారి స్థానంలో మరో ఐదుగురిని మండల కమిటీలోకి నూతనంగా తీసుకున్నారు. పార్టీ మండల కమిటీకి ఎన్నికైన సభ్యుల్లో బట్టు రాజు (ముదిగొండ) సామినేని రాంబాబు (చిరుమర్రి), కొండమీద రఘుపతి (పమ్మి), నంబూరి వెంకటేశ్వరరావు(అమ్మపేట), చింతకాయల రామారావు (బాణాపురం)లను ఎన్నుకున్నారు. పార్టీ మండల కార్యదర్శిగా రెండోసారి ఎన్నికైన బట్టు పురుషోత్తంతోపాటు 21 మంది మండల కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. సిపిఐ(ఎం) మండల నూతన కమిటీని పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

అపస్మారక స్థితిలో మహిళ, ఇద్దరు చిన్నారులు

- దిశా టీం సహాయసహకారాలు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

నగరంలోని పాత మున్సిపాలిటీ పరిసరాలలో అనుమానాస్పద పరిస్థితిలో గత వారం రోజుల నుంచి ఒక మహిళ తన ఇద్దరు చిన్న పిల్లలతో నిత్యం అపస్మారక స్థితిలో ఉన్నారు. అక్కడ ఉన్న చుట్టుపక్కల వారి సమాచారం మేరకు ఖమ్మం జిల్లా దిశా టీం నుంచి అధ్యక్షురాలు పమ్మి అనిత, సుష్మ, ఇతర దిశా కమిటీ సభ్యులు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి, అక్కడ ఉండటానికి గల వ్యక్తిగత కారణాలను అడిగి తెలుసుకున్నారు. సామాజిక బాధ్యతగా ప్రభుత్వ సఖి మహిళా మండలి టీంతో మాట్లాడి వారికి కౌన్సిలింగ్ ఇచ్చే ఏర్పాటు చేసి వారి సొంత గ్రామమైన వరంగల్ తీసుకెళ్ల వలసిన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి సహాయం అందించిన ఖమ్మం నగర మహిళా పోలీస్ స్టేషన్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | అక్టోబర్ 21, 2024 | www.navatelangana.com

పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన డీఎస్పీ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



ఆళ్ళపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఇల్లందు డీఎస్పీ ఎస్.చంద్రభాను ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా డీఎస్పీ ముందుగా పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది నీట్ టర్న్ ఔట్‌ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న కేసు ఫైళ్ళు, రిజిస్టర్, ఠాణా పరిసరాలు పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని, వారికి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. డీఎస్పీ వెంట టేకులపల్లి సీఐ టి.సురేష్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఈ.రతీష్, ఏఎస్ఐలు ములుకూరి వెంకట్ రెడ్డి, సి. హెచ్.వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్స్ కృష్ణమూర్తి, రాజేశ్వరరావు, కానిస్టేబుల్స్ ఎం.శ్రీనివాస్, వై.శ్రీనివాస్, కె.ఉపేందర్, వి.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం

- బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సతీష్ రెడ్డి

నవతెలంగాణ-పినపాక



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సతీష్ రెడ్డి విమర్శించారు. ఆదివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు ఆదేశాలతో ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో గల పార్టీ నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామన్నామని మోసం చేశారన్నారు. ప్రతి మహిళకు రూ.2,500 పింఛన్, వృద్ధులు, వితంతులు, బీడీ కార్మికుల పింఛన్లు పెంచుతామని గద్దెనెక్కి పది నెలలు అయినా వాటిని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రైతులను ఇచ్చిన మాట సైతం తప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుమ్మడి గాంధీ, సీనియర్ నాయకులు భవాని శంకర్, కొండేరు రాము, దొడ్డ శ్రీనివాస రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీలకు సన్మానం



నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఇటీవల రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ టీచర్లుగా ఎంపికైన పలువురిని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు సన్మానించారు. లక్ష్మీ నగరం గ్రామానికి చెందిన రోకళ్ళ సౌందర్య, శ్రీనగర్ కాలనీకి చెందిన రేవుళ్ళ అశ్విని, పత్తిపాక గ్రామానికి చెందిన కుర్సం దుర్గరాజులను శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. తల్లిదండ్రులు ఎంతో శ్రమ కోర్చి ఉన్నత చదువులు చదివిస్తే వారి ఆశలను మమ్ము చేయకుండా సమాజంలో గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడడం పట్ల వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోయం కోటేశ్వరరావు, కాంతమ్మ, వెంకటేష్, సతీష్, రాజేష్, రమేష్, జీరి సత్యనారాయణ రెడ్డి, పంపన శివరావు తదితరులు ఉన్నారు.



ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

- సారపాకలో ర్యాలీ, కరపత్రాలు పంపిణీ

నవతెలంగాణ-బూర్గంపాడు

బూర్గంపాడు మండలం సారపాకలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య నగర్ కాలనీ నుండి సారపాక సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా సంఘం నాయకులు సరోజినీ, నాగమణి మాట్లాడుతూ ఈ నెల 21,22, 23 తేదీల్లో కొత్తగూడెంలో జరిగే ఐద్వా 4వ మహాసభలను విజయవంతం చేయాలని వారు అన్నారు. ఈ మహాసభలలో మాజీ ఎంపీ ఐద్వా మహాసభ జాతీయ నాయకురాలు బృందా కారత్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, తదితరులు పాల్గొని మహిళా సమస్యలపై చర్చించనున్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళా శాఖ కార్యదర్శి ఎస్.కే.అబిదా, నిమ్మల పద్మ, దాసరి రాధా, రేపాకుల లక్ష్మి, సాధికా, సరస్వతి, శ్యామల, లతా, తిరుపతమ్మ, వెంకమ్మ, ఆదిలక్ష్మి, సుభద్ర, పద్మ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐద్వా బహిరంగ సభ...జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.బి.నర్సారెడ్డి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఈ నెల 21, 22, 23 తేదీలలో కొత్తగూడెం పట్టణంలో జరుగుతున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ పిలుపునిస్తోంది. ఈ మహాసభల సందర్భంగా భద్రాచలం ఏరియా హాస్పిటల్ నందు ఆదివారం ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.బి నర్సారెడ్డి మాట్లాడారు. ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు మహా ర్యాలీ బహిరంగ సభ ఉన్నందున ఈ బహిరంగ సభకు ఆల్ ఇండియా ఐద్వా నాయకురాలు బృందా కారత్, ఆల్ ఇండియా నాయకులు పాల్గొంటున్నారన్నారు. కావున శ్రామిక రంగంలో పనిచేస్తున్న మహిళలు, స్కీం వర్కర్లు పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని నర్సారెడ్డి పిలుపునిచ్చారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలకు...కొత్తగూడెం ముస్తాబు

నేడు బహిరంగ సభ

- హాజరుకానున్న జాతీయ నేతలు

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం పట్టణంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర నాలుగవ మహాసభ నిర్వహణకు పట్టణం ముస్తాబైంది. సోమవారం జరిగే బహిరంగ సభకు సర్వం సిద్ధం అయింది. కొత్తగూడెం ఐద్వా రాష్ట్ర మహాసభలకు వేదిక కానున్న నేపద్యంలో పట్టణంలో ఐద్వా జెండాలు, తోరణాలతో నిండిపోయింది. కొత్తగూడెం పట్టణంలోని ప్రధాన కూడళ్ళను ఐద్వా తోరణాలు, జెండాలతో అలంకరణ చేశారు. 21, 22, 23 మూడు రోజుల పాటు జరిగే మహాసభలు మొదటి రోజు భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.

ఏర్పాట్లు పూర్తి....

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరుగుతున్న ఐద్వా రాష్ట్ర మహాసభలకు జిల్లా నలు మూలన నుండి మహిళలు భారీ సంఖ్యంలో చేరుకోనున్నారు. మహాసభల సందర్భంగా 21వ తేదీన భారీ బహిరంగ సభను పట్టణంలో నిర్వహిస్తున్నారు. ఉదయం నుండి పట్టణంలోని పలు మహిళా ప్రదర్శన ప్రారంభమయ్యే విధంగా ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ పాత డిపో నుండి విద్యానగర్ వరకు, బస్టాండ్ సెంటర్ నుండి ప్రతినిధుల సభ జరిగే కొత్తగూడెం క్లబ్ వరకు జెండాలు, తోరణాలు, మహిళ అమరవీరుల ఫోటోలతో ఏర్పాటు చేసిన అలంకరణ అందరిని ఆకట్టుకునే విధంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 600 మంది ప్రతినిధులు ఈ మహాసభకు హాజరవుతున్నారు. బహిరంగ సభకు దేశవ్యాప్తంగా అనేక మహిళల ఉద్యమాలకు నాయకత్వం వహించిన మాజీ రాజ్యసభ సభ్యురాలు బృందా కారత్, ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పి.కె.శ్రీమతి ప్రధాన కార్యదర్శి మరియం ధావలే వంటి ముఖ్య నేతలంతా కొత్తగూడెం రానున్నారు.

భవిష్యత్ పోరాటాలకు చర్చావేదిక....

ఐద్వా రాష్ట్ర 4వ మహాసభలో దేశవ్యాప్తంగా ఇటీవల కాలంలో మహిళల మీద జరుగుతున్న హింస, వేధింపులు, కేంద్ర ప్రభుత్వ మనువాద భావజాలానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలన్నింటినీ మహాసభలో, బహిరంగ సభలో నాయకులు ప్రజలకు, ఐద్వా కార్యకర్తలకు వివరిస్తారు. ఈ వేదిక మీద చర్చించి, భవిష్యత్ కార్యచరణ రూపొందించనున్నారు. మహాసభల నిర్వహణ కోసం ఇప్పటికే ప్రజా సంఘాల నాయకులతోటి వసతుల కమిటీ, అలంకరణ కమిటీ, ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహణ కమిటీ, భోజనాలు నిర్వహణ కమిటీ, ప్రతినిధుల సభ ఏర్పాట్లు నిర్వహణ కీలకమైన కమిటీలు ఏర్పాటు చేసి ఐద్వా, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు మహాసభల విజయవంతంకు కృషి చేస్తున్నారు.



ఇందిరమ్మ కమిటీల పేరుతో కాలయాపన చేయొద్దు

- సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు మచ్చ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-సుజాతనగర్



ఇందిరమ్మ కమిటీల పేరుతో కాలయాపన చేయొద్దని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం రాఘవాపురం శాఖ సమావేశాలు మురుపెటి రాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి వారు హాజరై మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లు మంజూరు చేయాలని, ఆరు గ్యారెంటీల పేరుతో అమలు కానీ వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చి కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని అన్నారు. సిమెంటు, స్టీలు ధరల పెరుగుదలకు అనుగుణంగా ఒక్క ఇంటికి రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థలం లేని వారికి ప్రభుత్వమే స్థలం చూపించాలని అన్నారు. రైతు రుణమాఫీ కావటం లేదని, రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి సుమారు 5000 మంది రైతులకు రుణమాఫీ కాలేదని, రేషన్ కార్డు, ఆధార్ కార్డు పేరుతో ఏదో ఒక వంక చూపి రైతులను మోసం చేస్తుందని అన్నారు. రైతు భరోసా ఇంకా ఇవ్వలేదని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వీర్ల రమేష్, మండల కమిటీ సభ్యులు కాత్రాల తిరుపతిరావు, మండల కమిటీ సభ్యులు మద్దెబోయిన గోవర్ధన్, రాములు, చీపు వెంకన్న, మురిపుటి నగేష్, విద్యల నాగరాజు, అంజమ్మ, గార్ల రాజు, గురుకుల నాగరాజు, తంబళ్ల శీను, వేల్పుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జారే సుడిగాలి పర్యటన

నవతెలంగాణ-దమ్మపేట



అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ ఆదివారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ క్రమంలో జి.దానలక్ష్మికి వైద్యం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరి కాబడిన రూ.2.25లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే జారే స్వయంగా వారి ఇంటికి వెళ్ళి అందజేశారు. అక్కడ నుండి గుర్రాల హరినాద్-లక్ష్మి దంపతుల కుమార్తె వివాహ వేడుకకు హాజరైన జారే నూతన దంపతులు మమత-శివకృష్ణలను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అనారోగ్యంతో బాధపడుతున్న కూకలకుంట పుల్లారావును పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బి.బాలస్వామికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.60వేల చెక్కును మందలపల్లి వారి ఇంటికి వెళ్ళి అందించారు. గురవాయిగూడెం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కీసరి చైతన్య దశదిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారే వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. నాయుడుపేటకు చెందిన వెంగళరావుకు మంజూరైన సీఎంఆర్ఎఫ్‌చెక్కును నేరుగా వారి గృహానికి వెళ్ళి అందజేశారు. మండలంలోని తాటిసుబ్బన్నగూడెంలో అనారోగ్య సమస్యలతో మరణించిన తాటి సూరిబాబు దశదిన కార్యక్రమంలో పాల్గొన్న జారే సూరిబాబు చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు మానసిక పని ఒత్తిడికి గురికావద్దు

- అవగాహనా కార్యక్రమం ఎస్పీ

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం సబ్ డివిజన్ పరిధిలో పనిచేసే పోలీస్ అధికారులు, పోలీసులకు "స్ట్రెస్ మేనేజ్మెంట్ ఇన్ పర్సనల్ లైఫ్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్" అవగాహనా కార్యక్రమం స్థానిక పీఆర్ ఫంక్షన్ హాల్‌లో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా మానసిక నిపుణులైన జవ్వాది వెంకటేశ్వరరావు పోలీసులకు, సిబ్బందికి మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడంపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడారు. పోలీసులకు, అధికారులకు, సిబ్బందికి వ్యక్తిగత జీవితంలో, ఉద్యోగ జీవితంలో పని ఒత్తిడిని ఏ విధంగా తగ్గించుకోవాలో తెలిపారు. ఇటీవల జిల్లా పోలీస్ శాఖలో జరుగుతున్న కొన్ని సంఘటనల దృష్ట్యా పోలీస్ శాఖలో పనిచేసే సిబ్బంది, అధికారులలో మానసికంగా ధృఢంగా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ శాఖలో పనిచేసే వారు శారీరకంగా మానసికంగా ధృఢంగా ఉండాలన్నారు. ఎంత పెద్ద సమస్యనైనా పరిష్కరించుకునే విధంగా మార్గాలను ఎంచుకుని ధైర్యంగా ముందుకు సాగాలని అన్నారు. విధుల నిర్వహణలో భాగంగా ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. చిన్న చిన్న సమస్యలకే ఒత్తిడిని పెంచుకుని అనవసరంగా ఆరోగ్య సమస్యలు తెచ్చుకోవద్దని తెలిపారు. పనులను వాయిదా వేయకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేసుకుంటే ఒత్తిడి పెరిగే అవకాశం ఉండదని తెలిపారు. శారీరకంగా కూడా ధృఢంగా ఉండేటందుకు ప్రతిరోజు వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, కొత్తగూడెం 3టౌన్ సీఐ శివ ప్రసాద్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

- ఈ నెల 25వ తేదీన ముగుస్తున్న గడువు
- మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎండీ.యాకూబ్ పాషా

నవతెలంగాణ-పాల్వంచ

కేంద్ర ప్రభుత్వం ఈ నెలలో ప్రవేశ పెట్టిన 'ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్' పథకానికి జిల్లాలోని అర్హులైన యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండీ.యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్న్‌షిప్ కు ఎన్నికైన యువకులకు స్టైఫండ్ కింద ముందుగా రూ.6000లు అనంతరం ప్రతి నెల రూ.5000 చొప్పున స్టైఫండ్ కేంద్రం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ పాలిటెక్నిక్ డిప్లొమా, బీకామ్, బీసీఏ, బీబీఏ, బీ.ఫార్మసీ చదివిన 21 నుండి 24 ఏండ్ల మధ్య వయస్సు కలిగి సంవత్సర ఆదాయం 8 లక్షల లోపు ఉన్న వారు మాత్రమే ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దేశంలోని 500 ప్రసిద్ధ కంపెనీలు ఈ ఇంటర్న్‌షిప్ అందించడంలో భాగస్వాములుగా ఉన్నారని తెలిపారు. ఆసక్తి గల యువకులు తమ ఆధార్ కార్డ్ లింక్ అయి ఉన్న ఫోన్ నెంబరుతో ఈ నెల 25వ తేదీ లోపు తమ వివరాలు pminternship.mca.gov.in అను వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 8520860785కు సంప్రదించాలని పేర్కొన్నారు.



బ్రోంజ్ మెడల్ సాధించిన ఎస్ఐ స్వప్న

నవతెలంగాణ-చంద్రుగొండ

హైదరాబాద్‌లో శాఖా పరంగా జరిగిన డ్యూటీ మీట్‌లో చంద్రుగొండ ఎస్ఐ గంజి స్వప్న బ్రోంజ్ మెడల్ సాధించారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మోహంతి చేతులమీదుగా అవార్డును ఆమె తీసుకున్నారు. ఎస్ఐ స్వప్న బ్రోంజ్ మెడల్ సాధించడంతో ఆమె ప్రతిభను గుర్తించిన అధికారులు జాతీయస్థాయి మీట్‌కు ఎంపిక చేశారు. జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో ఆమె పాల్గొననున్నారు.



వంశీని అభినందించిన ఎస్పీ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం సిటీ స్టైల్ జిమ్‌కు చెందిన మోడెం వంశి అనే ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడిని ఎస్పీ రోహిత్ రాజ్ వంశీని, భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కోచ్ జివి రామిరెడ్డిని, జిల్లా పవర్ లిఫ్టింగ్ సభ్యులైన వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, కోశాధికారి మహంతి వెంకటకృష్ణాజిని ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... మోడెం వంశి అనే నిరుపేద గిరిజన క్రీడాకారుడు మారుమూల గిరిజన ప్రాంతం నుంచి వెళ్లి ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో బంగారు పతకాలు సాధించి ఇండియాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావడం ఎంతో గర్వించదగ్గ విషయం అని పేర్కొన్నారు. వంశీని వచ్చే మార్చ్‌లో జరిగే ఇంటర్ కంప్లీట్ చేయటంతో పాటుగా డిగ్రీ కూడా చదివి మంచి ఉద్యోగం సాధించమని ఆశీర్వదించారు. రాబోయే రోజుల్లో మారుమూల గిరిజన ప్రాంతాలలో ప్రజలు కొరకు నిర్వహించే అవగాహనా కార్యక్రమాలలో వంశీని కూడా ముందుకు రమ్మని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జివి రామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామకష్ణ ప్రసాద్, కోశాధికారి మహంతి వెంకట కృష్ణాజి, సీనియర్ నేషనల్ పవర్ లిఫ్టర్ తదితరులు పాల్గొన్నారు.

గౌతంపురం-సోంపల్లికి బీటీ రోడ్డుకు రూ.కోటి నిధులు మంజూరు

నవతెలంగాణ-బూర్గంపాడు



మండల కేంద్రమైన బూర్గంపాడు గౌతంపురం నుంచి సోంపల్లి వరకు 1.5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నిధులు మంజూరు చేశారు. ఇటీవల గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు, నాయకులు ఈ సమస్యపై ఎమ్మెల్యేకు విన్నవించగా బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరు చేయించి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు పట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, మండల ప్రజలు, స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళా శ్రమకు గుర్తింపు దక్కాలి

మహిళా స్వేచ్ఛను హరించడమే మోడీ విధానం

- సమస్యలే ఎజెండాగా రాష్ట్ర మహాసభలు
- నేడు జరిగే బహిరంగ సభకు హాజరుకానున్న బృందాకరత్
- రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షురాలు జి.ప్రభావతి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



మహిళా శ్రమకు ఏమాత్రం గుర్తింపు దక్కటం లేదని, మోడీ పదేళ్ల పాలనలో మహిళా స్వేచ్ఛ అంతకంతకు హరించి పోతుందని, ఈ నేపథ్యంలో రానున్న కాలంలో మహిళా పోరాటాలే కీలకంగా మారుతున్న తరుణంలో మహిళా పోరాటాలే ఎజెండాగా ఐద్వా రాష్ట్ర 4వ మహాసభలు కొత్తగూడెం పట్టణంలో నేడు జరుగుతున్నాయని మహాసభల ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షురాలు, మాజీ జెడ్పీటీసీ జి.ప్రభావతి తెలిపారు. 21, 22, 23 తేదీలలో కొత్తగూడెం పట్టణంలో జరుగుతున్న రాష్ట్ర మహాసభల సందర్భంగా ఆమె నవతెలంగాణతో ప్రభావతి ప్రత్యేకంగా మాట్లాడారు.

మహిళా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించే అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర మహాసభలకు కొత్తగూడెం పట్టణం వేదిక కావటం ఉద్యమాల జిల్లాకు ఎంతో ప్రత్యేకం. ఈ మహాసభలలో ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు రూపొందించుకోబోతున్నాం.

మోడీ పాలనలో మహిళలకు రక్షణ, గౌరవం లేదు

సమాన పనికి సమాన వేతనం అమలు కాకపోగా మహిళా శ్రమకు కనీసం గుర్తింపు కూడా దక్కటం లేదు. పని చేసే చోట చదువుకునే చోట ఆఖరికి ప్రాణాలు రక్షించే వైద్యశాలలో సైతం మహిళలపై దాడులు జరుగుతున్నాయి. మోడీ మతతత్వ విధానంతో మహిళలు స్వేచ్ఛను కోల్పోతున్నారు. మణిపూర్‌లో వందలాది మంది మహిళలపై దాడులు జరిగినా మోడీ కనీసం స్పందించలేదు.

పాలకులు మారినా విధానాలు మారటం లేదు

రాష్ట్రంలో సైతం పాలకులు మారినా విధానాలు మాత్రం మారటం లేదు. మహిళల పట్ల అదే వివక్షత అదే చిన్న చూపు కొనసాగుతుంది. మహిళా రక్షణ చట్టాలన్నీ కూడా కాగితాలకే పరిమితమవుతున్నాయి తప్ప కార్యరూపం మాత్రం దాల్చడం లేదు. మద్యంపై వచ్చే ఆదాయంతో ప్రభుత్వాలు నడిపే పాలకుల విధానం తోనే వీధి వీధిన బెల్ట్ షాపులు తయారై మద్యం మత్తులో మహిళలపై బాలికలపై అగత్యాలు అంతకంతకు పెరిగిపోతున్నాయి.

మహిళలు స్వయం శక్తితో ఎదగాలి

పురుషులతో సమానంగా మహిళలు శ్రమించినప్పటికీ అవకాశాలు మాత్రం సమానంగా రావటం లేదు. మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ సైన్స్ రంగంలో మహిళలు దూసుకుపోతున్నా సరైన గుర్తింపు లభించక ఇంకా అధిక శాతం మహిళలు ఇంటికే పరిమితం అవుతున్న పరిస్థితి ఏర్పడుతుంది. మహిళల శ్రమకు తగ్గ ఫలితంతో పాటు ఆర్థిక స్వేచ్ఛను కల్పించాలి. విద్యతోపాటు అన్ని రంగాలలో మహిళలకు సమాన హక్కులు కల్పించిన నాడే దేశం సమగ్ర అభివృద్ధి చెందినట్టుగా భావించాలి.

మహిళా సమస్యలపై ఐద్వా నిరంతర పోరాటాలు

మహిళ హక్కులు, రక్షణ కోసం నిరంతరాయంగా తన పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంది. మహిళలపై జరుగుతున్న అఘాత్యాలకు వ్యతిరేకంగా గొంతెతటమే కాకుండా వీధి పోరాటాలు నిర్వహించి బాధిత మహిళలకు న్యాయం జరిగే వరకూ అండగా నిలిచేది కేవలం ఐద్వా మాత్రమే. మత చాందస్తవాదుల నుండి మహిళలు స్వేచ్ఛను పొందేందుకు నిరంతరం సైదాంతిక పోరాటాన్ని నిర్వహిస్తూనే మహిళలను చైతన్యవంతులను చేస్తుంది.

పోరాటాల రూపకల్పనకు వేదిక కానున్న మహాసభలు

అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర నాలుగో మహాసభలు మహిళా సమస్యలపై పోరాటాలు రూపొందించుకునే వేదికగా జరగబోతున్నాయి. మూడవ మహాసభలో తీసుకున్న కర్తవ్యాలు సాధించిన విజయాలు చర్చించుకొని భవిష్యత్తులో నిర్వహించాల్సిన పోరాటాలను రూపొందించుకునేందుకు నిర్దిష్టమైన ప్రణాళికతో ఈ మహాసభలను నిర్వహిస్తున్నాం. మహిళా సమస్యల పరిష్కారం కోసం మహాసభ పలు తీర్మానాలను చేయబోతుంది.

మహాసభల సందర్భంగా మహిళా ప్రదర్శన, బహిరంగ సభ

ఐద్వా రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా నేడు మధ్యాహ్నం రెండు గంటలకు పాత బస్టాండ్ సెంటర్ నుండి కొత్తగూడెం క్లబ్ వరకు భారీ మహిళా ప్రదర్శన నిర్వహిస్తున్నాం. సుమారు 5000 మందితో బహిరంగ సభను నిర్వహించి, మహాసభల ప్రాధాన్యతను తెలియజేయబోతున్నాం. మూడు రోజుల పాటు జరిగే మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా 800 మంది ఎంపిక చేయబడ్డ ప్రతినిధులు హాజరుకానున్నారు.

మహాసభలకు హాజరుకానున్న బృందా కారత్

ఐద్వా మహాసభలకు జాతీయ నాయకురాలు బృందా కారత్ హాజరుకానున్నారు. భద్రాచలం ఏజెన్సీలో గతంలో ఆదివాసీ మహిళల సమస్యల పైన అధ్యయనం చేసి ఈ ప్రాంత ప్రజలతో ప్రత్యేక అనుబంధాన్ని ఏర్పాటు చేసుకున్న బృందా కారత్ ఆదివాసీ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు రూపొందించేందుకు దిశ నిర్దేశం చేయనున్నారు. రాష్ట్ర జాతీయ నాయకులు మహాసభలలో పాల్గొని భవిష్యత్తు పోరాటాలను ప్రతినిధుల సమక్షంలో రూపొందించనున్నారు.



కళ్లోజి జయమ్మకు నివాళి

- కళ్లోజికి మనోధైర్యం కల్పించిన నాయకులు
- టీయూడబ్ల్యూజే (143) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అల్లం నారాయణ, మారుతి సాగర్

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం సీనియర్ జర్నలిస్టు, టీయూడబ్ల్యూజే టీజేఎఫ్ హెచ్-143 యూనియన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కళ్లోజి శ్రీనివాస్ మనోధైర్యంగా ఉండాలని జర్నలిస్టు సంఘాల నాయకులు కోరారు. ఆయనకు మాతృవియోగం జరిగిన విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర నాయకులు ఆదివారం కొత్తగూడెంలోని కళ్లోజి శ్రీనివాస్ ఇంటికి వచ్చారు. ఆయన తల్లి కళ్లోజి జయమ్మ చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళి అర్పించారు. కళ్లోజి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ మాజీ చైర్మెన్, టీయూడబ్ల్యూజే (టిజేఎఫ్) హెచ్-143 యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, కోశాధికారి, హైదరాబాద్ సిటి ప్రెసిడెంట్ యోగి, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమణకుమార్ మాట్లాడారు. మనోధైర్యంగా ఉండాలని శ్రీనివాస్‌కు ధైర్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు చంద్ర నరసింహారావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షఫీ, టెంజు అధ్యక్షులు వట్టికొండ రవి, క్రాంతి కుమార్, సీమకుర్తి రామకృష్ణ, అశోక్, శ్యామ్, పురుషోత్తం, చింతల చిరంజీవి, మొగిలి, డాక్టర్ తరుణ్, ప్రేమ్ సాగర్, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

విలేఖరి పై దాడి ఘటన...

- ముగ్గురిపై కేసు నమోదు రిమాండ్
- పరారీలో ఉన్నవారిని పట్టుకుంటాం
- సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఎన్.చంద్రబాను

నవతెలంగాణ-ఇల్లందు



సుదర్శన్ విలేఖరి పై జరిగిన దాడి సంఘటన పై ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్టు డీఎస్పీ ఎన్.చంద్రభాను ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. అరెస్టు అయిన వారిలో రెడ్డి బోయిన వంశీకృష్ణ, తండ్రి ఎంకన్న, గుమస్తా, బాలాజీ నగర్, మూచకుర్తి ప్రేమ్ కుమార్, తండ్రి నాగభూషణం, ప్రయివేట్ జాబ్, ఆజాద్ నగర్, ఎడారి ఉదయ్ కుమార్, తండ్రి శ్రీనివాసరావు, ప్రయివేట్ జాబ్, హనుమంతులపాడు మండలానికి చెందిన ఈ ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ పంపించడం జరిగినట్లు తెలిపారు. వీరి వద్ద నుండి సదరు పిటిషనర్ సుదర్శన్‌ను కొట్టడానికి ఉపయోగించిన ఇనుపరాడ్డును, బీరు సీసాలను సీజ్ చేయడం జరిగిందని మిగతా పరారీలో ఉన్న వ్యక్తులను త్వరలో పట్టుకొని కోర్టు ముందు హాజరుపరుస్తామని తెలిపారు.

కాళ్ల నొప్పులకు ఉచిత ఆయుర్వేద మందులు పంపిణీ



నవతెలంగాణ-అశ్వపల్లి

అశ్వపల్లి మండలంలో కీళ్లనొప్పులు, కాళ్ల వాపులతో బాధపడుతున్న వారికి మర్కోడు గ్రామానికి చెందిన వ్యాపారస్తులు అనుమోల వెంకటేశ్వర్లు, వెలిశాల రామ్మూర్తి ఆదివారం ఉచిత ఆయుర్వేద మందులు పంపిణి చేశారు. ఇరువురు వ్యాపారస్తుల ఆధ్వర్యంలో మర్కోడు చుట్టు పక్కల గ్రామాల్లో కీళ్ల నొప్పులతో బాధపడుతున్న సుమారు 400 మందికి ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. ఇటీవల కాలంలో జ్వరం వచ్చి తగ్గాక చాలా మందికి కాళ్ల వాపులు, కీళ్లనొప్పులు రావడంతో అవి ఎంతకీ తగ్గకపోగా, ఆయుర్వేద వైద్యుల సలహా ప్రకారం వారు మర్కోడు గ్రామంలో కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. ఇంకా మిగిలిన వారికి సైతం కొద్దిరోజుల్లో మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనుమోల మంజుల, వెలిశాల కార్తీక్, ప్రియాంక, పద్మ మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

దశదిన కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

నవతెలంగాణ-దమ్మపేట



మండల పరిధిలోని మూడు గ్రామాల్లో జరిగిన టీడీపీ నాయకుల దశదిన కార్యక్రమంలో ఆ పార్టీ ఆదివారం నాయకులు పాల్గొన్నారు. మండలంలోని తాటిసుబ్బన్నగూడెంలో నాయకులు టి.సూరిబాబు, నాయుడుపేట గ్రామంలో దొడ్డ శేషగిరి, గురవాయిగూడెంలో నాయకులు కీసరి గంగరాజు కుమారుడి దశదిన కార్యక్రమాలలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి కట్రం స్వామిదొర, సొసైటీ వైస్ చైర్మెన్ గట్టం ఎర్రప్ప, అశ్వారావుపేట, టీడీపీ మండల అధ్యక్షులు నార్లపాటి శ్రీనివాసరావు, ఎండి వలీపాషా, నాయకులు పెనుబల్లి వెంకటేష్, డి.చెన్నారావు తదితరులు పాల్గొని నివాళులు అర్పించి వారి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

గుంతలు పూడ్చివేత



నవతెలంగాణ-దుమ్ముగూడెం

భద్రాచలం-చర్ల ప్రధాన రహదారి ఏపీ పరిధిలోని గుంతలు పూడ్చే రహదారి పనులు రెండవ రోజు ఆదివారం కొనసాగాయి. కన్నాయిగూడెం గ్రామ శివారులో దుమ్ముగూడెం మండలం రామచంద్రుని పేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తూ గుంతలో పడి ప్రమాదానికి గురి అయ్యాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్ ప్రమాద స్థలంలోని గుంతలను పూడ్చి వేశారు. ఈ విషయం పలు పత్రికలు, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అటు ఏపీ అధికారుల సైతం స్పందించారు. ఆదివారం ప్రధాన రహదారి వెంబడి ఉన్న పెద్ద పెద్ద గోతులను వెట్ మిక్స్‌తో పూడ్చివేశారు. ఈ పనులను తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్‌తో పాటు ఏపీ అధికారులు దగ్గరుండి పర్యవేక్షించారు.

వరల్డ్ వైడ్ యాంగ్లికన్ 40వ బిషప్‌గా విక్రమ్ రాజ్



దుమ్ముగూడెం : వరల్డ్ వైడ్ యాంగ్లికన్ చర్చ్ 40వ బిషప్‌గా పెద్ద నల్లబల్లి గ్రామానికి చెందిన విక్రమ్ రాజును నియమించారు. వరల్డ్ వైడ్ యంగ్లికన్ చర్చ్ భారతదేశ పీఠాధిపతి అయినటువంటి ఆర్చి బిషప్ వి మోజెస్ పాల్ నియామకపు ఉత్తర్వులను ఈ మేరకు విక్రమ్ రాజుకు అందజేశారు. సామాన్యమైన క్షత్రియ కుటుంబంలో పుట్టి అతి చిన్న వయసులోనే ప్రపంచవ్యాప్తంగా 256 దేశాలలో వ్యాపించి ఉన్న వరల్డ్ వైడ్ యాంగ్లికన్ చర్చి నుండి 40 వ బిషప్‌గా బాధ్యతలు చేపడుతున్న విక్రమ్ రాజును పలు క్రిస్టియన్ సంస్థలకు చెందిన బిషప్‌లు, చర్చి పాస్టర్లు, సంఘ సేవకులు ఆయనను అభినందించారు.

ఆటో నుండి జారి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

దుమ్ముగూడెం : ప్రమాదవశాత్తు ఆటో పై నుండి జారి పడి ఆటో నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు పాలు అయిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పాల్వంచ మండలం ఉల్వనూరు గ్రామానికి చెందిన పాయం నరసింహారావు బజాజ్ డీజిల్ ఆటో నడుపుతూ కాటాయిగూడెం గ్రామం నుండి లక్ష్మీనగరం వైపు వస్తున్న సమయంలో ములకపాడు గ్రామ శివారులోని మూలమలుపు వద్ద ఆటో ప్రమాదవశాత్తు పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో నరసింహారావుకు తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు 108 వాహనం ద్వారా మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వ్యక్తి క్షేమంగానే ఉన్నట్లు సమాచారం.

మడప లక్ష్మణరావు ఆదర్శప్రాయుడు

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మురళీకృష్ణ



నవతెలంగాణ-చర్ల

ప్రముఖ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, దివంగత మడపా లక్ష్మణరావు పలువురికి ఆదర్శప్రాయుడని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చీమల మర్రి మురళీకృష్ణ కీర్తించారు. ఆదివారం మడప మొదటి సంవత్సరిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆది నుండి కాంగ్రెస్ పార్టీని అంటిపెట్టుకొని ఉండి ఏజెన్సీ వాసులతో మమేకమై పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడంలో మడప అందవేసిన చేయని చీమలమర్రి పునర్ ఘాటించారు. కాంగ్రెస్ పార్టీ పట్ల అత్యంత విధేయుడుగా ఉంటూ పలువురికి సహాయ, సహకారాలు అందించడంలో ఆయన పరితపించేవారని మురళి అన్నారు. తొలుత ఆయనతో పాటు కి,శే, మడపా లక్ష్మణరావు శ్రీమతి భవాని అర్జున్ మడకం వీరేందర్‌లతో కలిసి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

పుల్లాయిగూడెంలో విచ్చలవిడి మట్టి దోపిడి

- అపహాస్యం అవుతున్న గిరిజన చట్టాలు
- భారీ యంత్రాలతో నిత్య తోలకం
- బాహాటపు దోపిడీ

సాగుతున్నా..పట్టించుకోని కీలక వ్యవస్థలు

నవతెలంగాణ-పాల్వంచ రూరల్





కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) యాస్పాండ్ (బూడిద చెరువు) కట్ట నిర్మాణం వివాదాలను మూటగట్టుకుని సాగుతోంది. కరకట్ట ఎత్తు పెంచే కాంట్రాక్టును వరంగల్‌కు చెందిన ఓ గుత్తేదారు టెండర్ ద్వారా దక్కించుకున్నాడు. కాల పరిమితి కొద్దిరోజుల్లో పూర్తికావస్తున్నప్పటికీ ఇప్పటికీ 30% మించి పనులు జరగలేదని గుత్తేదారు వ్యవస్థలోని ఓ కీలక వ్యక్తి "నవతెలంగాణ'తో చెప్పకనే చెప్పాడు. నిర్మాణ పనుల జాప్యాన్ని ఓసారి పరిశీలిస్తే...

అనుమతులు లేకుండా తోలకాలు

పుల్లయ్య గూడెం ప్రాంతంలో చేపట్టిన బూడిద చెరువు నిర్మాణానికి ప్రధానంగా మట్టి, ఇసుక అవసరం. నిబంధనల ప్రకారం 1/70 అమల్లో ఉన్న ఏజెన్సీలో పట్టాహకులు కలిగిన గిరిజన భూముల నుండి మట్టి తోలకాలు చేపట్టాలి. ఇందుకు హక్కులు పొందిన గిరిజనులు ఎంతవరకు మట్టి అవసరమో రెవెన్యూ యంత్రాంగం నుండి ముందస్తు అనుమతి పొందాలి. నిబంధనల మేరకే మట్టి సేకరణ జరపాలి. ఇక ఇసుక విషయానికొస్తే ఎంతమేర ఇసుక కావాలో అనుమతి పొందిన రీచ్‌ల నుండి మైనింగ్ పర్మిషన్ పొందాలి. నిబంధనల ననుసరించి అధికారిక అనుమతి పొందిన తరువాతే నిర్మాణ ప్రక్రియ చేపట్టాలి. పుల్లయ్య గూడెం ఏజెన్సీ ప్రాంతంలో నిర్మించే బూడిద చెరువు (కరకట్ట) నిర్మాణం తొలి నుంచి గాడి తప్పి నడుస్తోంది.

దారిన పోయే దానయ్యలకు లక్షలు

నిర్మాణ ప్రారంభంలో గుత్తేదారు వద్ద అనుమతి పొందిన పాల్వంచ ప్రాంతానికి చెందిన ఓ సబ్ కాంట్రాక్టర్ దూకుడుగా పనులు ప్రారంభించాడు. అధికారికంగా అనుమతులు పొంది, పనులు ప్రారంభించాలనే సోయి మర్చి, దారిన పోయే దానియ్యల నందరినీ నమ్మాడు. ఎవడికి పడితే వాడికి లక్షల్లో ముట్ట చెప్పి నాలుక్కర్చుకుని చేతులెత్తేశాడు. దీంతో టెండర్ పొందిన గుత్తేదారు చేసేది లేక తన వద్ద పని చేసే ఓ సైట్ ఇంజనీర్‌కు పనులు అప్పగించాడు. కొద్దిరోజుల్లో కాంట్రాక్టు గడువు ముగియ నుండడంతో..అనుమతులు లేకున్నా, ఏజెన్సీ ప్రాంతంలో మట్టి సేకరణకు శ్రీకారం చుట్టాడు. ఇప్పుడు ఈ వివాదం కాస్త చిలికి చిలికి గాలివానగా మారింది.

అధికారిక అనుమతులపై ఆంక్షలు ఏంటి?

కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఓ సంస్థ. కర్మాగారం నుండి వెలువడే బూడిదను పైపుల ద్వారా ముందుగా ఏర్పాటు చేసిన బూడిద చెరువులో కొదలాలి. పుల్లయ్య గూడెం ప్రాంతంలో గతంలో ఏర్పాటుచేసిన బూడిద చెరువు నిండిపోయింది. చెరువు ఎత్తు పెంచేందుకు జెన్కో యాజమాన్యం ముందుకొచ్చింది. టెండర్ ప్రక్రియ ద్వారా ఓ గుత్తేదారు పనులు సొంతం చేసుకున్నాడు. ఏజెన్సీ ప్రాంత నిబంధనలను విస్మరించి పనులు ప్రారంభించాడు. టెండర్ పిరియడ్ పూర్తి కావస్తున్నప్పటికీ.. పనుల్లో పురోగతి లేదు. బుడిద చెరువు నింపేందుకు అవసరమైన మట్టి, ఇసుక ఇబ్బందిగా మారింది. అనుమతికి అధికారులకు మొరపెట్టుకున్నా.. ఏజెన్సీ చట్టాల నేపథ్యంలో దరఖాస్తులు బుట్టదాకలకు పరిమితమైనట్లు తెలుస్తోంది. దొడ్డిదారి తరలింపుకు గుత్తేదారు విశ్వ ప్రయత్నాలకుపక్రమించినా.. ఏజెన్సీ ప్రజల నుండి వ్యతిరేకత తీవ్రతరమైంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఓఎస్‌సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి భూమి నుండి మట్టితోలకాలు నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్నట్లు వినికిడి. అక్రమ తవ్వకం, తోలకాలపై రెవెన్యూ, మైనింగ్ యంత్రాంగాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఏజెన్సీ ప్రజలు కోరుతున్నారు.



బ్రిలియంట్ అధినేత బీఎన్ఆర్‌కు నంది అవార్డు ప్రధానం

నవతెలంగాణ-బూర్గంపాడు

హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వ బాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో జీసీఎస్ వల్లూరి, ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన అవార్డు ప్రధానోత్సవంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి సారపాక బ్రిలియంట్ విద్యా సంస్థల చైర్మెన్ బీఎస్ఆర్‌కు రాష్ట్రస్థాయి ప్రతిష్టాత్మక నంది అవార్డు దక్కింది. వల్లూరి ఫౌండేషన్ చైర్మెన్ శ్రీనివాస్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు, సంఖ్యా శాస్త్రజ్ఞులు దైవజ్ఞ శర్మ, సినీ ఆర్టిస్టుల చేతులమీదుగా బీఎస్ఆర్ దంపతులు ఈ అవార్డును అందుకున్నారు. అనంతరం బీఎస్ఆర్ దంపతులను అతిథులు శాలువాతో సత్కరించారు. విద్యారంగంలో విశేష సేవలందిస్తూ విద్యార్థుల ఉన్నతిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బీఎస్ఆర్ నంది అవార్డు దక్కడం పట్ల పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

బొగ్గుట్ట ప్యాసింజర్ రైలు తిరిగి పునరుద్ధరించాలి

- కేంద్ర మంత్రులు, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎంపీలు హామీ నిలబెట్టుకోవాలి
- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు నబీ

నవతెలంగాణ-ఇల్లందు



గత పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రలు బొగ్గుటకు(ఇల్లందు) ప్యాసింజర్ రైలు తిరిగి పునరుద్ధరిస్తామని హామీలు ఇచ్చారు. ఈ హామీలను నిలబెట్టుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ నబీ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన ఎంపీలు పది నెలలైనా సమస్య పట్టించుకోవడంలేదని అన్నారు. సింగరేణి పుట్టినిల్లు బొగ్గు (ఇల్లందు) 140 సంవత్సరాల చరిత్ర కలిగిందని, నైజాం నవాబు కాలం నుండి రైల్వే స్టేషన్ ప్రయాణ సౌకర్యాలు ఉండేవన్నారు. నాడు కళకళ లాడిన రైలు కూతలు లేక వేల వేల బోతోందన్నారు. దేశవ్యాప్తంగా రైలు మార్గం ద్వారా సింగరేణికి సిరులు కురిపిస్తున్న బొగ్గుని రవాణా చేస్తూ వెలుగులు నింపుతున్న ఇల్లందు గత పాలకుల నిర్లక్ష్యంతో చీకట్లో మగ్గుతుందన్నారు. రైల్వే మార్గాలు స్టేషన్లు దినదిన అభివృద్ధి చెందుతు కళకళలాడుతుంటే ఇల్లందు తిరోగమనంతో వెలవెలబోతుందన్నారు. మా ఇల్లెందు రైలు మార్గం బొగ్గు రవాణా కోసమేనా మా ప్రాంత ప్రజలు భారత దేశ వాసులు కాదా అని అబ్దుల్ నబి ప్రశ్నించారు. సీపీఐ(ఎం)తో పాటు అఖిలపక్ష పార్టీలన్నీ రైలు పునరుద్ధరణ పోరాటం చేయాలని ప్రాంత ప్రజల తరపున కోరుతున్నట్లు పేర్కొన్నారు. ప్రాంత ఖనిజ సంపద అంతరించి, ఫారెస్ట్ ట్రైనింగ్ స్కూలు పోయి, బయ్యారానికి ఉక్కు పరిశ్రమ రాక, అతిపెద్ద గిరిజన నియోజక వర్గ కేంద్రం తన పూర్వ వైభవాన్ని కోల్పోయిందని అన్నారు. ప్రజల ప్రయాణ సౌకర్యార్థం, ప్యాసింజర్ రైలు తిరిగి పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వం రైల్వే స్టేషన్‌ల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నది. ఈ సమయంలో ఇల్లందులో అభివృద్ధి పథంలో నడిపిస్తమని ప్రగల్భాలు పలికిన, పలుకుతున్న కేంద్ర, రాష్ట్ర పాలకులు రైలు పునరుద్ధరణకు నిధులు తెచ్చి చూపాలని సీపీఐ(ఎం) డిమాండ్ చూస్తోందన్నారు.

కోయగూడెం ఓసీ 3తో భూములు కోల్పోయిన గిరిజన కుటుంబాలు

- ఓసీ 2లో పిట్ 2, 3 భూసేకరణ కోసం గిరిజన భూములు
- సీపీఐ(ఎం), సీఐటీయూ, వ్యకాస, ప్రజాసంఘాల పోరాటాలతో హక్కులు సాధించుకున్న గిరిజనులు

నవతెలంగాణ-టేకులపల్లి





టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఓపెన్ కాస్ట్‌లో 2001లో బొగ్గు వెలికితీత పనులు ప్రారంభించారు. కోయగూడెం ఓసీ 3 కోసం గిరిజనులు తాతల కాలం నుండి చెట్టు పుట్ట, సదను చేసుకుని సాగు చేసుకుంటున్న భూములను జాతీయ సంపద పేరుతో నయా పైసా ఇవ్వకుండా సింగరేణి యాజమాన్యం వందలాది ఎకరాలను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఓసీ 3లో భూములు కోల్పోయిన గిరిజన కుటుంబాలు పాలేరుగా మిగిలిపోయారు. అందుల గూడెం, కోయగూడెం, చుక్కల బోడు, జేత్యా తండా, తుమ్మల చిలక, కుంటాల తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు సాగు చేసుకుంటూ జీవనం కొనసాగించేవారు. గిరిజనులకు అండగా సీపీఐ(ఎం), సీఐటీయూ, వ్యకాస, ప్రజాసంఘాల సహకారంతో 2001లో భూములు కోల్పోయిన కుటుంబాలతో కలిసి అనేక పోరాటాలు చేసి బొగ్గు లారీలకు తార్పాల్ పట్టకట్టే పనిని దక్కించుకున్నారు. 2007లో కోయగూడెం ఓసీ 2 పిట్ 2, 3 భూసేకరణ జరిగింది. 238 హెక్టార్ల సాగు భూమి కోల్పోయారు. లచ్చగూడెం, కోయగూడెం, దంతెలతండ, కొత్తతండ, జేత్యతండ గ్రామాలకు చెందిన 101 మంది గిరిజనులు, నలుగురు గిరిజనేతరులు ఉన్నారు. మొత్తం 105 మంది ఉన్నారు. భూమికి నష్టపరిహారం, పునరావాసం ఇవ్వకుండా పంటలను ధ్వంసం చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, భూ నిర్వాసితుల సంఘాల ఆధ్వర్యంలో సింగరేణి సంస్థపై తిరుగుబాటు చేశారు. ఎకరానికి రూ.5 వేలు పంట నష్టపరిహారం, 365 పని దినాల కింద కుటుంబాలకు సింగరేణి యాజమాన్యం మొత్తం ఒక కోటికి పైగా చెల్లించిన విషయం తెలిసిందే. అటవీ హక్కుల చట్టం ప్రకారము దారపాడు, కొత్తూరు, లచ్చగూడెం గ్రామాలకు చెందిన కొన్ని కుటుంబాలకు ఉద్యోగాలు, భూమికి నష్టపరిహారం కింద ఎకరానికి రూ.ఐదు లక్షల 25 వేలు చెల్లించిన విషయం తెలిసిందే. హైకోర్టు తీర్పు ప్రకారం 2012 సంవత్సరంలో పునరావాసం కల్పించారు. భూమి నష్టపరిహారం కోసం మళ్లీ 2016లో హైకోర్టును లచ్చగూడెం, కిష్టారం తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు సీపీఐ(ఎం) సహకారంతో ఆశ్రయించారు. 8 ఏండ్ల తర్వాత నిర్వాసితుల పక్షాన ఉపాధి అవకాశాలు, భూమి కింద భూమి నష్టపరిహారం చెల్లించాలని హైకోర్టు తీర్పు అమలు చేసింది. దీంతో భూ నిర్వాసితులు సీపీఐ(ఎం), ప్రజా సంఘాలు చేసిన పోరాటాలకు కృతజ్ఞతలు తెలిపారు.

తక్షణమే రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

- రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

నవతెలంగాణ-మణుగూరు



రాష్ట్రవ్యాప్తంగా రైతు భరోసాను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో సందర్భంగా నిరసన తెలియజేస్తున్న నాయకులు పోలీసులు అరెస్టులు చేశారు. పోలీస్‌లు భేషరతుగా విడిచి పెట్టాలని మాజీ జెడ్పీటీసీ పోషం నరసింహారావు డిమాండ్ చేశారు. మణుగూరు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి, తక్షణమే రైతు భరోసా నిధులు విడుదల చేసి రైతంగానే ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీగా రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు రైతుబంధు కింద రూ.5,000 ఎకరానికి ఇస్తుంటే, మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే రెండు సీజన్లలో రైతు భరోసా కింద రూ.15 వేలు ఎకరానికి ఇస్తామని రైతంగానే మోసం చేసి నేటికీ వేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు మొండిచేయి చూపించే విధంగా ప్రకటన చేయడం బాధాకరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలు ముత్యం బాబు, ఆడప అప్పారావు, మండల సొసైటీ చైర్మెన్ కుర్రి నాగేశ్వరరావు, వట్టం రాంబాబు, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, కుంట లక్ష్మణ్, ముద్దంగుల కృష్ణ, ఆవుల నరసన్న, ఎడ్ల శ్రీనివాస్, బోశెట్టి రవి, తురక రామకోటి, మడి వీరన్నబాబు, నరసింహరావు, చెన్నకేశవులు, రంజిత్, శ్రీను, వెంకట సోములు, రామారావు, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ దుర్గా భవాని మాత ఆలయంలో సహపంక్తి భోజనాలు

నవతెలంగాణ-ఇల్లందు



జెకె5 ఓసీలోని దుర్గా భవాని మాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దుర్గా దేవి నవరాత్రులలో భాగంగా ఆదివారం మహా చండీ యాగ మహెూత్సవాన్ని, సహపంక్తి భోజనాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని యస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణ మోహన్‌లు ప్రారంభించారు. ఈ నెల 16వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహించిన మహా చండీ యాగ కార్యక్రమాలలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమానికి జనరల్ మేనేజర్(యం.పి) మల్లెల సుబ్బారావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రామస్వామి, డీజీఎం పర్సనల్ జివి మోహన్ రావు, మేనేజర్ పూర్ణ చందర్, ఇతర అధికారులు ఉద్యోగులు వారి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. తదుపరి మహా అన్న ప్రసాద వితరణ (సహపంక్తి భోజనాలు) కార్యాక్రమంలో ఏరియా అధికారులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గని సేఫ్టీ ఆఫీసర్ శివ ప్రసాద్, ప్రాజెక్ట్ ఇంజనీర్ చిన్నయ్య, సీనియర్ పర్సనల్ అధికారి సుధాకర్, సెక్యూరిటీ అధికారి అంజి రెడ్డి, మహేష్, గుర్తింపు సంఘం డిప్యూటి జనరల్ సెక్రటరీ సారయ్య, ప్రతినిధ్య సంఘం ఉపా అధ్యక్షులు జే.వెంకటేశ్వర్లు, పిట్ కార్యదర్శులు సంజీవ చారి, నవీన్ ఇతర అధికారులు, ఉద్యోగులు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాలల మహా పాదయాత్రకు భారీగా తరలిరండి

- మాల మహానాడు జిల్లా నాయకులు

నవతెలంగాణ-బూర్గంపాడు



ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ దళితుల ఐక్యత కోసం జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు దళిత రత్న పిల్లి సుధాకర్ నేతృత్వంలో జరగబోయే మాలల మహాపాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను జాతీయ మాలమహానాడు నాయకులు ఆవిష్కరించారు. ఆదివారం బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర గ్రామంలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర, జిల్లా నాయకులు కరపత్రాలను ఆవిష్కరించి మహా పాదయాత్ర ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఈనెల 25 నుండి భద్రాచలంలో ప్రారంభ మవుతున్న మాలల మహా పాదయాత్రకు మాల సోదరులు సోదరీమణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రచార కార్య దర్శి, పాదయాత్ర జిల్లా కమిటీ బాధ్యులు తోటమల్ల రమణమూర్తి, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు, పాదయాత్ర జిల్లా కమిటీ బాధ్యులు గణపతి, జిల్లా ఉపాధ్యక్షులు పాదయాత్ర జిల్లా కమిటీ బాధ్యులు పల్లంటి రమేష్, జిల్లా నాయకురాలు పాదయాత్ర జిల్లా కమిటీ సభ్యురాలు బోడ దివ్య, జిల్లా నాయకురాలు పాదయాత్ర జిల్లా కమిటీ సభ్యురాలు మద్దేటి జయ, బొజ్జ వెంకటేశ్వర్లు, సెనగ నరసింహారావు, శనగ నిర్మల, శనగలక్ష్మి, బర్ల నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగం సాధించిన యువతి

నవతెలంగాణ-మణుగూరు



కష్టాలను, కన్నీళ్లను దిగమింగుకొని అమ్మ శ్రమతో నిన్న సింగరేణి యాజమాన్యం ప్రకటించిన నూతన బాహ్య ఉద్యోగ ఫలితాలలో సింగరేణి మేనేజ్మెంట్ ట్రైనీ (మైనింగ్) ఎక్స్ టర్నల్ అధికారిగా భార్గవి ఉద్యోగం సాధించింది. వివరాల్లోకి వెళితే మణుగూరు గాంధీ బొమ్మ సెంటర్‌కు చెందిన కుంచపు పద్మ రాజేందర్ దంపతుల కుమార్తె భార్గవికి తొమ్మిదేళ్ళ ప్రాయంలోనే తండ్రి రాజేందర్ అనారోగ్యంతో చనిపోయాడు. అయినా తల్లి పద్మ అధైర్య పడక ఎవరిని చేయి చాచి అడగక కూలి నాలీ చేసుకుని, మణుగూరు ఓసీలో కాంట్రాక్ట్ వర్కర్‌గా కూడా పనిచేసి ఏకైక కుమార్తె భార్గవిని బీటెక్ మైనింగ్ చేయించింది. భార్గవి స్థానిక భారత్ విద్యానికేతన్‌లో పదవ తరగతిలో 90 శాతం మార్కులతో ఉత్తీర్ణురాలైంది. స్థానిక కృష్ణవేణి జూనియర్ కాలేజీలో 93.2 శాతంతో ఇంటర్ పాస్ అయ్యింది. అనంతరం కొత్తగూడెం కేఎస్ఎమ్ మైనింగ్ పాఠశాలలో బీటెక్ మైనింగ్ చదివి 8.56 సీజీపీఏతో ఉత్తీర్ణురాలైంది. ఉద్యోగం సాధించడం పట్ల పలువురు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా భార్గవికి పలువురు బంధుమిత్రులు శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు.



మతం పేరుతో చిచ్చు పెడుతున్న బీజేపీ

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం

బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మతాల మధ్య చిచ్చు పెట్టి మతోన్మాదం పెరిగి దేశమంతా అల్లకల్లోలం అవుతుందని సీపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. రాపర్తి నగర్ వద్ద సిపిఎం శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు . ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం ప్రకారం మతాల మధ్య రాజకీయ చిచ్చు పెట్టి దేశంలో అశాంతి ఉండే విధంగా ఆర్ఎస్ఎస్ ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఈ రెండు కవలు పిల్లలు అని, ఆర్ఎస్ఎస్ ఆదేశాలు మేరకు మైనార్టీలపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. మనిషి ఏమి తినాలో, ఏ బట్టలు వేసుకోవాలో బిజెపి నేతలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రతి ఎన్నికల సమయంలో భావోద్వేగాలను రెచ్చగొట్టే పనిలో బిజెపి నేతలు ఉన్నారని విమర్శించారు. ఒక పక్క నూతన ఆర్థిక విధానాలతో దేశంలో సంక్షోభం ఏర్పడిందని, మరోవైపు ప్రజలు ఉద్యమాల్లోకి రాకుండా మతాన్ని ముందుకు తెచ్చి దేశ ప్రజలతో బిజెపి నేతలు ఆటలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. రాబోయే కాలంలో బీజేపీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను మరింతగా తీసుకుని వెళ్ళాలని కోరారు. ఈ సమావేశంలో ప్రముఖ లాయర్ గంగాధర్, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై విక్రమ్, పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, మాజీ కౌన్సిలర్ నర్రా రమేష్, నాయకులు జె.వెంకన్న బాబు, రవీంద్ర, బి.ముత్తయ్య, డి.వీరబాబు, టీబీ, నాగేశ్వరరావు, హుస్సేన్, షఫీ, కోయ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ రైలు డంపింగ్ పనులు లోకల్ వాళ్ళకే ఇవ్వాలి

నవతెలంగాణ-చింతకాని

పందిళ్ళపల్లి రైల్వే స్టేషన్‌లో గూడ్స్ రైలు డంపింగ్ ఎగుమతి, దిగుమతి పనులు లోకల్ వాళ్ళకే ఇవ్వాలని రామకృష్ణాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ తిరుపతి గోవిందరావు రైల్వే అధికారులను కోరారు. శనివారం రామకృష్ణాపురం, లచ్చగూడెం, గాంధీనగర్, అనంతసాగర్ గ్రామాల ప్రజలు సుమారు 200 కుటుంబాల వారు పని చేసుకునే అవకాశం ఉన్నందున గూడ్స్ షెడ్ కార్మికుల కుటుంబాలకు అండగా రాజకీయాలకు అతీతంగా ఐకమత్యంతో వారికి ముందుండి పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మిరియాల నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తూము అంజయ్య, గాదె రామారావు, పోతురాజు శ్రీనివాస్, ఉసికిల లక్ష్మీనారాయణ, చౌడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ రాజకీయవేత్త గాదెకు తుమ్మల పరామర్శ

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లికి చెందిన సీనియర్ రాజకీయవేత్త గాదె సత్యనారాయణను (సత్యం) వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆదివారం ఆయన గృహానికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల గాదె సత్యం శ్వాస సంబంధ ఇబ్బందులతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స జరిపించుకొని ఇంటికి చేరారు. విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల, డాక్టర్ మట్టా గాదెను కలుసుకొని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వీరివెంట ఏఎంసీ ఛైర్మెన్ దోమ ఆనంద్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు కమల్‌పాషా, టోపీ శ్రీను, గొర్లమారి రామ్మోహనరెడ్డి, మొరిశెట్టి సాంబశివరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ హామీని అమలు చేయాలి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఎస్సీ వర్గీకరణను ఆమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని ఎంఆర్‌పీఎస్ పాలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ వంగూరు ఆనందరావు డిమాండ్ చేశారు.మండల పరిధిలోని కొండాపురంలో ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ నూతన కమిటీల నిర్మాణ సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈనెల 25న మందకృష్ణ మాదిగ ఖమ్మం జిల్లా పర్యటనను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కనకం వీరబాబు, వంశీ, కిషోర్, నాగేంద్రబాబు, లక్ష్మీనారాయణ, బాలయ్య పాల్గొన్నారు.



సండ్ర కుమారుడు-

కోడలుకు నామ ఆశీర్వాదం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

సత్తుపల్లి మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, మహాలక్ష్మి దంపతుల కుమారుడు భార్గవ్ పెళ్లి చిద్విత సాయితో ఇటీవల జరిగింది. ఈ నేపథ్యంలో ఖమ్మం కార్పొరేషన్ బోనకల్ రోడ్‌లోని శ్రీ లక్ష్మీ గార్డెన్స్ లో ఆదివారం ఏర్పాటు చేసిన రిసెప్షన్‌కు బిఆర్ఎస్ మాజీ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హాజరై నూతన దంపతులకు పూల బోకే ఇచ్చి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఖమ్మం నగరానికి చెందిన చీకటి వెంకట అప్పారావు గిరిజ దంపతుల కుమార్తె దీక్షిత చౌదరి, కాకర్ల సాయి యశ్వంత్ ల వివాహం ఇటీవల అయింది. ఆదివారం ఖమ్మం లో వారి నివాసానికి మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించారు. నామ వెంట ఎంఎల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, బిఆర్ఎస్ నాయకులు కనకమేడల సత్యనారాయణ, దిశ కమిటీ మాజీ సభ్యులు గారపాటి సూర్యనారాయణ, వైరా బిఆర్ఎస్ రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, నాయకులు మోరంపూడి ప్రసాద్, గొడ్డేటి మాధవరావు, తన్నీరు రవి, జవ్వాజి రవి, తాళ్లూరి శ్రీనివాస్ చౌదరి, కొడగంటి ఆంజనేయులు, ఎదునూరి శ్రీను, గొల్లమందల విజయ్, షేక సైదా, నామ సేవ సమితి సభ్యులు పాల్వంచ రాజేష్, సరిపూడి గోపి, రేగళ్ల కృష్ణప్రసాద్, సింగవరపు నరేష్, కంచర్ల నాగేశ్వరరావు ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీ...

ఒకరు మృతి

నవతెలంగాణ-వేంసూరు

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కల్లూరు గూడెం సమీపంలో జరిగింది. రాచూరి వంశీ బైక్‌పై వెళ్తుండగా గొల్లగూడెంకు చెందిన చిలకా గోపి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెళుతుండగా రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో గోపి(25)కి తలకు బలమైన గాయాలు అవటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వంశీకి గాయాలుకాగా 108 సాయంతో హాస్పిటల్‌కు తరలించారు.

వైభవపేతంగా దుర్గామాత శోభాయాత్ర

నవతెలంగాణ - బోనకల్



దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు వేడుకలు ఆదివారం రాత్రి వైభవపేతంగా రంగరంగ వైభవంగా ముగిశాయి. మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో అమ్మవారి ఊరేగింపు శోభయాత్ర సంత్ సేవాలాల్ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఎంతో వైభవ పేతంగా జరిగింది. చివరి రోజు శోభాయాత్ర కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టిపిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, బోనకల్ మాజీ సర్పంచ్ భూక్య సైదా నాయక్ కాంగ్రెస్ యువ నాయకుడు బిపి నాయక్ , కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు వైభవపేతంగా జరిగాయి. తొలుత ఈ కార్యక్రమాన్ని పైడిపల్లి కిషోర్ కుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి శోభయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంతు సేవాలాల్ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవ పేతంగా నిర్వహించి ముగింపు ఉత్సవాలను కూడా అంతే ఉత్సాహంతో నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బోనకల్ మాజీ సర్పంచ్ పోటు వెంకటేశ్వర్లు, గిరిజన కాలనీవాసులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'గ్రానైట్' రంగాన్ని బతికించుకుందాం..

- ముఖ్యమంత్రి దృష్టికి పరిశ్రమ సమస్యలు
- రాయల్టీ, స్లాబ్ , సబ్సిడీలపై దృష్టి
- 'ది ఖమ్మం గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్' ప్రమాణ స్వీకారోత్సవంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి గ్రానైట్ ఫ్యాక్టరీల ఓనర్స్ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. రాయల్టీ, స్లాబ్ , సబ్సిడీలపై దృష్టి సారిస్తామన్నారు. ఖమ్మంలోని ఎస్ ఆర్ గార్డెన్స్ లో ఆదివారం రాత్రి నిర్వహించిన 'ది ఖమ్మం గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్' నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రానైట్ రంగం ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. జిల్లాకు అదరువుగా ఉన్న గ్రానైట్ పరిశ్రమను బతికించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఖమ్మం జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకొచ్చే విధంగా తన పని విధానం ఉంటుందని స్పష్టం చేశారు. స్లాబ్, సబ్సిడీల సమస్యలను సీఎంతో చర్చించి పరిష్కరిస్తానన్నారు. అలాగే రాయల్టీ అంశాన్ని గతంలోనే తాను మంత్రిగా ఉన్నప్పుడు రెండు సందర్భాల్లో జీవోలు ఇప్పించానని గుర్తు చేశారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంపై దృష్టి సారిస్తానన్నారు. అంతకుముందు గ్రానైట్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు పాటిబండ్ల యుగంధర్ మాట్లాడుతూ గ్రానైట్ రంగం సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్లాబ్, సబ్సిడీ, రాయల్టీ అంశాలను పరిష్కరించాల్సిందిగా కోరారు. రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు ఇరువురు గ్రానైట్ రంగం నుంచి వృద్ధిలోకి రావడం విశేషమని చెప్పారు. వారు ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉండడం ద్వారా తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

మాజీ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ మాట్లాడుతూ గ్రానైట్ రంగాన్ని ప్రభుత్వానికి ఆదాయం తెచ్చే వనరుగా చూడవద్దని అన్నారు. దీనిని ప్రజల జీవనస్థితిగతులను పెంపొందించే విధంగా చూడాలని కోరారు. సంస్థపై ఆధారపడి ప్రత్యక్షంగా 20,000 మంది, పరోక్షంగా లక్ష మంది జీవనం సాగిస్తున్నారని తెలిపారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం..

గ్రానైట్ అసోసియేషన్ నూతన కమిటీ చేత బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రెసిడెంట్ గా పాటిబండ్ల



యుగంధర్, ప్రధాన కార్యదర్శిగా కమర్తపు గోపాలరావు, కోశాధికారిగా మారంరెడ్డి పరమేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు - 1,2 గా కొనకంచి శ్యాంప్రసాద్ ముఖర్జీ, తమ్మినేని సాగర్, సంయుక్త కార్యదర్శులుగా షేక్ రియాజ్, చావ రామ్మూర్తి, కార్యనిర్వాహక సభ్యులుగా దొండేటి స్వేధన్, మావులేటి అనిల్ కుమార్, బానోతు లాలూ ప్రతాప్, పెరుమాళ్ళపల్లి రవికుమార్, బొల్లారెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు.

ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, గ్రానైట్ అసోసియేషన్ వ్యవస్థాపకులు యలమద్ది శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షులు పారా నాగేశ్వరరావు, సాధు రమేష్ రెడ్డి, దొడ్డ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.







వ్యవసాయంలో ప్రభుత్వ వైఫల్యం.. "హాలికులు-సేమమా"

- ఆలోచింపజేసిన నాటిక
- పీఎన్ ఎం సమర్పణ
- దేవేంద్ర దర్శక ప్రతిభ

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



"హాలికులు-సేమమా" అనే నాటిక వ్యవసాయరంగంలో భారత ప్రభుత్వ వైఫల్యాలకు దర్పణం. 1987-88 ప్రాంతాలలో ప్రకాశం, గుంటూరు జిల్లాల పత్తి రైతుల ఆత్మహత్యలు ఈ నాటిక రూపొందటానికి దారితీశాయి. పాత్రలు, సన్నివేశాలూ, ఇతివృత్తం యథార్థ ఘటనల వాస్తవ చిత్రణ గనుక సహజత్వం ఉట్టిపడింది. నెల నెల వెన్నెలలో భాగంగా ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం ప్రదర్శించిన ఈ నాటిక ఆలోచింపజేసింది. పల్లెల నుండి పట్టణాల దాకా ఆంధ్ర రాష్ట్రమంతటా తిలకించిన ప్రేక్షక లోకాన్నంతటిని కంటతడి పెట్టించడమే గాక అంతరంగాల అట్టడుగున నిద్రాణమై వున్న రైతన్నల చైతన్యాన్ని తట్టిలేపింది. కుంభకర్ణుడి నిద్రనటిస్తున్న ప్రభుత్వాల చెంపలు చెళ్ళుమనిపించినట్లయింది. రైతుసంఘాల కృషి, జనతా దళ్ ప్రభుత్వం ఆసక్తి కలగలిసిన పర్యవసానంగా దేశమంతటా రూ.10 వేల లోపు రుణాల రద్దుకు దారితీసింది.

ఇతివృత్తంలోకి వెళ్తే..

కవిసార్వభౌముడైన శ్రీనాథుడు పల్లకీలో ప్రయాణిస్తూ మార్గమధ్యంలో వ్యవసాయం చేసుకుంటూ తటస్థపడ్డ తన బావమరిదియైన పోతనామాత్యుని తిలకించి చులకనగా, హేళనగా, వ్యంగ్యంగా కష్టజీవియైన పోతన్నను తప్పనిసరియై "హాలికులు-సేమమా" అని పరామర్శించాడు. సిరిసంపదల మాటున దాగివున్న శ్రీనాథుని అహంకారాన్ని ఎత్తిచూపుతూ అందుకు తగ్గ ప్రతి పరామర్శను గావించాడు పోతన్న.

ఆనాటికీ, ఈనాటికీ రైతాంగం అవహేళనలపాలవుతూనే వుంది. ఆనాటి రైతన్న పోతన్నను. తన కవితా కన్యకలను వెలగట్టి విక్రయించగా లభించిన సిరిసంపదలతో కళ్ళు మూసుకుపోయిన శ్రీనాథుడు చులకనజేసి మాట్లాడితే ఈనాటి పాలకులు, లంచగొండి అధికార గణాలు, కల్తీ వ్యాపారులు, వడ్డీ వ్యాపారులు, కలవారి కష్టాలు తప్ప మరేమీ కనిపించని మార్కెటింగ్ వ్యవస్థ, ఓటు, నోటు మాత్రమే ప్రపంచంగా భావించే కుహనా రాజకీయ నాయకులు తీయటి మాటలతో రైతాంగాన్ని ఆకాశానికెత్తుతూ నటనతో నయవంచనతో తమదోపిడీని నిర్దాక్షిణ్యంగా కొనసాగిస్తూ చట్టాలను చుట్టాలుగా చేసుకుని వారి ప్రాణాలనే హరించడానికి పూనుకుంటున్నారు.

ఆనాడు ప్రకాశం, గుంటూరు జిల్లాలకే పరిమితమైన పత్తి రైతుల ఆత్మహత్యలు ఈనాడు ఆంధ్రావని నంతటిని ఆవరించటంతో ఆగకుండా కర్నాటక, మహారాష్ట్ర, పంజాబ్ లాంటి అనేక రాష్ట్రాలకు విస్తరించి దేశవ్యాపిత స్వరూపాన్ని సంతరించుకున్నాయి. నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలు ఈ విస్తరణను మరింత వేగవంతం గావించి వందల సంఖ్యను అధిగమించి వేల సంఖ్య వైపు పరుగులెత్తిస్తున్నాయి.

చైతన్య రహితమైన ఈ ఆత్మహత్యలు సమస్యల పరిష్కారానికి సాధనాలు గావు. రైతాంగ వ్యతిరేక ప్రభుత్వ విధానాలకు నిరసనగా పోరాడుతూ మరణిస్తే అందులో ఎంతో కొంత పరిష్కారం ఇమిడి వుంటుంది. రైతాంగంలో గూడు కట్టుకుని సమస్యల పరిష్కారానికి ఆటంకంగా వున్న జడత్వాన్ని వదిలించి మౌలిక సమస్యల పరిష్కార దిశగా చైతన్యాన్ని రగిల్చి సమరోన్ముఖులను గావించవలసిన కర్తవ్యం ఈనాడు మరింత ఎక్కువగా ఈ నాటిక నిర్వర్తించవలసి ఉంది. ఇంతటి ఘోర విపత్తును సహితం పట్టించుకోకుండా అలవాటు ప్రకారం తమదోపిడీని నిర్దాక్షిణ్యంగానూ, యధేచ్ఛగాను కొనసాగించటానికి పూనుకుంటున్న దోపిడీదారుల గుండెల్లో ఈ నాటిక శక్తిమంతమైన చర్నాకోలగా, ముల్లుకర్రగా ముకుతాడుగా తన పాత్రను నిర్నిబద్ధంగా, నిర్దాక్షిణ్యంగా, నిస్సంకోచంగా పోషించి మరిన్ని



సత్ఫలితాలను సాధించవలసి వుంది. ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా కమిటీ సమర్పించిన ఈ నాటికలో పాత్రలు - పాత్రధారులు పోతురాజు ౦ చెరుకుమల్లి వెంకటేశ్వరరావు, అప్పారావు - నామ లక్ష్మీనారాయణ, ఫీల్డ్ ఆఫీసర్ - మారుతి కొండలరావు, అనంతమ్మ -శ్రీలేఖ కాగా మేకప్ - నాగు, మ్యూజిక్ రమణ, సెట్టింగ్ నాగు, సత్తిబాబు, పాట - సదానంద్, రచన - జరుగుల రామారావు, కొమ్మ ప్రసాద్ , దర్శకత్వం - కె దేవేంద్ర వహించారు. సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై. విక్రమ్, కళాపరిషత్ బాధ్యులు కుమార్, నాగబత్తిని రవి, విజేత, నిర్మల్ హృదయ్ స్కూల్ కరస్పాండెంట్ సాంబశివారెడ్డి తదితరులు ప్రసంగించారు.

చిన్నారిని ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-జూలూరుపాడు

జూలూరుపాడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్లంకి చిన్న నాగేశ్వరరావు మనవడి అన్నప్రాసన్న వేడుకలకు ఉద్యమకారుడు వేల్పుల నరసింహారావు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పోతురాజు నాగరాజు, మిరియాల కిరణ్‌కుమార్, కోట కుమార్ బాబు, మోదుగు గోవర్ధన్, వేల్పుల సన్నీ, పాత్రికేయులు (మోదు ప్రభాకర్), గ్రామస్తులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్‌లో ఇసుక అక్రమ రవాణా

- 2 ట్రాక్టర్లను పట్టుకున్న ఫారెస్ట్ అధికారులు

నవతెలంగాణ-లక్ష్మీదేవిపల్లి

మండలంలోని రేగళ్ల ఫారెస్ట్‌లో అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతుంది. రేగళ్లకు చెందిన కొందరు ట్రాక్టర్లను ఇసుక వ్యాపారానికి ఉపయోగిస్తున్నారు. రేగళ్ల అడవి ప్రాంతమంతా వైల్డ్ లైఫ్ జోన్లో ఉన్నప్పటికీ ఫారెస్ట్ అధికారుల కన్ను కప్పి ఇసుక వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. అయితే ఆదివారం అడవి ప్రాంతంలో ఇసుకను తీసుకొస్తున్న రెండు ట్రాక్టర్లను ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శంకర్ పట్టుకుని అదుపులో తీసుకున్నారు. మరో ట్రాక్టర్ డ్రైవరు తెలివిగా డాక్టర్ని తప్పించే ప్రయత్నం చేశాడు. ఆ టాక్టను సైతం పట్టుకొని కేసు నమోదు చేస్తామని బీట్ ఆఫీసర్ తెలిపారు. ఇదిలా ఉండగా ట్రాక్టర్ పట్టుకున్న సందర్భంలో ట్రాక్టర్ యజమానులు ఇసుకను ఒక దగ్గర అన్లోడ్ చేసి పరార్ అయినట్టు తెలుస్తుంది.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కి

శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థి

నవతెలంగాణ-మధిర

ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఖో ఖో పోటీలలో విశేషంగా రాణించి శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థిని దుర్గాభవాని రాష్ట్రస్థాయికి ఎంపికైంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో జరిగిన పోటీలలో అండర్ -17 ఖో ఖో బాలికల విభాగంలో శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ 10వ తరగతి విద్యార్థిని దుర్గా భవాని ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. అంజన బాబు తెలిపారు. బాలికకు పాఠశాల డైరెక్టర్ చిన్నకేసీ చందు ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్యార్థినిని రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యేలా చక్కని తర్ఫీదు అందించిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శివ, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఇన్ ఫార్మర్ నెపంతో గ్రామస్తుని చంపిన మావోయిస్టులు

సుకుమా జిల్లాలో ఘటన

నవతెలంగాణ-చర్ల

సరిహద్దు బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్ లో కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు బండారి తిరుపతి హత్య మరవక ముందే సుకుమా అడవుల్లో మళ్లీ మావోయిస్టులు రెచ్చిపోయారు. ఇన్ ఫార్మర్ నెపంతో గిరిజన వ్యక్తిని హతమార్చారు. ఆదివారం కిస్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మెటాగూడలో పోలీస్ ఇన్ ఫార్మర్ అనే అనుమానంతో దేవా అనే ఆదివాసీని మావోయిస్టులు మట్టు పెట్టారు. అయితే ఆదివారం సాయంత్రం వరకు కూడా పోలీసులు ఎటువంటి ధృవీకరణ చేయలేకపోయారు.

గిరిజన సమ్మేళనంను జయప్రదం చేయండి

నవతెలంగాణ-జూలూరుపాడు

గిరిజన సంఘం వ్యవస్థాపక నాయకులు గుగులోత్ ధర్మ నాయక్ వర్ధంతి సందర్భంగా నవంబర్ 5న ఖమ్మంలో జరిగే గిరిజన సమ్మేళనంను జయప్రదం చేయాలని గిరిజన సంఘం నాయకులు భానోత్ మధు, మాజీ ఎంపీటీసీ భానోత్ ఇశ్రా పిలుపునిచ్చారు. ఆదివారం కొమ్ముగూడెంలో గిరిజన సమ్మేళనం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి సంఘంలో వామపక్ష ఉద్యమానికి ఆకర్షితులై నాటి నుండి చివరి ప్రాణం పోయే వరకు ఆయన ప్రజా ఉద్యమాలు నిర్వహించారని గుర్తు చేసారు. ఆయన సేవలను స్మరించేందుకు ఆయన చేసిన సేవలను ప్రజలకు తెలియజేసేందుకు ఈ గిరిజన సమ్మేళనంను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ సమ్మేళనంలో గిరిజన సంస్కృతి, సంప్రదాయం నృత్యలు, భారీ స్థాయిలో ఉంటాయని గిరిజనులు పెద్ద స్థాయిలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు లకావత్ శ్రీను, భానోత్ రూప, భూక్యా బిచ్చు, భానోత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఆవాస్ యోజన అర్బన్ ఇండ్ల ఆడిటింగ్

- హౌసింగ్ ఈఈ శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలో పేదల కోసం నిర్మించిన ఇండ్ల ఆడిటింగ్ ప్రక్రియ పకడ్బందీగా జరుగుతుందని హౌసింగ్ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని హౌసింగ్ ఈఈ శ్రీనివాస రావు వైయస్సార్ నగర్ కాలనీ, మల్లెమడుగు లలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ పథకం భాగస్వామ్యంతో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ఆడిటింగ్ ప్రక్రియను కేంద్ర బృందాలతో కలిసి నిర్వహించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ క్రింద లబ్ధిదారులుగా ఎంపిక చేసి ఇండ్లు అందించిన వారి వివరాలను సేకరించి ఇంటింటికి తిరుగుతూ సమస్యలు ఏమైనా ఉన్నాయా, మౌలిక వసతులు కల్పన, ఇంటిలో ఉన్న లబ్ధిదారుల వివరాలు పోర్టల్ లోని వివరాలతో సరి చూస్తూ కేంద్ర బృందం ఆడిట్ నిర్వహించింది. వైయస్సార్ నగర్ లో నిర్మించిన 204 ఇండ్లు, మల్లెమడుగులో నిర్మించిన 106 ఇండ్లకు ఆడిటింగ్ ప్రక్రియ జరిగిందని తెలిపారు. ఆడిటింగ్ అనంతరం కేంద్ర బృందం లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడారు, కాలనీలో కల్పించిన సౌకర్యాలు వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఆడిటింగ్ బృందాలలో ఎస్టిఎం సాయి జ్ఞానేందర్, ఎస్ఆర్పి చెన్న కేశవులు, ఏపిసి అంజగౌడ్, టిడబ్ల్యుఐడి డిఇ బి. రాజు, ఆర్ అండ్ బి ఏఇఇ కె. లక్ష్మీనారాయణ, హౌజింగ్ సిఎల్టిసి సిరాజ్, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకురాలు సామ్రాజ్యం పోరాట యోధురాలు

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సిపిఐ నాయకురాలు, స్వాతంత్ర సమరయోధురాలు మందడపు సామ్రాజ్యం చిత్రపటానికి ఆదివారం సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళు లర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు సూర్యదేవర పామిదత్, పారుపల్లి రాఘవులు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఏనుగు గాంధీ, తూము రోషన్ కుమార్, సిపిఐ నాయకులు కొంగర రామారావు, పారుపల్లి నరసింహారావు, కొంగర కృష్ణయ్య మాజీ గ్రామ ఉపసర్పంచ్ పారుపల్లి కరుణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో సామ్రాజ్యం దశదినకర్మ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, గ్రామ మాజీ సర్పంచ్ కొంగర అప్పయ్య సహచరులుగా మందడపు పుల్లయ్య, మందడపు సామ్రాజ్యంలు గ్రామ అభివృద్ధిలో ఎనలేని కృషి చేశారన్నారు. గ్రామస్థాయిలో సిపిఐ పార్టీ నిర్మాణం కోసం, పార్టీ కార్యక్రమాల విజయవంతం కోసం కృషి చేశారన్నారు. పేదలు, కష్టజీవులు, దళితులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నత కోసం పోరాడారన్నారు. యువత కమ్యూనిస్టుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ శాఖ కార్యదర్శి గుడిద కృష్ణ, వంగాల నరసింహ, కొంగర కృష్ణయ్య, ఏలూరి రమేష్, చావా గోపాలకృష్ణ, సీపీఐ(ఎం) నాయకులు మందడపు శ్రీనివాసరావు, పారుపల్లి పూర్ణచంద్రరావు, మందడపు రామారావు, కాంగ్రెస్ నాయకులు గంగసాని రాఘవరావు, బీఆర్ఎస్ నాయకులు గాలి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే 'గ్రూప్-1' నిర్వహించాలి

- అభ్యర్థులపై లాఠీచార్జి దుర్మార్గం
- ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, నానబాల రామకృష్ణ

నవతెలంగాణ-ఖమ్మం

రాష్ట్రంలో జీవో నెంబర్ 55 ప్రకారమే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని, కోర్టు కేసులు లేకుండా అభ్యర్థులందరీ సమస్యలు పరిష్కరించి పకడ్బందీగా నిర్వహించాలని, యూపీఎస్సీ తరహాలోనే ప్రిలిమ్స్ హాల్ టికెట్ నెంబర్లతోనే మెయిన్స్ ఆన్సర్ బుక్లెట్స్ పై ముద్రించి పరీక్ష నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, నానబాల రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఖమ్మంలోని గిరి ప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం అవలంబిస్తున్న జీవో 29 ప్రకారం జనరల్ కోటాలో ఎంపికైన రిజర్వ్ అభ్యర్థిలకి జనరల్ కోటాలో పరిగణించకుండా రిజర్వ్ కోటాలో పరిగణించి ఇతర అభ్యర్థులు నష్ట పోకుండా ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ పోరాటం చేస్తున్న అభ్యర్థులపై కాంగ్రెస్ ప్రభుత్వం లాఠీ చార్జ్ చేయడం అమానుషమని అన్నారు. యూపీఎస్సీ తరహాలోనే ప్రిలిమ్స్ హాల్ టికెట్ నెంబర్లతోనే మెయిన్స్ ఆన్సర్ బుక్లెట్స్ పై ముద్రించి పరీక్ష నిర్వహించి, అభ్యర్థుల అనుమానాలు నివృత్తి చేయాలని, అలాగే ప్రిలిమ్స్ రాసిన ఓఎస్ఆర్‌లో 3000ఓఎస్ఆర్లు అదనంగా ఉన్నాయనే వాదనలు ఉన్నాయని ,వాటిని నివృత్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు మద్దోజు శ్రావణ్, వంశి, రాకేష్, ప్రతాప్, సునీల్, గోపి తదితరులు పాల్గొన్నారు.



29 జీవోను రద్దు చేయాల్సిందే...

- హైదరాబాద్‌లో ఆ ప్రతుల దహనం
- గ్రూప్-1 అభ్యర్థులపై లాఠీచార్జికి ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-1 అభ్యర్థులకు నష్టం చేసే జీవోనెంబర్ 29ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాల్సిందేనని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేశాయి. ఆదివారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో 29 జీవో ప్రతుల దహనం కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్షలో ప్రస్తుతం అవలంబిస్తున్న 29 జీవో ప్రకారం జనరల్ కోటాలో ఎంపికైన రిజర్వుడు అభ్యర్థులను జనరల్ కోటాలో పరిగణించకుండా రిజర్వుడు కోటాలోనే పరిగణించడంతో రిజర్వుడు అభ్యర్థులు నష్టపోతున్నారని అన్నారు. రాష్ట్రంలో 55 జీవో ప్రకారమే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కోర్టు కేసుల్లేకుండా అభ్యర్థులందరి సమస్యలు పరిష్కరించి పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. యూపీఎస్సీ తరహాలోనే ప్రిలిమ్స్ హాల్ టికెట్ నెంబర్లతోనే మెయిన్స్ ఆన్సర్ బుక్‌లెట్లపై ముద్రించి పరీక్ష నిర్వహించాలని సూచించారు. 29 జీవోను రద్దు చేయాలని కోరుతూ పోరాటం చేస్తున్న అభ్యర్థులను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ అరెస్టులు, పోలీసులు లాఠీచార్జీ చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ప్రశ్నిస్తున్న వారిపై నిర్బంధాలు ప్రయోగించకుండా సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. గ్రూప్-1 అభ్యర్థులకు నష్టం చేసే విధంగా ఉన్న 29 జీవోను తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దామెర్ల హష్మీబాబు, ఎండీ జావేద్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జె రమేష్, డీవైఎఫ్ఐ నాయకులు రవి, వీరేందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్ ఛేదన

- తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు
- భిక్షాటన కోసం కిడ్నాప్ చేసినట్టు సమాచారం



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి కిడ్నాపైన బాలుడు కేసును పోలీసులు ఛేదించారు. వివరాల్లోకి వెళ్తే.. ఆస్పత్రి నుంచి 18వ తేదీ అర్ధరాత్రి పన్నెండు గంటల తర్వాత మద్నూర్ మండలానికి చెందిన పిట్ల రాజు, లక్ష్మి కుమారుడు మణికంఠను ముగ్గురు మహిళలు కిడ్నాప్ చేసినట్టు సీసీ ఫుటేజీలో రికార్డయింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన అంజుమ్ బేగం, ఆమె పదేండ్ల కూతురు, దుర్గ ప్రభ రావుభ మోహితే.. హస్పిటల్‌కి వెళ్లి నిద్రలో ఉన్న లక్ష్మి కొడుకుని తీసుకుని పరారయ్యారు అనంతరం బస్టాండ్ దగ్గర ఆటో మాట్లాడుకొని ఎవరికి అనుమానం రాకుండా సిటీలో తిరుగుతూ రైల్వేస్టేషన్ చేరుకున్నారు. అక్కడ ట్రైన్ రాకపోయే సరికి ఎక్కువ సేపు ఉంటే ఎవరికైనా అనుమానం వస్తుందని అక్కడ నుంచి మళ్లీ నిజామాబాద్‌లో తిరుగుతూ, బోధన్ రోడ్డులోని నిర్మానుష ప్రాంతంలో ఉండి, నాందేడ్‌కి వెళ్లేందుకు అవకాశం కోసం చూస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం పోలీసులకు నమ్మదగిన సమాచారంతో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

వారి అదుపులో ఉన్న బాలున్ని తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుని చేత భిక్షాటన చేపించటం కోసం కిడ్నాప్ చేసినట్టు నిందితులు తెలిపినట్టు సీఐ రఘుపతి తెలిపారు. కేసును 36 గంటల్లో ఛేదించిన ఏఎస్ఐ షకీల్, కానిస్టేబుల్ గంగారాం, డబ్లూపీసీ అనుష, కానిస్టేబుల్ కేర్బాజి, రాములును అభినందించారు.

న్యాయమూర్తిపై విమర్శలు కోర్టు ధిక్కారం కాదు

- మద్రాసు హైకోర్టు

చెన్నై: జడ్జిపై విమర్శలు, పరువు నష్టం కోర్టు ధిక్కారంగా పరిగణించబడదని మద్రాసు హైకోర్టు పేర్కొంది. జస్టిస్ ఆనంద్ వెంకటేష్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన డీఎంకే నేత ఆర్ఎస్ భారతిపై దాఖలైన పిటిషన్‌ను తిరస్కరిస్తూ హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. యూట్యూబర్ సవుకు శంకర్ దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించారు.జస్టిస్‌లు ఎస్ఎం సుబ్రహ్మణ్యం, వి.శివజ్ఞానంతో కూడిన ధర్మాసనం విచారించింది. ఇలాంటి విమర్శలు కోర్టు పనితీరును మెరుగుపరుస్తాయని కూడా ధర్మాసనం అభిప్రాయపడింది.

టీజేఏసీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా హర్షవర్ధన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గం ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి (టీజేఏసీ) ఎమ్మెల్సీ అభ్యర్థిగా గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పోటీ చేయనున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీజేఏసీ చైర్మెన్ ఎం మణిపాల్‌రెడ్డి, సెక్రెటరీ జనరల్ పర్వతి సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం, మంత్రులు, టీపీసీసీ అధ్యక్షులకు ఈ ఏకగ్రీవ తీర్మానాన్ని సమర్పిస్తామని చెప్పారు. కాంగ్రెస్ నుంచి త్వరలోనే సానుకూల నిర్ణయం వస్తుందన్నారు. హర్షవర్ధన్‌రెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటిస్తే క్షేత్రస్థాయిలో పనిచేసి గెలిపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఏసీ నాయకులు ఎండీ అబ్దుల్లా, ఉమాకర్‌రెడ్డి, శ్రీవాణి, వెంకట్రావు నాయక్, గురుకుల ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీనివాస్ మాలోత్, మోతీలాల్, నజీరుద్దీన్, రాజు జాదవ్, మురళీగౌడ్, ప్రభాకర్, అంజయ్య, లక్ష్మణ్, కృష్ణయ్య, ఎం రమేష్, నరేందర్‌రెడ్డి, టి సత్యనారాయణ, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ. 6 కోట్ల విలువైన హెరాయిన్ స్వాధీనం

గువహాటి : రూ.6 కోట్ల విలువైన హెరాయిన్‌ను అస్సాం పోలీస్‌కి చెందిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టిఎఫ్) స్వాధీనం చేసుకుంది. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు శనివారం ప్రకటించింది. మణిపూర్‌లోని కాంగ్‌పోక్సీ నుండి అస్సాంలోని దిగువ జిల్లాలకు సరఫరా చేస్తున్న ఈ ముఠాను అదుపులోకి తీసుకున్నామని, డ్రగ్స్ ట్రాఫికింగ్‌ను ఛేధించినట్లు ఎస్‌టిఎఫ్ పేర్కొంది. శనివారం రాత్రి ముర్తాజా అహ్మద్ అలియాస్ భూలు టాటా నెక్సాన్‌లో ప్రయాణిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. తనిఖీ చేయగా 49 సబ్బు పెట్టెల్లో అక్రమంగా తరలిస్తున్న 637 గ్రాముల హెరాయిన్‌ను గుర్తించారు. వీటి విలువ రూ. 6 కోట్లు ఉంటుందని అంచనా. ముర్తాజా అహ్మద్‌ను అరెస్ట్ చేసిన అనంతరం డోక్మాకు చెందిన ప్రశాంత్ అనే మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

ఉత్తర గాజాలో భీకర దాడులు

- హిజ్బుల్లా ఇంటెలిజెన్స్ ప్రధాన కార్యాలయంపై బాంబుల వర్షం
- ముగ్గురు కమాండర్లు సహా 76 మంది మృతి



బీరుట్ /గాజా సిటీ : ఇజ్రాయెల్ సైన్యం లెబనీస్ రాజధానిలోని ఇంటెలిజెన్స్ ప్రధాన కార్యాలయం, భూగర్భ ఆయుధాల తయారీ కేంద్రంపైన, ఉత్తర గాజాపైన ఇజ్రాయిల్ క్రూరమైన వైమానిక దాడులు జరిపి ముగ్గురు హిజ్బుల్లా కమాండర్లతో సహా 76 మందిని పొట్టనబెట్టుకుంది. లెబనాన్‌పై జరిపిన దాడిలో హిజ్బుల్లా సదరన్ కమాండ్‌లోని టాప్ కమాండర్ అల్హాజ్ అబ్బాస్ సలేం, కమ్యూనికేషన్స్ స్పెషలిస్ట్ రడ్డా అబ్బాస్ అవ్వే, హిజ్బుల్లా వ్యూహాత్మక ఆయుధాల అభివృద్ధిని పర్యవేక్షిస్తున్న అహ్మద్ అలీ హుస్సేన్ చనిపోయినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. ఇరాన్-మద్దతుగల బందం తన నివాసాన్ని లక్ష్యంగా చేసుకుని తనను హత్య చేసేందుకు ప్రయత్నించిందని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు ఆరోపించిన కొద్ది సేపటికే హిజ్బుల్లా దక్షిణ బీరుట్ కోటపై భీకర దాడులు జరిగాయి. అదే సమయంలో ఉత్తర గాజాలో బీట్ లాహియాపై జరిపిన ఈ దాడుల్లో 73 మంది పాలస్తీనియన్లు చనిపోయారు. . గాజా, లెబనాన్‌లలో మొత్తం 175" లక్ష్యాలపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు చేసింది. "నన్ను , నా భార్యను హత్య చేసేందుకు ఇరాన్ అనుబంధ సంస్థ హిజ్బుల్లా చేసిన ప్రయత్నం ఘోర తప్పిదం" అని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు అన్నారు. ఇజ్రాయెల్ దళాలు బుధవారం గాజాలో పాలస్తీనా ఉద్యమ నాయకుడు యాహ్యా సిన్వార్‌ను హతమార్చిన తర్వాత ఈ ప్రాంతంలో హమాస్, హిజ్బుల్లా, ఇరాన్-మద్దతుగల గ్రూపులు తమ శత్రువుపై పోరాటం కొనసాగుతుందని ప్రకటించాయి.

పాలస్తీనాలో హమాస్ అనేది ఎవరూ విస్మరించలేని వాస్తవం, దానిని ఎవరూ నాశనం చేయలేరు" అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘి అన్నారు.


ఇజ్రాయెల్ ఉత్తర గాజాలో రెండు వారాల్లో 450 మందిని పొట్టనబెట్టుకుంది.. దీంతో గాజాలో మొత్తం మరణాల సంఖ్య 42,519కి చేరుకుంది. జబాలియాలోని సహాయక శిబిరంపై జరిగిన దాడిలో 10 మంది మరణించారు.

హిజ్బుల్లా టన్నెల్ నెట్‌వర్క్‌పై ఇజ్రాయిల్ గురి కొన్ని కిలోమీటర్ల పొడవైన సొరంగాల నెట్‌వర్క్‌ను ఇజ్రాయిల్ సైన్యం గుర్తించింది. వీటిలో వందలాది మంది హిజ్బుల్లాలు తలదాచుకోవచ్చు.. ఇక్కడ అవసరమైన ఆహార పదార్థాలను నిల్వ చేస్తారు. నీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తారు. ఆయుధాలను పంపిణీ చేసే సదుపాయం కూడా ఉంది. సొరంగాలను ధ్వంసం చేసేందుకు లేదా వాటిని సిమెంటుతో కప్పేందుకు ప్రయత్నిస్తున్నారని ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ అధికారి ఒకరు తెలిపారు.2006లో ఇజ్రాయెల్‌తో జరిగిన యుద్ధంలో హిజ్బుల్లా తొలిసారిగా సొరంగాలను ఉపయోగించింది. తర్వాత ఆ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసింది. ట్రక్కులు క్షిపణులుగా వెళ్లగల భారీ సొరంగాల వీడియోలను హిజ్బుల్లా విడుదల చేసింది.

పోటెత్తుతున్న వరద



శ్రీశైలం లో 6 గేట్లు ఎత్తివేత



నాగార్జునసాగర్ లో 20 గేట్లు ఎత్తివేత

జీవో 29తో ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల నోట్లో మట్టి

- సీఎం రేవంత్‌రెడ్డి మూర్ఖంగా మాట్లాడుతున్నారు
- బండీ..దమ్ముంటే సుప్రీంలో సీనియర్ లాయర్‌ను పెట్టించి వాదించు : దాసోజు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం జీవో 29 ద్వారా గ్రూపు-1 ప్రిలిమినరీ క్వాలిఫై అయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల నోట్లో మట్టికొట్టిందని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇంత జరుగుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి మొండిగా, మూర్ఖంగా మాట్లాడుతున్నారనీ, ఆయన అత్తెసరు చదువు చదువుకున్నారని విమర్శించారు. టీజీపీఎస్సీ చైర్మెన్ మహేందర్‌రెడ్డి, సీఎం కలిసి గ్రూపు-1 అభ్యర్థులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. బండి సంజయ్‌కి ఫోన్ చేసిన రేవంత్‌రెడ్డి గ్రూపు-1 అభ్యర్థులను ఎందుకు కలవరని నిలదీశారు. బండి సంజయ్‌కి, రేవంత్‌రెడ్డికి మధ్య సంబంధమేంటి? కేటీఆర్‌ను టార్గెట్ చేయాల్సిన అవసరం సంజయ్‌కి ఎందుకొచ్చింది? అని ప్రశ్నించారు. కార్పోరేటర్ మనస్తత్వాన్ని బండి సంజయ్, జెడ్పీటీసీ మనస్తత్వాన్ని రేవంత్‌రెడ్డి వీడటం లేదని విమర్శించారు. గ్రూపు-1 ప్రిలిమినరీలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. 60 ఉద్యోగాలను అదనంగా కలిపి 563 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. దానికిగానూ 28,150 మందినే షార్ట్ లిస్టు చేయాలన్నారు. ఎవరికోసం ఈ హడావిడి పరీక్ష అని ప్రశ్నించారు. ఎన్టీఆర్ కంటే రేవంత్‌రెడ్డి గొప్పోడు కాదనీ, గతంలో ఎన్టీఆర్ ఇచ్చిన జీవోను 24 గంటల్లో వెనక్కి తీసుకున్నారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చేలోపు జీవోను రద్దు చేసి పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. రెండు నెలలు ఆలస్యమైతే ఇబ్బందేంటి? అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. అగ్రకుల మనస్తత్వంతో మహేందర్ రెడ్డి వ్యవహరిస్తున్నారనీ, కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. జీవో 55 అందరికీ న్యాయం చేస్తుందన్నారు. రాష్ట్రంలో తుగ్లక్ పాలన నడుస్తున్నదనీ, రేవంత్‌రెడ్డి మూర్ఖత్వానికి మంత్రులు సమాధానాలు చెప్పాలని ప్రశ్నించారు.

గ్రూప్-1 అభ్యర్థులను..

స్వార్థం కోసం వాడుకోవడం దుర్మార్గం

- నాడు నిరుద్యోగుల గోడు పట్టని బీఆర్ఎస్ : టీజేఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించుమన్నందుకే అరెస్టులు చేసి, నిర్బంధాలు అమలు చేసిన నిరంకుశ ప్రభుత్వ నేతలు.. నేడు నిరుద్యోగ గ్రూప్ వన్ అభ్యర్థులను తమ స్వార్థం కోసం వాడుకోవడం దుర్మార్గమని టీజేఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలన విధ్వంసాన్ని తెలంగాణ సమాజం అనుభవించిందని, వాటి తాలూకు శిథిలాల నడుమ తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణం జరుగుతున్నదని అన్నారు. నిజామాబాద్ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో టీఎన్జీవో భవనంలో ఆదివారం కోదండరామ్‌కు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ నియంతృత్వ పోకడలో ధ్వంసమయిన ప్రభుత్వ వ్యవస్థలు గాడిన పడుతున్నాయని అభివర్ణించారు. ఒక నియంత దశాబ్దాపు పాలన పాపాలపుట్టగా మారినవైనం తెలంగాణ ప్రజల కండ్ల ముందు కదలాడుతోందని, పాపాల భైరవుల నిజ స్వరూపం తెలంగాణ ప్రజలు గమనిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రం కోసం అమరులైన వారి కుటుంబాలకు అడుగడుగున అన్యాయమే జరిగిందని, ఆ అన్యాయాన్ని సరిదిద్దాల్సిన బాధ్యత ప్రజాస్వామికవాదులపై ఉన్నదని అన్నారు. ఒక వ్యక్తితో తెలంగాణ రాలేదని ప్రజాశక్తితోనే రాష్ట్రం సాకారం అయిందని తెలిపారు. తెలంగాణ జేఏసీ చైర్మన్, సీనియర్ న్యాయవాది గోపాల్ శర్మ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయం ప్రభుత్వ నీటిపారుదల శాఖ స్థలంలో నిర్మించారని, ఆ అక్రమ కట్టడాన్ని కూల్చివేయించే కార్యక్రమం ప్రజలు చేస్తారని తెలిపారు. జేఏసీ నేతలు వి.ప్రభాకర్, గైని గంగరామ్ ప్రసంగిస్తూ.. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో, అమరుల త్యాగాలతో సాధించుకున్న స్వరాష్ట్రంలో కేసీఆర్ పదేండ్ల పాలన చేదునే మిగిల్చిందని, ప్రజాస్వామికవాదులు కోరుకున్న తెలంగాణ కానరాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు భాస్కర్, డాక్టర్ రవీంద్ర నాథ్ సూరి, పీఓడబ్ల్యూ నాయకులు గోదావరి, నసీర్, డాక్టర్ మోహన్, ఆశా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో హైదరాబాద్-యాదాద్రి ఎంఎంటీఎస్ పనులు

- కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి జి.కిషన్ రెడ్డి
- చర్లపల్లి రైల్వే టెర్మినల్ సందర్శన

నవతెలంగాణ-కాప్రా



హైదరాబాద్-యాదాద్రి ఎంఎంటీఎస్ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్, రైల్వే అధికారులతో కలిసి ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నాలజీతో నిర్మాణం చేశామని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి తెలంగాణకు రైల్వేల విషయంలో అన్యాయం జరిగిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక నూతన రైల్వే లైన్ల నిర్మాణంలో చొరవచూపి అభివృద్ధి చేస్తున్నదని తెలిపారు. హైదరాబాద్‌లో సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడతోపాటు అదనంగా చర్లపల్లి నాలుగో నూతన రైల్వే స్టేషన్‌గా రాబోతుందని తెలిపారు. దాంతో నగరంలో ట్రాఫిక్ తగ్గుతుందని చెప్పారు. ప్రధాని నేతృత్వంలో ఈ రైల్వే స్టేషన్‌ను తక్కువ సమయంలో నిర్మించామని, ఇప్పటికే 98 శాతం పూర్తయ్యిందని తెలిపారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ నిర్మాణానికి రూ. 430 కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. రైల్వే ట్రాక్ నిర్మాణంతో పాటు కొత్త టెక్నాలజీతో అన్ని సదుపాయాలు కల్పించామన్నారు.

చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి వెళ్లడానికి కనెక్టివిటీ రోడ్లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. భరత్ నగర్, మహాలక్ష్మీ నగర్ వైపున 80 అడుగుల మేర రోడ్లు కావాలని సూచించారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ తయారు చేసిందని, వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో రైల్వే ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రధాని మోడీ రైల్వే కవచ్ వ్యవస్థను తెలంగాణలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారని, అందుకు ప్రధానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వందే భారత్ రైళ్లు డిల్లీ తర్వాత తెలంగాణలోనే ఎక్కువగా ఉన్నాయన్నారు. త్వరలో వందే భారత్ రైళ్లలో స్లీపర్ కోచ్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణలో అమృత్ పథకం కింద 40 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని, రూ. 715 కోట్లతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను, రూ. 429 కోట్లతో నాంపల్లి రైల్వే స్టేషన్‌ను, రూ. 430 కోట్లతో చర్లపల్లి రైల్వే స్టేషన్‌లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అలాగే రూ. 521 కోట్లతో కాజీపేట్‌లో రైల్ మ్యానుఫాక్చర్ యూనిట్‌ను ప్రారంభించినట్టు చెప్పారు. తెలంగాణలో 346 కిలోమీటర్ల మేర రైల్వే లైన్లతో పాటు 369 కిలోమీటర్ల మేర సింగిల్, డబుల్ లైన్లను నిర్ణయించామన్నారు.



ఈ పేలుళ్లకు కేంద్రమే బాధ్యత వహించాలి

ఢిల్లీ సీఎం అతిశి సింగ్

రోహిణి : ప్రశాంత్ విహార్‌లోని సిఆర్‌పిఎఫ్ స్కూల్ సమీపంలో జరిగిన పేలుడు ఘటనపై ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశి సింగ్ కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఈ పేలుళ్లతో రాజధానిలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని, ఢిల్లీ పోలీసులు కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ అధీనంలో పనిచేస్తున్నందున దీనికి కేంద్రమే కారణమన్నారు..ఢిల్లీలో శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యత బీజేపీ నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై ఉంది.

అయితే, బిజెపి దీనిని పట్టించుకోకుండా ఢిల్లీలో ఎన్నికైన ప్రభుత్వాల పనితీరును అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది. అందువల్ల, ఢిల్లీ ప్రస్తుత పరిస్థితి ముంబైలోని అండర్ వరల్డ్ రోజుల మాదిరిగానే ఉంది. కాల్పులు, ముఠాలు డబ్బులు దండుకుంటూనే ఉన్నాయి. దాన్ని అడ్డుకునే ఉద్దేశం గానీ, సామర్థ్యం గానీ బిజెపి ప్రభుత్వానికి లేదని అతిశి ఎక్స్‌లో పేర్కొన్నారు.

రజకులకు రక్షణ చట్టం చేయాలి

- టీఆర్‌వీఎస్ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రజకులకు రక్షణ చట్టం చేసి భద్రత కల్పించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం (టీఆర్‌వీఎస్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. టీఆర్‌వీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడిరాజు నరేష్ అధ్యక్షతన ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్లలో రజకులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఉచిత విద్యుత్ ఎల్‌టీ-2 నుంచి ఎల్‌టీ-4 కేటగిరీకి మార్చాలని పేర్కొన్నారు. బీసీ రుణాలు వ్యక్తిగతంగా రూ.10 లక్షలు, సొసైటీకి రూ.30 లక్షలు ఇవ్వాలని సూచించారు. 50 ఏండ్లు నిండిన రజక వృత్తిదారులకు వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో దోబీ పోస్టులను రజకులతో భర్తీ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సి మల్లేష్, ఎం బాలకృష్ణ, జ్యోతి ఉపేందర్, ఎదునూరి మదర్, సహాయ కార్యదర్శులు పాయిరాల రాములు కొత్త నవీన్‌కుమార్, చంద్ల కుమారస్వామి, గోపాల్, సోషల్ మీడియా కన్వీనర్ పి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 29 ఉపసంహరించుకోవాలి

- గ్రూపు-1 పరీక్షను రీ షెడ్యూల్ చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి బండి లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంతాలకు, పట్టింపులకు పోకుండా జీవో 29ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ కోరారు. ఆదివారం ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. సోమవారం పరీక్ష ఉన్నా ఆదివారం కూడా అభ్యర్థులు ఆందోళన కొనసాగిస్తున్నారంటేనే దాని తీవ్రత ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగులంతా కుటుంబ సభ్యులుగా భావించి వారి ఆవేదనను అర్థం చేసుకోవాలని విన్నవించారు. గ్రూపు-1 పరీక్షను రీ షెడ్యూల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. జీవో 29 వల్ల గ్రూపు-1 పరీక్షల్లో 5003 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు అనర్హులయ్యారని తెలిపారు. 563 పోస్టులకు గుండుగుత్తగా 1:50 చొప్పున అభ్యర్థులను ప్రకటించడం అన్యాయమని పేర్కొన్నారు. అందులో 354 పోస్టులు రిజర్వుడు కేటగిరీలో ఉన్నాయని తెలిపారు. జీవో 29 వల్ల ఓపెన్ కేటగిరిలో అర్హత సాధించిన వారినీ రిజర్వుడు కేటగిరీలో చేర్చడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ జీవోవల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు 1:50 చొప్పున అర్హత సాధిస్తే.... ఓసీలు1:65 శాతం మేరకు అర్హత సాధించారని వివరించారు. జీవో నెంబర్ 29 రాజ్యాంగ స్ఫూర్తికి, రూల్ ఆఫ్ రిజర్వేషన్ కు వ్యతిరేకమని పేర్కొన్నారు. 29 జీవో వల్ల రాష్ట్రంలో మొత్తం రిజర్వేషన్ల వ్యవస్థనే రద్దు చేయబోతున్నారనే చర్చ మొదలైందని తెలిపారు. తక్షణమే దాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

నేటినుంచి 'ఎస్ఏ-1' పరీక్షలు

నవతెలంగాణ 8 - హైదరాబాద్

రాష్ట్రంలో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ-1) పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 28 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఇందుకు సంబంధించి అకడమిక్ క్యాలెండర్‌లోనూ ఎస్ఏ-1 పరీక్షల నిర్వహణ వివరాలను ప్రభుత్వం ప్రకటించింది. నవంబర్ రెండున జవాబుపత్రాల మూల్యాంకనం చేసి ఫలితాలను ప్రకటించాలని విద్యాశాఖ షెడ్యూల్‌ను రూపొందించింది. అదేనెల ఐదున విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయాలని తెలిపింది. అదేనెల 16న తల్లిదండ్రులు, టీచర్ల సమావేశాన్ని నిర్వహించాలనీ, విద్యార్థుల మార్కులు, వారి ప్రతిభపై చర్చించాలని కోరింది.

కార్మిక వర్గాన్ని ఐక్యంగా నిలబెట్టటమే తక్షణ కర్తవ్యం

- కేంద్ర ప్రభుత్వ విధానాలను నిలువరించాలి : టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనం సందర్భంగా జాతీయ ఉపాధ్యక్షులు అలీక్ చక్రవర్తి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కార్మిక వర్గాన్ని ఐక్యంగా నిలబెట్టటమే ట్రేడ్ యూనియన్ల తక్షణ కర్తవ్యమని టీయూసీఐ జాతీయ ఉపాధ్యక్షులు అలీక్ చక్రవర్తి అన్నారు. ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ)లో ఐఎఫ్‌టీయూ విలీనమైన సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక చట్టాలను నవీనీకరణ చేస్తున్నామనే సాకుతో 29 కార్మిక, ప్రయోజన సంక్షేమ చట్టాలను "4 లేబర్ కోడ్‌లు"గా మార్చిన కేంద్ర ప్రభుత్వం... కార్మిక హక్కులను హరించేందుకు యత్నించిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేస్తేనే సహించని అనేక యజమాన్యాలు నేటికీ దేశంలో ఉన్నాయని చెప్పారు. తమిళనాడులోని శాంసంగ్ కంపెనీ కార్మికులు యూనియన్ ఏర్పాటు చేసుకుంటే వారిని విధుల్లోంచి తొలగించారని గుర్తు చేశారు. ఆ విధంగా ప్రభుత్వాలు యజమాన్యాలకు వత్తాసుగా మారి, కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న నేపథ్యంలో ఆ వర్గం మరింత ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరముందని ఆయన పిలుపునిచ్చారు. టీయూసీఐ జాతీయ ఉపాధ్యక్షులు ఉమాకాంత్ మాట్లాడుతూ తెలంగాణలోని అనేక రంగాల్లో పనిచేస్తున్న ఐఎఫ్‌టీయూ... టీయూసీఐలో విలీనం కావటం ఆహ్వానించదగిందన్నారు. ప్రస్తుతం దేశంలోని కార్మికులు చాలీచాలని జీతభత్యాలు, భద్రతలేని బతుకులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమజీవులకు సరైన భద్రత, శ్రమకు తగ్గ వేతనాలు, హక్కుల అమలు కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆ పోరాటాలు సంఘటితంగా ఉంటేనే ప్రభుత్వాలు తలొగ్గుతాయని నొక్కి చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ...కేంద్రలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కార్మికవర్గం మరింత ఐక్యంగా, సమరశీలంగా పోరాటాలు నిర్వహించాల్సిన అవసరముందని సూచించారు. ఇందుకోసం ట్రేడ్ యూనియన్లు వారిని మరింత చైతన్యపరచాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో టీయూసీఐ జాతీయ కార్యదర్శి దేవవ్రత శర్మ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్, హెచ్ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి రెబ్బా రామారావు తదితరులు పాల్గొని ఐక్య ఉద్యమాల ప్రాధాన్యతను వివరించారు.

కూరలో నూనె ఎక్కువైతే...

కూరలో నూనె, మసాలాలు వేసినపుడే ఆ వంటకం రుచికరంగా ఉంటుంది. ఘుమఘుమలాడుతూ మంచి ఫ్లేవర్ వస్తుంది. ఇవి లేకుండా వండితే ఆ కూర రుచీపచీ లేకుండా చప్పగా ఉంటుంది. అయితే నూనె, మసాలాలు వంటకాల రుచిని ఎలాగైతే మెరుగుపరుస్తాయి, వాటి మోతాదు ఎక్కువైతే రుచిని దెబ్బతీయడమే కాకుండా మీ ఆరోగ్యాన్ని పాడుచేస్తాయి. వంటచేసినపుడు అప్పుడప్పుడూ ఇలాంటి పొరపాట్లు జరగటం సహజం. కానీ, ఎంతో కష్టపడి వండిన వంట చిన్న కారణంగా రుచి కోల్పోతే చాలా బాధగా అనిపిస్తుంది.



అయితే కూరలో ఉప్పు ఎక్కువైందని, కారం ఎక్కువైందని లేదా మసాలాలు నూనెలు ఎక్కువయ్యాయని చింతించాల్సిన అవసరంలేదు. వాటిని పక్కన పెట్టాల్సిన అవసరం కూడా లేదు. కొన్ని చిట్కాలు పాటించడం ద్వారా కూరను మళ్లీ రుచికరంగా మార్చవచ్చు.

వంటల్లో నూనె, ఉప్పు, సుగంధాల డోస్ ఎక్కువైతే, ఎలా సరిచేయాలో ఇప్పుడు తెలుసుకోండి.

బంగాళాదుంపలు కలపండి

మీరు చేసిన కూరలో ఉప్పు లేదా నూనె ఎక్కువ అయితే అందులో బంగాళదుంప ముక్కలను వేసి, బాగా కలిపి ఆపైన మూతపెట్టి కొన్ని నిమిషాలు ఉడికించాలి. ఈ బంగాళాదుంప ముక్కలు మీ కూరలోని అదనపు నూనెను, ఉప్పును గ్రహిస్తాయి దీంతో మసాలా నిష్పత్తి సమానమవుతుంది.

టమాటో ప్యూరీ కలపండి

మీరు చేసిన కూరలో నూనె ఎక్కువైందా? పైకి తేలిన నూనెను తొలగించిన తర్వాత కూడా ఇంకా నూనె అలాగే ఉందా? ఇలాంటి పరిస్థితుల్లో కూరలో కొద్దిగా టమాటో ప్యూరీ కలిపి ఉడికించాలి. ఇది అదనపు నూనెను గ్రహించి కూరలోని నూనెను సరిచేస్తుంది. రుచి కూడా పెరుగుతుంది. మీరు డీప్ ఫ్రై కర్రీలకు కూడా టొమాటో ప్యూరీ చిట్కాను ఉపయోగించవచ్చు. డీప్ ఫ్రైలలో నూనె, మసాలాలు ఎక్కువైతే ఆ నూనెను ఒక గిన్నెలోకి వంచేయండి. ఆపై ఆ నూనెలో టొమాటో ప్యూరీ వేయించండి. ప్యూరీ ఉడికిన తర్వాత అందులో మిగతా కూరను వేసి కలపండి, సెట్ అవుతుంది.

శనగపిండి

ఏదైనా ఫ్రై కూరల్లో నూనె ఎక్కువగా ఉంటే, దాని నుంచి నూనెను తొలగించలేకపోతే, శనగపిండిని లైట్‌గా వేయించి కలపండి. ఆపైన ఆ కూరను చిన్న మంటపై ఉంచి కాసేపు ఉడికించాలి. ఇప్పుడు ఈ శనగపిండి ఆ కూరలోని అదనపు నూను గ్రహించి కూరగాయలపై పూతగా ఏర్పడుతుంది. ఇది మీ ఫ్రై కూరను మరింత క్రిస్పీగా మార్చుతుంది, రుచిని మరింత పెంచుతుంది.

బ్రెడ్ లేదా టోస్ట్

కూరలో నూనె ఎక్కువైతే పొడిగా కాల్చిన బ్రెడ్ ముక్కలను లేదా టోస్ట్ లను కలపండి. అవసరం అయితే వేడిచేయండి. కూరలోని అదనపు నూనెను బ్రెడ్ గ్రహిస్తుంది, రుచిని సమానంగా ఉంచుతుంది. నూనె గ్రహించిన బ్రెడ్ ముక్కలను తీసేసి కూరను మీ ఆహారంగా తీసుకోవచ్చు. ■

మీ భావాలను పంచుకోండి

మన గురించి మనం ఆలోచించుకోవడమంటే సెల్ఫిష్‌నెస్ అనుకుంటారు చాలా మంది మహిళలు. అలా ఆలోచించడమంటే ఏదో పెద్ద తప్పు చేసేసిన్నట్టు విపరీతంగా ఫీలైపోతుంటారు. అయితే మన గురించి, మన ఆనందం గురించి, మన ఆరోగ్యం గురించి పట్టించుకుంటేనే మన కుటుంబం బాగుంటుందనే చిన్న విషయాన్ని గుర్తించరు. మీరు ఆనందంగా ఉంటేనే మీ కుటుంబం ఆనందంగా ఉంటుంది. మీరు ఆరోగ్యంగా ఉంటేనే మీ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది. ఇది గుర్తించినప్పుడు మహిళలు తమ గురించి తాము పట్టించుకుంటారు. ఈ విషయాల గురించి ఈ రోజు మన ఉమెన్ హెల్త్‌లో మాట్లాడుకుందాం...





మహిళల విషయంలో సెల్ఫ్‌లవ్, సెల్ఫ్ కేర్, సెల్ఫ్ అవేర్‌నెస్ అనే ఈ మూడు ఎమోషన్స్ వెల్‌బీయింగ్ కొరకు, సంపూర్ణ ఆరోగ్యం కొరకు అత్యంత ముఖ్యమైన అంశాలు. సర్వసాధారణంగా స్త్రీల విషయంలో, నిజ జీవితంలో సెల్ఫ్ లవ్‌ని, సెల్ఫ్ కేర్‌ని సెల్ఫిష్‌నెస్‌తో కన్ఫ్యూస్ అవుతూ ఉంటారు. తమ గురించి కేర్ తీసుకోవడానికి, తమకు ఇష్టమైన పనులు చేయడానికి, ఆనందం పొందడానికి మహిళలు గిల్టీ ఫీల్ అవుతుంటారు. ఈ ఆలోచనా విధానం చాలా తప్పు. ఇది మిమ్మల్ని చాలా ఇబ్బందులకు గురిచేస్తుంది. మనకు నచ్చిన, మనకు అవసరమైన విషయాలపైన దృష్టిపెట్టడం, వాటి కోసం సమయం వెచ్చించడం అతి ముఖ్యమైన, అత్యవసరమైన అంశం. మన సంపూర్ణ ఆరోగ్యం కొరకు ఇది చాలా అవసరమని గుర్తుపెట్టుకోవాలి.

ధైర్యంగా చెప్పండి

ప్రతి దానికి ఒక సున్నితనమైన boundary ఉంటుంది. ఆ boundaries ని అర్థం చేసుకోని ఇతరులను ఇబ్బంది పెట్టే ఉద్దేశ్యం లేకుండా కేవలం మన Well being కొరకు మన Self love and Self Care practise చేయాలి. ఇది అంత సులువైన విషయం కాదని నేను పూర్తిగా అంగీకరిస్తాను. కానీ మనం చిన్న చిన్న అడుగులు వేస్తూ సున్నితమైన(Gentle), గంభీరమైన (Firm) కంఠంతో మన ఉద్దేశాలను, మన మనసులోని మాటలను స్పష్టంగా వ్యక్తపరుస్తూ ధైర్యంగా అడుగులు వేస్తూ మన ఆరోగ్యం కొరకు, మన కుటుంబ ఆరోగ్యం కొరకు సెల్ఫ్ లవ్, సెల్ఫ్ కేర్ ప్రాక్టీస్ చేయడం ఎంతో అవసరం.

ఉమెన్ హెల్త్

అంచనాలు ఎక్కువ

ఉదాహరణల ద్వారా ఈ అంశాలను మరింత స్పష్టంగా, లోతుగా అర్థం చేసుకోవచ్చు. మన సంస్కృతిలో స్త్రీలను, ముఖ్యంగా మాతృమూర్తులను ఎంతో ఉన్నతంగా చూస్తూ ఉంటారు. అయితే ఈ ఉన్నతంగా చూడటంతో పాటు ఎన్నో బరువు, బాధ్యతలు, అంచనాలు కూడా వారిపై రుద్దబడుతున్నాయి. ఎంత చేసినా ఇంకా ఆశిస్తూనే ఉంటారు. వారి ఎన్నో త్యాగాలు చేయాలని ఆశిస్తుంటారు. వారు నిరంతరం విశ్రాంతి లేకుండా పని చేస్తున్నా దానికి సరైన గుర్తింపు కూడా ఉండదు.

అమ్మ ఆరోగ్యంగా ఉంటేనే

నేను చెప్పదలచుకుంది ఏమిటంటే స్త్రీలను దేవతలుగా పూజించనక్కర్లేదు. నీచంగా చూడనక్కర్లేదు. వారిని తోటి మానవులుగా చూడడం, వారి అవసరాలను గుర్తించడం ముఖ్యం. ఇది ప్రతి ఒక్కరికీ వర్తిస్తుంది. నేను నా ప్రాక్టీస్‌లో చాలామందిని గమనించాను. చాలా మంది జంటల్లో ఈ ధోరణి కనిపిస్తుంది. వారు వారి ఆరోగ్యానికి అసలు ప్రాముఖ్యం ఇవ్వరు. కుటుంబ ఆరోగ్యమే తమ ఆరోగ్యంగా భావిస్తుంటారు. కానీ వాస్తవానికి స్త్రీ అనగా అమ్మ ఆరోగ్యమే కుటుంబాన్ని మొత్తం ఆరోగ్యంగా ఉంచగలుగుతుంది.

ప్రాక్టీస్ మొదలుపెట్టండి

ఇది నాకు బాగా తెలుసు. ఎందుకంటే నేను నా చిన్నతనంలో మానసికంగా, శారీరకంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నాను. మా అమ్మ అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడడం స్వయంగా చూశాను. అసలు విషయం ఏమిటంటే సెల్ఫ్ లవ్, సెల్ఫ్ కేర్ – సెల్ఫిష్‌నెస్ ఒకటి కాదు. దీన్ని సరిగా అర్థం చేసుకొని ప్రాక్టీస్ చేయడం మొదలు పెట్టండి. మీ భావాలకు, ఆలోచనలకు, ఆరోగ్యానికి ప్రాముఖ్యం ఇవ్వడం మొదలుపెట్టండి. మీ ఆలోచనలను, అవసరాలను స్పష్టంగా భయం లేకుండా మీ కుటుంబ సభ్యులకు అర్థమయ్యేలా చెప్పండి. ముఖ్యంగా మీ భాగస్వాములకు. Gentle, Firm భాషలో పంచుకోండి. ఇక సెలవా మరి..! మీ holistic well being కి అతి ముఖ్యమైన సెల్ఫ్ లవ్, సెల్ఫ్ కేర్, సెల్ఫ్ అవేర్‌నెస్ అనే ఈ triad ని మరిచిపోకండి. ■

Dr.Prathusha. Nerella
MD(General Medicine) CCEBDM; CCGDM; NLP; FID
Senior General Physician
Positive Psychologist certified Nutritionist
Diabetes And Lifestyle Expert
Pranic Healer Chiief Holistic Health Consultant And Medical Director @ Praveha General, Diabetes And Lifestyle Clinic - A Holistic Centre With Integrated Approach.
Ph: 8897684912/040-49950314



శరీర దానానికి అవరోధాలెన్నో?


(మొదటిపేజి తరువాయి)

కూడా పదుగురికి ఉపయోగపడాలి. దీనిపై కొన్ని స్వచ్ఛంద సంస్థలు ప్రజలను చైతన్యపరచే కార్యక్రమాలు చేపడుతున్నాయి. వాటిలో మత, ధార్మిక సంఘాల నాయకులను కూడా భాగస్వాములను చేస్తున్నాయి. ఎన్జీఓల కృషి ఫలితంగా మరణానంతరం మృతదేహాల అప్పగింతలు పెరుగుతున్నాయి. అదే సమయంలో అవయవ దానాలూ పెరుగుతున్నాయి. మరణానంతరం తన దేహాన్ని అప్పగించేందుకు ఓ వ్యక్తి ఇప్పుడు అంగీకార పత్రంపై సంతకం చేస్తే దాని ఫలితం ఆయన చనిపోయిన తర్వాతే తెలుస్తుంది. అంటే పేరు నమోదు చేసుకున్న 20-25 సంవత్సరాల తర్వాత కానీ సంఖ్య తెలియదు. కళ్లను దానం చేసే వారి సంఖ్య ఇటీవలి కాలంలో గణనీయంగా పెరుగుతోంది. తన కళ్లను దానం చేస్తానని ప్రముఖ నటి ఐశ్వర్యారాయ్ ఇటీవల ప్రతినబూనిన విషయం తెలిసిందే.

నిబంధనలలో మార్పులు అవసరం

పేరొందిన వైద్య సంస్థలలో పరిస్థితి బాగానే ఉన్నప్పటికీ అనేక వైద్య విద్య, శిక్షణా సంస్థలలో మృతదేహాల కొరత అధికంగా ఉంది. దీనిని అధిగమించేందుకు వైద్య కళాశాలలు అనాథ శవాలపై ఆధారపడుతున్నాయి. అయితే ఆ వ్యక్తుల మరణానికి కారణం తెలియదు కనుక విద్యార్థులు ఇన్ఫెక్షన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. తన మృతదేహాన్ని అప్పగించేందుకు ఓ రాష్ట్రంలో పేరు నమోదు చేసుకున్న వ్యక్తి మరో రాష్ట్రంలో మరణిస్తే ఆ దానానికి సార్థకం చేకూరదు. అందుకే కేంద్రీకృత వ్యవస్థ అవసరమున్నదని నిపుణులు సూచించారు. మృతదేహాల అప్పగింతకు సంబంధించిన నిబంధనలు అన్ని రాష్ట్రాలలోనూ ఒకేలా లేవు. సహజ మరణంపై ఆస్పత్రి సర్టిఫికెట్ ఇస్తే ఢిల్లీలో ఆ వ్యక్తి మృతదేహాన్ని బంధువులు విరాళంగా ఇవ్వవచ్చు. అదే ఉత్తరప్రదేశ్‌లో అయితే పోలీస్ వెరిఫికేషన్ కూడా అవసరమవుతుంది. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకొని నిబంధనలలో మార్పులు చేయాల్సిన అవసరం ఉంది.

హర్యానా గవర్నర్ దత్తాత్రేయ కాన్వాయ్‌కి ప్రమాదం


ఫైల్

హైదరాబాద్: హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కాన్వాయ్ స్వల్ప ప్రమాదానికి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి హర్యానా వెళ్లేందుకు దత్తాత్రేయ శంషాబాద్ విమానాశ్రయానికి బయల్దేరారు. కిషన్‌గూడ ట్రంపెట్ వంతెన సమీపంలోకి రాగానే.. ఓ కారు అకస్మాత్తుగా గవర్నర్ కాన్వాయ్ మధ్యలోకి వచ్చింది. దీంతో కాన్వాయ్‌లోని వాహనం డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో.. కాన్వాయ్‌లోని మూడు వాహనాలు అదుపుతప్పి ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మూడు వాహనాలు ధ్వంసం కాగా, భద్రతా సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఇదేం తీరు..!

(మొదటిపేజి తరువాయి)

నాయకుడిని లేదా బ్యూరోక్రాట్‌ని పొగిడితే అది మొత్తం న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని ప్రభావితం చేస్తుంది. మరొక ఉదాహరణ ఏమిటంటే, ఒక న్యాయమూర్తి వెంటనే ఎన్నికలలో పోటీ చేయడానికి తన పదవికి రాజీనామా చేస్తే, అది వారి నిష్పాక్షికతపై ప్రజల అవగాహనను ప్రభావితం చేయవచ్చు. నా అభిప్రాయం ప్రకారం.. ప్రజా క్షేత్రంలో న్యాయమూర్తి చర్య తప్పనిసరి సముచితంగా ఉండాలి" అని వ్యాఖ్యానించారు.

మే 2025లో భారత ప్రధాన న్యాయమూర్తి కావడానికి సిద్ధంగా ఉన్న న్యాయమూర్తి, న్యాయమూర్తులు రాజకీయ పక్షపాతాన్ని సూచించే బహిరంగ ప్రవర్తనపై స్పందించారు. అది మొత్తం న్యాయ వ్యవస్థ సమగ్రతను బలహీనపరుస్తుందని హెచ్చరించారు. అంతేకాకుండా, న్యాయమూర్తులు తక్షణమే ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాజీనామా చేయడంపై న్యాయమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వైఖరి న్యాయ నిష్పాక్షికత అవగాహనకు రాజీ పడుతుందని పేర్కొన్నారు.

న్యాయ విశ్వసనీయతను కాపాడే పునాది సూత్రాలపై కేంద్రీకృతమై ఉందని, ప్రత్యేకించి అధికార విభజన సిద్ధాంతం, న్యాయమూర్తుల నుంచి ఆశించే ప్రవర్తన, ఇది కొనసాగడానికి నిందలకు అతీతంగా ఉండాలని అన్నారు. వ్యవస్థపై ప్రజల విశ్వాసం కల్పించాలన్నారు.

"న్యాయ వ్యవస్థలో విశ్వాస లోపం మా సంస్థ పునాదికే ముప్పు తెస్తుంది. న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసం చెక్కుచెదరకుండా ఉండాలి. కాని విశ్వసనీయ లోటు ఉంటే, అది న్యాయ వ్యవస్థ వెలుపల న్యాయం కోసం ప్రజలను నెట్టవచ్చు. ఇది అప్రమత్తత, అవినీతి, విజిలింటేజిమ్ అనధికారిక మార్గాలతో కావచ్చు. ఇవన్నీ సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తాయి. అదేవిధంగా, కేసులు దాఖలు చేయడంలో, అప్పీలు నిర్ణయాలలో ప్రజల సంకోచానికి దారి తీస్తుంది" అని ఆయన అన్నారు.

న్యాయ వ్యవస్థ శాసన, కార్యనిర్వాహక శాఖల నుంచి స్వతంత్రంగా ఉండాలని జస్టిస్ గవాయ్ నొక్కిచెప్పారు. ఈ అధికార విభజన లేకపోతే న్యాయ నిష్పాక్షికతపై ప్రజల విశ్వాసాన్ని బలహీనపరుస్తుందని అన్నారు. న్యాయ వ్యవస్థను రాజకీయ ఒత్తిళ్ల నుండి నిరోధించాలనే రాజ్యాంగ నిర్మాతల ఉద్దేశాన్ని ఆయన గుర్తు చేశారు. న్యాయమూర్తులు తమ బహిరంగ ప్రవర్తనలో అత్యంత జాగ్రత్తగా ఎలా ఉండాలో ఆయన స్పష్టం చేశారు. ధర్మాసనంలో, వెలుపల న్యాయమూర్తి ప్రవర్తన అత్యున్నత నైతిక ప్రమాణాలను పాటించాలని అన్నారు.

విశ్వాసం లోటుకు దోహదపడే కీలక సమస్యలలో ఒకటి కోర్టు విచారణలో జాప్యమని, సుదీర్ఘమైన వ్యాజ్యం విచారణ ఆర్థిక, మానసిక నష్టాన్ని సూచిస్తుందని అన్నారు. "ఆలస్యం చేయబడిన న్యాయం, న్యాయాన్ని తిరస్కరించడం కిందకు వస్తుంది" అనే పురాతన సూత్రాన్ని గుర్తు చేశారు. జాప్యాలు ప్రజలను పూర్తిగా న్యాయం కోరకుండా ఎలా నిరోధించవచ్చు" అని వివరించారు.

న్యాయమూర్తి గవాయ్ జాప్యం హానికరమైన ప్రభావాలను స్పష్టం చేశారు. ప్రత్యేకించి క్రిమినల్ ట్రయల్స్‌లో, పొడిగించిన విచారణలు అమాయక వ్యక్తుల ముందస్తు నిర్బంధానికి, గౌరవాన్ని కోల్పోవడానికి దారితీస్తాయని అన్నారు. బాధితులకు, ఆలస్యాలు గాయాన్ని మరింత తీవ్రతరం చేస్తాయని పేర్కొన్నారు. సకాలంలో న్యాయం అందించే న్యాయ వ్యవస్థ సామర్థ్యంపై విశ్వాసాన్ని మరింత బలహీనపరుస్తుందని అన్నారు.

విశ్వాసం సన్నగిల్లడానికి దోహదపడే మరో అంశాన్ని ప్రస్తావిస్తూ, న్యాయ వ్యవస్థలో అట్టడుగు వర్గాలకు ప్రాతినిధ్యం లేకపోవడాన్ని జస్టిస్ గవాయ్ ఎత్తిచూపారు. నవంబర్ 2023లో సుప్రీం కోర్టు "స్టేట్ ఆఫ్ జ్యుడీషియరీ రిపోర్ట్"లోని భయంకరమైన గణాంకాలను ఆయన ఎత్తి చూపారు. ఇది జిల్లా న్యాయ వ్యవస్థలో భర్తీ చేయని పోస్టులలో 66.3 శాతం రిజర్వ్‌డ్ కేటగిరీల నుండి వచ్చాయని, షెడ్యూల్డ్ తెగలకు 84 శాతం పైగా సీట్లు ఖాళీగా ఉన్నాయని వెల్లడించిందని అన్నారు. న్యాయ వ్యవస్థ సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలను ప్రతిబింబించేలా ఉండాలని ఆయన ఉద్ఘాటించారు. అలా చేయడంలో విఫలమైతే ప్రాతినిధ్యం లేని సమూహాలను దూరం చేయవచ్చని, న్యాయ ప్రక్రియల్లో తమ గొంతులు తగినంతగా వినబడలేదని లేదా ప్రాతినిధ్యం వహించడం లేదని వారు భావించవచ్చని అన్నారు.

మే 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన జస్టిస్ గవాయ్ ప్రస్తుతం అత్యున్నత న్యాయస్థానంలో మూడో అత్యంత సీనియర్ న్యాయమూర్తి. జస్టిస్ కె జి బాలకృష్ణన్ తరువాత, సీజేఐ అవనున్న రెండో దళితుడు జస్టిస్ గవాయ్. జస్టిస్ సంజీవ్ ఖన్నా 2025 మే 3న పదవీ విరమణ చేసిన తరువాత, జస్టిస్ గవాయ్ సీజేఐగా పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన 2025 నవంబర్ 23 వరకు ఆ పదవిలో కొనసాగుతారు.

నేటినుంచే గ్రూప్-1 మెయిన్స్

(మొదటిపేజి తరువాయి)

అటు ప్రభుత్వం, ఇటు టీజీపీఎస్సీ ఇవ్వలేదు. అనేక ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా, అభ్యర్థులు ఆందోళన చేస్తున్నా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను నిర్వహించడానికే ప్రభుత్వం మొగ్గు చూపింది. దీంతో ఉత్కంఠకు తెరపడింది. సోమవారం నుంచి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగుతాయి. రాష్ట్రంలో 2011 తర్వాత గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ఇప్పుడే జరుగుతున్నాయి. దీంతో అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఏర్పాట్లు చేసింది. ఏ విధమైన పొరపాట్లకు తావు లేకుండా, అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నది. ఇంకోవైపు అభ్యర్థుల ఆందోళనల నడుమ పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. నిఘా నీడలో ఈ పరీక్షలు జరగబోతున్నాయి. హైదరాబాద్‌లో ఎనిమిది, రంగారెడ్డిలో 11, మేడ్చల్ మల్కాజిగిరిలో 27 కలిపి మొత్తం 46 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఈ ఏడాది ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన నిర్వహించింది. ఈ పరీక్షకు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 3.02 లక్షల మంది హాజరయ్యారు. వారిలో 31,383 మంది అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికయ్యారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద చీఫ్ సూపరింటెండెంట్ రూమ్, పరిసర ప్రాంతాలన్నింటిలోనూ సీసీ టీవీలను ఏర్పాటు చేసి అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

టీజీపీఎస్సీ కార్యాలయంలో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకునేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయి. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. మధ్యాహ్నం ఒకటిన్నర తర్వాత పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉండబోదని అధికారులు స్పష్టం చేశారు. సకాలంలో చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

చికెన్ బిర్యానీలో బెక బెక..

గచ్చిబౌలిలోని ప్రభుత్వ ట్రిపుల్‌ఐటీ కాలేజీలో ఘటన

ఆలస్యంగా వెలుగులోకి..

నవతెలంగాణ-మియాపూర్

రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని ప్రభుత్వ ట్రిపుల్‌ఐటీ విద్యాసంస్థ మెస్‌లో విద్యార్థులు తినే చికెన్ బిర్యానీలో కప్ప దర్శనమిచ్చింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐఐటీలోని విద్యార్థులు ఈ నెల 16వ తేదీన కాలేజీలోని మెస్‌లో భోజనం చేస్తున్న సమయంలో బిర్యానీలో కప్ప కనిపించింది. దాంతో విద్యార్థులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. వెంటనే ఈ విషయాన్ని కాలేజీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో విద్యార్థులు ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ప్రతిష్టాత్మక ఐఐటీలో విద్యార్థులకు ఇలా కల్తీ ఆహారం అందించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

బీజేపీ ఎమ్మెల్యేకు బిగ్ షాక్

గుజరాత్ హైకోర్టు ఆదేశాలు..

గజేంద్రసిన్హ్ పర్మార్‌పై లైంగికదాడి, బెదిరింపు కేసు

దళిత మహిళ పిటిషన్‌పై న్యాయస్థానం ఉత్తర్వులతో కదిలిన పోలీసులు

అహ్మదాబాద్ : గుజరాత్ బీజేపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గజేంద్రసిన్హ్ పర్మార్‌కు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. దళిత మహిళ ఫిర్యాదుకు సంబంధించి గుజరాత్ హైకోర్టు ఆదేశాల మేరకు ఆయనపై లైంగికదాడి కేసు నమోదైంది. దీంతో 2020 జులైలో జరిగిన ఘటనకు సంబంధించి భారతీయ శిక్షా స్మృతి (ఐపీసీ)లోని సెక్షన్ 376 కింద లైంగికదాడి, సెక్షన్ 506 కింద బెదిరింపు అభియోగాలు బీజేపీ ఎమ్మెల్యేపై రిజిస్టరయ్యాయి. ఆయన ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద అభియోగాలను ఎదుర్కొంటున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గజేంద్రసిన్హ్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవటాన్ని హైకోర్టు ప్రశ్నించింది. బాధితురాలి చేసిన ఫిర్యాదు ప్రకారం.. ఆమెను గజేంద్రసిన్హ్ 2020, జులై 30న గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్‌కు పిలిచాడు. పెండ్లి చేసుకుంటానని నమ్మబలికి బాధితురాలితో శారీరక సంబంధాన్ని నెరిపాడు. ఆ తర్వాత ఎమ్మెల్యే.. బాధితురాలిని పట్టించుకోవటం మానేశాడు. ఆమె ఫోన్ కాల్స్ వస్తే పట్టించుకునేవాడు కాదు. జరిగిన విషయాన్ని బటయకు చెప్తే తీవ్ర పరిణామాలుంటాయని బాధితురాలిని ఎమ్మెల్యే బెదిరించాడు. కొన్ని నెలల పాటు ఈ వేధింపులను ఎదుర్కొన్న బాధితురాలు.. ఎమ్మెల్యేపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసేలా పోలీసులకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ 2021లో హైకోర్టులో ప్రత్యేక క్రిమినల్ అప్లికేషన్‌ను దాఖలు చేసింది. అయితే, న్యాయస్థానం ఆమెకు అనుకూలంగా స్పందించింది. దీంతో పోలీసులు బీజేపీ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేశారు.

పర్మార్‌పై అనేక కేసులున్నాయి. రాజస్థాన్‌లో మైనర్‌ను వేధించిన విషయంలో ఆయన అభియోగాలు ఎదుర్కొంటున్నారు. గతేడాది ఈ కేసులో గుజరాత్ హైకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్‌ను సైతం తిరస్కరించింది.

త్వరలో సీఎన్‌జీ ధరల సెగ..

(మొదటిపేజి తరువాయి)

ఉంది. త్వరలోనే మహారాష్ట్ర, జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఆ తర్వాత ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ క్రమంలో పెరుగుతున్న ధరలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం సీఎన్‌జీ పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం సీఎన్‌జీ పై 14 శాతం ఎక్సైస్ సుంకం అమల్లో ఉంది. దీన్ని తగ్గించినట్లయితే, రిటైలర్లు పెరిగిన ధరను వినియోగదారులకు బదిలీ చేయాల్సిన అవసరం లేదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

ముంబయి, ఢిల్లీతో పాటు పలు నగరాల్లోనూ సీఎన్‌జీ పై ఆధారపడి అధికంగా వాహనాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో ధరల ప్రభావం ఓటర్లపై పడకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తుందని.. ఈ క్రమంలోనే సెంట్రల్ ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించే ఆలోచనలు ఉన్నట్లు చర్చ జరుగుతున్నది. కాగా.. ఆయా రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే సీఎన్‌జీ పై మళ్లీ ధరలు పెంచే అవకాశం ఉందని అనుమానాలు బలంగా వినపడుతోన్నాయి.

ఢిల్లీలో భారీ పేలుడు

- సీఆర్‌పీఎఫ్ పాఠశాల వెలుపల ఘటన
- రంగంలోకి ఎన్‌ఎస్‌జీ, ఎన్ఐఏ

న్యూఢిల్లీ : దేశ రాజధాని నగరం న్యూఢిల్లీలో ఆదివారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. కేంద్ర రిజర్వు పోలీసు బలగాలు (సీఆర్‌పీఎఫ్) రోహిణీ ప్రాంతంలో నిర్వహిస్తున్న పాఠశాల వెలుపల ఈ ఘటన చోటుచేసుకోవడంతో ఢిల్లీ ప్రజలు భయభ్రాంతులకు లోనయ్యారు. దేశ రాజధాని ప్రాంతం పరిధిలో శాంతిభద్రతలను నేరుగా కేంద్ర హోంశాఖయే పర్యవేక్షిస్తుంటుంది. ఏకంగా సీఆర్‌పీఎఫ్ పాఠశాల వద్దే దాడి చోటుచేసుకోవడంతో ఢిల్లీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..ఈ ఘటనలో ప్రాణనష్టమేదీ సంభవించలేదు. పాఠశాల గోడ ధ్వంసమైంది. సమీపంలో పార్క్ చేసిన కార్లు, చుట్టపక్కల ఇండ్ల అద్దాలు పగిలిపోయాయి. దుకాణాల సైన్ బోర్డులు దెబ్బతిన్నాయి. స్థానికులు పేలుడు దశ్యాలను ఫోన్లలో రికార్డు చేశారు. పేలుడు ధాటికి ఆ ప్రాంతంలో దట్టమైన పొగ వ్యాపించిందని వారు తెలిపారు. పేలుడుపై సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఆ తర్వాత ఫోరెన్సిక్ బందాలు, క్రైమ్, బాంబు డిస్పోజల్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఫోరెన్సిక్ నిపుణులు పాఠశాల గోడ వద్ద తెల్లని పౌడర్ గుర్తించారు. దాన్ని పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. దానితో పాటు పాఠశాల సమీపంలోని మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు అధికారులు చెప్పారు. ఎవరైనా దాడికి పాల్పడ్డారా లేదా భూగర్భ మురుగునీటి లైన్‌లోని వాయువు- పేలుడుకు కారణమైందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఘటనా స్థలంలోని సిసిటివి ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పేడులు నేపథ్యంలో న్యూఢిల్లీ అంతటా పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. పండుగ సీజన్ కావడం వల్ల వివిధ మార్కెట్లల్లో పెట్రోలింగ్ చేయనున్నట్లు చెప్పారు.

ఈ పేలుడు ఘటనపై దర్యాప్తు చేపట్టేందుకు జాతీయ దర్యాప్తు బందాలు రంగంలోకి దిగాయి. నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్‌ఎస్‌జీ), నేషనల్ ఇన్విస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) ఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టాయి. మరిన్ని ఆధారాల కోసం స్నిఫర్ డాగ్స్‌తో గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలాన్ని పూర్తిగా పరిశీలించడానికి ఎన్‌ఎస్‌జీ రోబోలను మోహరించింది. ఇప్పటికే పాఠశాలను తనిఖీ చేసిన ఫోరెన్సిక్ నిపుణులు, ఘటనాస్థలిలో లభించిన వైట్ పౌడర్‌ను ప్రయోగశాలకు పంపించినట్లు అధికారులు తెలిపారు. పేలుడు సంభవించినప్పుడు పాఠశాల సమీపంలో ఎవరెవరు ఉన్నారో తెలుసుకోవడానికి మొబైల్ నెట్‌వర్క్ డేటాను సేకరిస్తున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పేలుడు పదార్థాల చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రిజర్వ్‌బ్యాంక్ అస్త్రసన్యాసం

ద్రవ్యోల్బణం అదుపుపై కానరాని చర్యలు

- అదుపు తప్పుతున్న ఆహార ధరలు
- గిట్టుబాటు ధర కూడా దక్కని అన్నదాత
- తక్షణ చర్యలు తీసుకోవాలని నిపుణుల సూచన

ద్రవ్యోల్బణంతో... ముఖ్యంగా ఆహార ద్రవ్యోల్బణంతో పోరాడాల్సిన రిజర్వ్‌బ్యాంక్ అందుకు బదులుగా దాని తీవ్రతను తగ్గించే ప్రయత్నం చేస్తోంది. దీనికి కారణం లేకపోలేదు. ఆహార ధరలను అదుపు చేయడం కేవలం ఆర్‌బీఐ చేతిలోనే కాదు...ఏ కేంద్ర బ్యాంక్ చేతిలోనూ లేదు. చివరికి ఆర్థిక శాఖలోని అధికార గణం మొత్తం తన విధానాల అమ్ములపొది నుండి అస్త్రాలన్నింటినీ ప్రయోగించినప్పటికీ అవి ధరలను అదుపు చేయలేవు. మనం తాగే కాఫీలో చక్కెరను ఎలా నియంత్రించలేమో ఇదీ అంతే. అయినప్పటికీ ఆర్‌బీఐ తన ప్రయత్నాలు మానడం లేదు. రెండు సంవత్సరాలకు పైగా కేంద్ర బ్యాంక్ చేస్తున్న ప్రయత్నాలేవీ ఫలించలేదు.



న్యూఢిల్లీ : ఆర్‌బీఐ తన ప్రయత్నాలలో భాగంగా 2022 మే నుండి 2023 ఫిబ్రవరి వరకూ రెపో రేటును 250 బేసిక్ పాయింట్లు (2.5 శాతం) పెంచింది. అయినా ఆహార ధరలు దిగిరావడం లేదు. వంటగదిలో నిత్యావసరాలైన టమాటాలు, బంగాళదుంపలు, ఉల్లిగడ్డలు, పప్పులు, పండ్ల ధరలు కొండెక్కి కూర్చుంటున్నాయి. వాటిని చూసి గుండెల్లో దడ పుడుతోంది. ద్రవ్యోల్బణం పెరగడంలో టమాటాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. వీటి ధరలు ఓ దశలో 158.8 శాతం పెరిగాయి. మరోవైపు ఉల్లిగడ్డల ధరలు కూడా తామేమీ తక్కువ తినలేదన్నట్లు 86 శాతం పెరిగాయి.

ప్రత్యక్ష పోరుకు స్వస్తి

పండ్లు, కూరగాయలు...ఒకటేమిటి ? ఆహార వస్తువుల ధరలను నిర్ణయించేది డిమాండ్, సరఫరాలేనని ఆర్థికవేత్తలు చెబుతుంటారు. అయితే గత రెండు సంవత్సరాలుగా ఆహార ధరలు ఎలా ఉండాలో నిర్ణయిస్తోంది మాత్రం ద్రవ్యోల్బణమే. దానితో ప్రత్యక్ష పోరు సాగించకూడదని నిర్ణయించిన ఆర్‌బీఐ, 2023 ఫిబ్రవరి నుండి రెపో రేటును (వాణిజ్య బ్యాంకులకు కేంద్ర బ్యాంక్ అందించే రుణాలపై విధించే వడ్డీ రేటు) 6.5 శాతంగానే ఉంచుతోంది. ఆహార ద్రవ్యోల్బణాన్ని 4 శాతం కంటే తక్కువగా ఉంచేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించాల్సిందిగా ప్రముఖ వ్యవసాయ ఆర్థికవేత్త అశోక్ గులాటీ నేతృత్వంలో ఆర్థికవేత్తలతో కూడిన బృందాన్ని ఆర్‌బీఐ నియమించింది.

నిపుణుల బృందం ఏం చేసింది?

ద్రవ్యోల్బణంపై ఆహార ద్రవ్యోల్బణం గణనీయమైన ప్రభావమే చూపుతుంది. ఈ నేపథ్యంలో ఆహార ధరలు ఎప్పుడు, ఎందుకు భారీగా పెరుగుతాయో తెలుసుకునేందుకు గులాటీ బృందం ప్రయత్నించాల్సి వచ్చింది. ఎందుకంటే ద్రవ్య విధాన రూపకల్పనలో ద్రవ్యోల్బణ అంచనాలు కీలక పాత్ర పోషిస్తాయి. డిమాండ్-సరఫరాతో పాటు రుతుపవనాలు, ఉత్పాదక వ్యయం, గ్రామీణ వేతనాలు, ప్రొటీన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలకు ఉన్న డిమాండ్, కనీస మద్దతు ధరలు, ప్రభుత్వ విధానాలు వంటి పలు అంశాలను ఈ బృందం పరిశీలించింది. ఆర్థికవేత్తల బృందం నాలుగు కీలక గ్రూపులను...కూరగాయలు, పప్పులు, పండ్లు, పశు సంపద...గుర్తించింది. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కూడా లభించడం లేదని అర్థం చేసుకుంది.

డిమాండ్-సరఫరా మధ్య వ్యత్యాసాలు

రైతులకు ఆర్థికంగా మంచి ఆదాయం లభించాలంటే ఇతర చర్యలతో పాటు తక్షణమే మార్కెటింగ్ సంస్కరణలు చేపట్టాలని ఆర్థికవేత్తల బృందం సూచించింది. ఇతర దేశాలలో వినియోగ ధరల సూచీ (సీపీఐ) 10-20 శాతం మధ్యే ఉంటుంది. కానీ మన ద్రవ్యోల్బణంలో అది 45.86 శాతంగా ఉంది. ఇందులో ఆహారం పైనే 39.06 శాతం ఉండడం గమనార్హం. ఈ పరిణామం విధానకర్తలకు సవాలు విసురుతోంది. ప్రపంచంలో టమాటాలు, ఉల్లిగడ్డలు, బంగాళదుంపలు అధికంగా పండించే దేశాలలో భారత్ కూడా ఉన్నప్పటికీ డిమాండుకు తగిన విధంగా సరఫరాలు జరగడం లేదు. పైగా వాతావరణ ప్రతికూలతలు పంట దిగుబడులను దెబ్బతీస్తున్నాయి. ఈ నేపథ్యంలో కూరగాయలను నిల్వ చేసే సదుపాయాలను పెంచాలని, పంట దిగుబడులను పెంపొందించాలని ఆర్థికవేత్తలు ప్రభుత్వానికి సూచించారు.

రైతుకు చేరేది ఇంతే

ఉదాహరణకు వినియోగదారులు చెల్లించే డబ్బులో రైతులకు టమాటాలపై 33 శాతం, ఉల్లిగడ్డలపై 36 శాతం, బంగాళదుంపలపై 37 శాతం మాత్రమే దక్కుతోంది. అలాగే దేశీయ విలువలో అరటి పండ్లపై 31 శాతం, ద్రాక్ష పండ్లపై 35 శాతం, మామిడి పండ్లపై 43 శాతం మాత్రమే లభిస్తోంది. అయితే పప్పులు, పశుఉత్పత్తులపై మాత్రం రైతుకు కొంత అదనపు ఆదాయమే వస్తోంది. పచ్చి శనగపప్పుపై వినియోగదారులు చెల్లించే సొమ్ములో 75 శాతం వరకూ తిరిగి రైతుకు చేరుతోంది. అలాగే పెసర పప్పుపై 70 శాతం, కంది పప్పుపై 65 శాతం రైతుకు లభిస్తోంది. అదే విధంగా వినియోగదారులు చెల్లించే సొమ్ములో పాలపై 70 శాతం, గుడ్లపై 75 శాతం రైతు జేబులో పడుతోంది. కోడి మాంసం విషయంలో ఈ వాటా 56 శాతంగా ఉంది.

ఆహార ధరలకు రెక్కలు

ప్రొటీన్లను అధిక పరిమాణంలో అందించే పప్పుల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయి. 2002-03 నుండి 2022-23 వరకూ రిటైల్ ఆహార ధరల ద్రవ్యోల్బణం నాలుగు సందర్భాలలో 10 శాతం దాటేసింది. కోవిడ్ తర్వాత ఆహార ద్రవ్యోల్బణం భారీగా పెరిగింది. సరఫరాలలో ఎదురైన ఇబ్బందుల కారణంగా 2022 మార్చి-అక్టోబర్ మధ్య 7.6 శాతం, 2023 జూలై-డిసెంబర్ మధ్య 8.2 శాతం నమోదైంది. పండ్ల ఉత్పత్తి పెరిగినప్పటికీ అననుకూల వాతావరణ పరిస్థితుల కారణంగా ధరలకు రెక్కలు వచ్చాయి. కొన్ని సందర్భాలలో నిల్వ సదుపాయాలు లేకపోవడంతో రైతులు తక్కువ ధరకే తమ ఉత్పత్తులను తెగనమ్ముకోవాల్సి వచ్చింది.



కుమారులకు అండగా చెరుపల్లి లక్ష్మమ్మ

- చెరుపల్లి సీతారాములు మాతృమూర్తి సంస్మరణ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, శాసనమండలి చైర్మెన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి

నవతెలంగాణ-చిట్యాల

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాతృమూర్తి చెరుపల్లి లక్ష్మమ్మ.. కుమారులకు ఎన్ని నిర్బంధాలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొని, వారికి అండగా నిలబడ్డారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలోని బీఎస్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో చెరుపల్లి లక్ష్మమ్మ సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు.. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి. నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి.సాగర్, టి.జ్యోతి, ఎండీ అబ్బాస్, పాలడుగు భాస్కర్, నవతెలంగాణ ఎడిటర్ ఆర్.సుధాభాస్కర్, న్యూస్ ఎడిటర్ రాంపల్లి రమేష్, బుక్ హౌస్ ఎడిటర్ కె.ఆనందాచారి, ఎమ్మెల్యే వేముల వీరేశం, రాష్ట్ర మదర్ డెయిరీ చైర్మెన్ గుత్తా అమిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల నర్సింహారెడ్డి, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి, సీపీఐ(ఎం) నల్లగొండ యాదాద్రి జిల్లా కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎండీ జహంగీర్, నాయకులు తుమ్మల వీరారెడ్డి, బొంతల చంద్రారెడ్డి, జిట్ట నగేశ్, అవిశెట్టి శంకరయ్య, నారబోయిన శ్రీనివాస్, జడల చిన్నమల్లయ్య, మారగోని ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా వెల్దండి నిత్యానందరావు బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-కల్చరల్

తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నియమితులైన ఆచార్య వెల్దండి నిత్యానందరావు ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన నియామకం పట్ల పలువురు సాహితీవేత్తలు అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

ఏఐ అంటే రేవంత్ రెడ్డి ఎనుముల ఇంటెలిజెన్స్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అంటే రేవంత్ రెడ్డి ఎనుముల ఇంటెలిజెన్స్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. రాష్ట్రంలో 40 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసినట్టు జాతీయ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో చేసిన పోస్టుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రుణమాఫీ చేసినట్టు ఇచ్చిన ప్రకటనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రూపొందించిన చిత్రాన్ని వాడారనీ, రైతుల లెక్క విషయం లోనూ సీఎం అదే టెక్నిక్ వాడారని ఆరోపించారు. నిజానికి తెలంగాణలో ఇప్పటి వరకు రైతు రుణాలు 40 శాతం కూడా మాఫీ కాలేదని చెప్పారు. కానీ తరుచూ నిబంధనలతోపాటు రుణమాఫీ తేదీలను మారుస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి తన సొంత గ్రామం, నియోజకవర్గంలోనూ రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణమాఫీ నిబంధనలు, తేదీలు మారుతున్నాయనీ. అబద్ధాలు, బూటకపు ప్రచారాలు మాత్రం నిత్యం ఎలాంటి మార్పు లేకుండా కొనసాగుతు న్నాయని విమర్శించారు.

మలేషియా తెలంగాణ ఉత్సవాలకు కేటీఆర్‌కు ఆహ్వానం

మలేషియా తెలంగాణ అసోసియేషన్ దశాబ్ది ఉత్సవాలకు హాజరుకావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆ సంస్థ ఆహ్వానించింది. వచ్చే నెల నవంబర్ 9నుంచి కౌలాలంపూర్‌లో పెద్ద ఎత్తున వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపింది. మలేషియా తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షులు తిరుపతి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం ఆదివారం హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో కేటీఆర్‌ను కలిసి ఆహ్వానం అందించింది. ఈ సందర్భంగా మలేషియా లోనూ తెలంగాణ వాసులు తమకంటూ ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసుకుని వివిధ కార్యక్రమాలతో పుట్టిన గడ్డతో మమేకం కావడం పట్ల కేటీఆర్ వారిని అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు కార్తీక్ రెడ్డి, రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నవచిత్రం

మళ్ళీ మళ్ళీ చూసేలా..



విశ్వక్‌సేన్, శ్రద్ధా శ్రీనాథ్

విశ్వక్ సేన్ నటిస్తున్న నూతన చిత్రం 'మెకానిక్ రాకీ'. నూతన దర్శకుడు రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. మేకర్స్ ఆదివారం 'మెకానిక్ రాకీ' ట్రైలర్ 1.0 లాంచ్ చేశారు. శ్రీరాములు థియేటర్లో భారీగా హాజరైన అభిమానుల సమక్షంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా విశ్వక్ సేన్ మాట్లాడుతూ,'నవంబర్ 22 సినిమా రిలీజ్. రీసెంట్‌గా సినిమా చూశా. చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాను. నవంబర్ 21న పెయిడ్ ప్రీమియర్స్ వేస్తాం. సినిమా ఎడ్జ్ ఆఫ్ ది సీట్ ఎక్స్‌పీరియన్స్ చేస్తారు. రెండోసారి సినిమా చూసే రేంజ్‌లో ఉంది. ఇది ట్రైలర్ 1.0. రిలీజ్ దగ్గరలో మరో ట్రైలర్ రిలీజ్ అవుతుంది' అని తెలిపారు.

'ట్రైలర్ అందరికీ బాగా నచ్చిందని అనుకుంటున్నాను. ఇంకా చాలా కంటెంట్ ఉంది. ఒకొక్కటి అనౌన్స్ చేస్తూ ఉంటాం. అవన్నీ మీకు చాలా ఎగ్జైటింగ్‌గా ఉంటాయని ఆశిస్తున్నాను' అని డైరెక్టర్ రవితేజ చెప్పారు.

నిర్మాత రామ్ తాళ్లూరి మాట్లాడుతూ, 'సినిమా కూడా మాస్ కా దాస్ రేంజ్‌లో ఉటుంది. నవంబర్ 22 థియేటర్స్‌లో మాస్ జాతర ఖాయం. అందరూ థియేటర్స్‌కి వచ్చి చూసి ఎంజాయ్ చేయండి' అని అన్నారు.

డ్రగ్స్ నేపథ్యంలో ది షార్ట్ కట్

డి ఎల్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై ఆట సందీప్ హీరోగా, శగ్న శ్రీ హీరోయిన్‌గా రామకృష్ణ కంచి దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'ది షార్ట్ కట్'. ఈ చిత్ర ట్రైలర్ రిలీజ్ వేడుక ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగింది. కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'ఆట సందీప్ హీరోగా ఎదగడం ఎంతో సంతోషంగా ఉంది. అయితే హీరోగా ఎంత ఎత్తుకు ఎదిగినా కొరియోగ్రఫీని మాత్రం విస్మరించవద్దు. ఈ సినిమాలో ఉన్న డైలాగులు కొన్ని సినిమా వాళ్ళ జీవితాలకు అతి దగ్గరగా ఉన్నాయి. దర్శకుడు రామకృష్ణ సినిమాను చాలా బాగా తీశారు. ఈ సినిమా తప్పకుండా హిట్ అవుతుంది' అని తెలిపారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886